తెలంగాణ జాగృతి

# తంగేడు

తెలుగు సాహిత్య పక్ష పత్రిక



ఫిబ్రవరి 01, 2021

సంపుటి 01, సంచిక 08

*Complimentary Copy - 8*

## భారత కవి కోకిల...



తల్లులందించే స్ఫూర్తి, వారి ప్రేమ, త్యాగాలపైనే దేశం
గొప్పతనం ఆధారపడి ఉంటుంది.

- సరోజినీ నాయుడు

***Printed and Published by : TELANGANA JAGRUTHI***
Pasham Amruthaaram Residency, H.No. 1-2-234/13/46/4, 3rd Floor, Near NTR Stadium Aravind Nagar,
Domalguda, Hyderabad - 500 029. Telangana State. E-mail : editor@thangedu.co.in

విషయ సూచిక



అజ్ఞాత సౌందర్యం కోసం తపించే అన్వేషి కవిత... **చెలియా...** 25

27 ఆభరణాలతో స్త్రీ పొందిన తాదాత్మ్యం తాత్వికంగా చెప్పిన **వాణి దేవులపల్లి** కథ...





13 సాహిత్య పోషకులు, సాహితీవేత్త దేవులపల్లి **రామానుజరావు**ను ఆవిష్కరించే **చెన్నయ్య** వ్యాసం...



21 **ప్రపంచీకరణ** ద్వారా తెలంగాణ కథల్లో వచ్చిన మార్పులను చెబుతున్న **బివిఎన్ స్వామి....**



17 కాళోజీలో కథా ప్రక్రియ మెలకువల్ని చెప్తున్న **ఎలనాగ** వ్యాసం...



05 **పందెం** కూడా మానవత్వ కోణానికి, అధ్యయనానికి దారి తీసిందని ఓటమిలోనే గెలుపు చూసిన **ఇందిరాదేవి** కథ...



37 కవి శిఖరం **డా॥ ఎన్. గోపీతో రఘు** ముఖాముఖి....



09 నాటి కథల్లో అంతర్లీనంగా ఉన్న సామాజిక భూమిక వివరించే వ్యాసం... **నాటి తెలంగాణ కథ, సామాజికత...**



08 కందనామాత్యుని **సకల నీతిని** తెలుపుతున్న నాటి కవిత...

అపర కాళిక లాంటి అమ్మాయి ధైర్యాన్ని చెబుతున్న **పిన్నంశెట్టి కిషన్** కథ **'పంచ్ కళ్యాణి'... 32వ పేజీలో...**

**సిధారెడ్డిని రెప్పవాల్చని కవి**గా అభివర్ణిస్తున్న **నిరంజన్... 41వ పేజీలో...**

**ప్రపంచీకరణ విధ్వంసాన్ని** చిత్రించిన **శిరంశెట్టి** సాహిత్యం పరిచయం చేసిన **కె.పి. అశోక్ 45వ పేజీలో...**

మనీ మేనేజ్‌మెంట్‌గా **హిమజ బొడ్డ సంచి** కవిత.... **12వ పేజీలో...**

కరోనా వల్ల వచ్చిన **గృహవాసం** కవిత **కొండపల్లి నీహారిణి.... 20వ పేజీలో...**

**సిహెచ్. ఆంజనేయులు అంతులేని విషాదం, వేణుశ్రీ-తేలదెపుడు....** కవిత్వాలు... మరియు దృశ్య సాహిత్యం, శిఖరం, కొత్త పుస్తకాలు, స్వీకారం... మరెన్నో....

# తంగేడు సంచికకు స్పందన...

తంగేడు పత్రిక బాగుంది. కవిత గారికి అభినందనలు.
**- వై. సత్యనారాయణ, కవి.**

ప్రపంచ సాహిత్యంలో గర్వంగా తల ఎత్తుకోదగిన పత్రిక తెలంగాణ నుండే రావడం చాలా సంతోషం కలిగిస్తుంది.
**- ప్రొ॥ బన్న అయిలయ్య** వరంగల్

తంగేడు బాగుంటుంది. కథలు, వ్యాసాలు, కవితలు అన్ని ఆకర్షిస్తున్నాయి.
**- తాటికొండ ఝాన్సీ,** విశ్రాంత తెలుగు అధ్యాపకురాలు.

మీ తంగేడు బాగుంది. అభినందనలు.
**- సరస్వతీ శ్రీనివాస్ రాజు,** ఉపాధ్యాయులు, కరీంనగర్

ఎంత ముచ్చటగా ఉంది తంగేడు.
**- ఎ. అంజని, ఉపాధ్యాయిని**

తంగేడు దినదిన ప్రవర్థమానమవుతున్నది. వ్యాసాలు, కథలు బాగుంటున్నాయి. జనవరి సంచికలో పెద్దింటి అశోక్ కుమార్ గారి అంతర్మథనం, గుడిపాటి వ్యాసం ప్రత్యేకంగా బాగున్నాయి. పత్రికను చక్కగా రూపొందిస్తున్న సంపాదక వర్గానికి అభినందనలు.
**- సి. మృణాళిని,** సాహితీవేత్త

తంగేడు జనవరి 16-31 సంచిక చూసిన. ఒక సంచికను మించి మరొకటి మరింత బిగుతైతున్నది. అభినందనలు.
**- బైరెడ్డి కృష్ణారెడ్డి, కవి** నల్గొండ

తంగేడు ఎంత సొబగుగా ఉంది. అభినందనలు.
**- డా॥ దామోదర రాములు,** కవి మంచిర్యాల

'తంగేడు' పత్రికను ప్రతిష్ఠాత్మకంగా తెస్తున్నారు. శుభాకాంక్షలు.
**- కొండపల్లి నీహారిణి,** కవయిత్రి, యు.ఎస్.ఎ.

సంపాదకీయం

తెలంగాణ జాగృతి
తెలుగు సాహిత్య పక్ష పత్రిక

01 ఫిబ్రవరి, 2021

సంపుటి 01 సంచిక 08



శ్రీమతి కల్వకుంట్ల కవిత
ఎడిటర్



డా॥ కాంచనపల్లి గో.రా.
అసోసియేట్ ఎడిటర్
9676096614

# యువత ముందుకు రావాలి

ఏదైనా సాహితీ సభ జరిగితే ఒక మాట తరచుగా వినేవాళ్ళం. సభకు వచ్చిన వక్తలు, ప్రేక్షకులు అంతా ఏభై ఏళ్ళు పైబడ్డవారే నని. ఇది నిజంగా సాహితీ భవితవ్యానికి ప్రశ్నార్థకమే అనిపించేది. సాహితీ ప్రియులకు దిగులు కలిగించేది. యువత సాహిత్యం పట్ల ఎందుకింత నిరాసక్తంగా ఉంటుంది? అని చింత పడే వాళ్ళం. కాని తెలంగాణ ఉద్యమం వల్ల ఈ పరిస్థితి మారింది. యువ సాహిత్యకారులు పోటెత్తారు. అంతవరకు కొనసాగిన నిర్లిప్తతకు తెరపడింది.

అదే యువత చాలా మంది ఇపుడు సామాజిక మాధ్యమాలలో కొనసాగుతున్నారు. ఎవరికి వాళ్ళు కవితలు రాసి వాట్సాప్‌లలో ఫేస్‌బుక్‌లో ఇతర బ్లాగ్‌లలో పెడుతున్నారు. వాళ్ళ మిత్రులు దాన్ని చూసి లైక్‌లు కొడుతున్నారు. ఈ ప్రచారం వల్ల వాళ్ళు గొప్పసాహితీ వేత్తలం అనే భ్రమకి లోనౌతున్నారు. సోషల్ మీడియా ద్వారా తమ రచనలకు ప్రచారం తెచ్చుకోవడం తప్పు కాదు. అసలు రచయిత అనేవాడికి తగిన ప్రకాశం, ప్రచారం, ఉండాల్సిందే, ఇది కాదనలేని అంశం.

అయితే ఎవరికి వాళ్ళు విధించుకొనే పరిమితులలో ఉండే వాళ్ళు సాహితీకారులు అయిపోతారా? రచనలు సాహితీ చరిత్రలో నిలుస్తాయా? సరైన ప్రాపంచిక దృక్పథం, సామాజిక కోణం, ప్రాచీనార్వాచీన సాహిత్యాల మీద అవగాహన, ఇతర భాషా సాహిత్యాలతో ఇతోధిక పరిచయం లేకుండా కేవలం వాచ్యమాత్రంగా ఉన్న రచనల వల్ల సాహిత్యం పుష్టి వంతం అవుతుందా? ఇది గమనించాల్సిన అవసరం ఉంది.

నాటి దాశరథి, సి.నా.రె. విశ్వనాథ, శ్రీశ్రీ, జాషువా, వానమామలై లాంటి కవులకు ఎన్ని భాషా సాహిత్యాల మీద పట్టు ఉండేది? వీళ్ళ రచనలలోనూ, ప్రసంగాలలోనూ, ఎంత విజ్ఞానం తొణికిసలాడేది? వీళ్ళ నిర్మాణ పద్ధతిలో ఎంత చక్కని సౌందర్య దృక్పథం భాసించేది? అట్లాగే వచన కవిత్వం రంగంలోకి వచ్చాక కూడా సృజనకారుల అపార సాహితీ కృషిని మనం ఎట్లా విస్మరించ గలుగుతాం?

ఈ ఒరవడి మీద యువ సాహితీవేత్తలు దృష్టి సారించాలి. సామాజిక మాధ్యమాలకు పరిమితం కాకుండా విస్తృతం కావాలి. దీనికి తగిన అధ్యయనాన్ని జోడించాలి. పుస్తకాలు కొని చదివే ఆరోగ్యకరమైన సంప్రదాయాన్ని సాహిత్యంలోకి తేవడానికి ప్రయత్నం జరగాలి.

తాత్కాలికంగా లభించే చప్పట్లు, సన్మానాలు, పురస్కారాలకు మాత్రమే కాకుండా రచనలు శాశ్వతంగా జీవించగలిగే గాఢత ఈ యువ సాహితీ వేత్తలు సంతరించుకోవాలి. తరం నుండి తరం వరకు ప్రవహించే కొద్దీ సాహిత్యం కొత్త పుంతలు తొక్కుతుంది. వేల ఏండ్ల నాటి సాహితీకారులు ఇప్పటికీ సజీవంగా ఉన్నారు. కాలావధులకతీతంగా నడచే ఈ ప్రవాహం గాఢమైన సృజన వల్లనే సాధ్యమౌతుంది.

సాహితీవేత్తలు పొందే పురస్కారాలకు ఆక్షేపణ కాదిది. అవి కేవలం స్ఫూర్తిని ఉత్సాహాన్ని మాత్రమే ఇస్తాయి. సాహితీకారున్ని నిలబెట్టేది సాధన, అధ్యయనమే.

యువలోకం ఈ దిశగా అలోచించగలదని ఆశిద్దాం. తెలంగాణ సాహితీ సరోవరం యువ రాజహంసలతో మరింత ఉజ్వలం కాగలదని ఆకాంక్షిద్దాం...

జై తెలంగాణ, జై జాగృతి.

కవిత

# వలస

మొన్న...
నెత్తి మీద సద్దిమూట బెట్టుకుని
పొట్ట చేత బట్టుకుని
పల్లె విడిచి
పట్నమొచ్చిండు మా నాయన-

నేడు...
చంకలో కంప్యూటర్ బెట్టుకుని
కెరీర్ కెరీర్ అంటూ
పట్నమిడిచి
పరాయి దేశాలకు పోతున్రు మా పిల్లలు-

నేను...
మొన్నకూ, నేటికీ నడుమ
పల్లెకూ, పరాయి దేశానికీ నడుమ
ఎటూ కానివాడినై
ప్రశ్నార్థకంగా మిగిలాను...





**ఆచార్య ఎస్వీ సత్యనారాయణ**

## రచయితలకు సూచనలు

- ✓ సమీక్ష కోసం పుస్తకాలు పంపేవారు విధిగా రెండు కాపీలు పంపాలి.
- ✓ పత్రిక కోసం రచనలు పంపించే వారు యునిక్ కోడ్‌లో ఉంటే ఓపెన్ ఫైల్ మరియు పిడిఎఫ్‌లో మెయిల్ చేయండి.
- ✓ మా పత్రికకు రచనలు పంపినవారు ఇక్కడ అచ్చయాకనే ఫేస్ బుక్‌లో బ్లాగ్‌లో పెట్టండి.
- ✓ ప్రతి రచనకు ఇది ఎక్కడా ప్రచురణ కాలేదని, ఏ బ్లాగ్‌లో పోస్ట్ చేయలేదని, ప్రచురణ ప్రసారం కోసం ఎవరికీ పంపి ఉండలేదని హామీ పత్రం జత చేయండి.
- ✓ పత్రికలో ఒక కథ లేదా వ్యాసానికి నాలుగు పేజీలు మాత్రమే అవకాశం ఉంటుంది. ఈ లెక్కన పదమూడు వందల పదాలకు మించకుండా వ్యాసం, కథ పంపించండి.
- ✓ కవితలు 15 పాదాలకు మించకుండా పంపించండి.
- ✓ వ్యాసాలు, కథలు, కవితలు ఏవైనా పోస్ట్‌లో కూడా ఈ క్రింది చిరునామాకు లేదా ఇ-మెయిల్‌కు పంపవచ్చు.

**తెలంగాణ జాగృతి**
పాశం అమృతరాం రెసిడెన్సీ, ఇ.నెం. 1-2-234/13/46/4, 3వ అంతస్తు, ఎన్.టి.ఆర్. స్టేడియం దగ్గర, అరవింద్ నగర్, దోమలగూడ, హైదరాబాద్ - 500 029. తెలంగాణ. E-mail : editor@thangedu.co.in

నాటి కథ

# పందెం

**1941లో వెలువడ్డ ఈ కథలో మనిషి అలవాటైన అంశాన్ని దేన్నైనా స్వీకరిస్తాడని మనం స్వేచ్ఛ అనుకున్నదానిలో నిజమైన స్వేచ్ఛ లేదని నిరూపించారు రచయిత్రి...**



నందగిరి ఇందిరాదేవి

ఆ నాటి సాయంకాలం స్నేహితులంతా సేటు రాజారాం ఇంట్లో విందారగించి కులాసాగా కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నారు. వివిధ విషయాలను చర్చిస్తున్నారు. ఉత్సాహంగా సేటు రాజారాం తెల్లటి పరుపు మీద ఉన్న పట్టుదిండ్లకొరిగి హుక్కా పీలుస్తున్నాడు అవసరమని అనుకొన్న చోట్ల తాను కూడా పాల్గొంటూ. దగ్గర నిలువ బడియున్న నౌఖరు లక్ష్మణ్ ఖాళీయైన గాజుగ్లాసులో వైను నింపుతున్నాడు. స్నేహితులు సేటు బలవంతం చేయాలని బెట్టుసరిగానే ఖాళీ చేస్తున్నారు పాత్రలు. సేటు "లక్ష్మణ్! మొన్న ప్రత్యేకంగా ఆర్డరిచ్చి తెప్పించిన సీసా తీసుకురా" అన్నాడు. లక్ష్మణ్ తెచ్చి మళ్లీ గ్లాసులో నింపాడు. స్నేహితులు ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు. 'సేట్! వ్యాపారం బాగా సాగుతున్నట్లుందే! అన్నాడొక స్నేహితుడు. 'అవును మరి లేకపోతే ఇంత ఖరీదు గల వైను తెప్పించటం సామాన్యమా' అన్నాడు మరొకడు. లక్ష్మణ్ అందిచ్చిన గ్లాసు తీసుకుంటూ సేటు కూడా గ్లాసులోనిది కొద్దిగా చప్పరించి స్నేహితులవంక చూచి మందహాసం చేశాడు.

గ్లాసులు ఖాళీ కావటంతో ఉత్సాహం ఇనుమడించింది అందరికీ. అంతకు ముందుదాకా చర్చిస్తున్న విషయం మళ్లీ ఎత్తుకున్నారు. 'మీరు ఏమన్నా అనండి! యావజ్జీవం ఖైదు శిక్ష అనుభవించటం చాలా ఘోరం. అంతకంటే రెండు నిమిషాల్లో ప్రాణం పొయ్యేటట్లు ఉరితీయటం మంచిది' అన్నాడు రాంలాల్ పట్టుదలగా.

'బతికితే బలుసాకయినా తినొచ్చు. అసలే లేకుండా అంతమొందటంకంటె ఎట్లాగో ప్రపంచం మీద ఉండటంనయం' అన్నాడు నరోత్తందాసు. 'ఏమి స్వేచ్ఛ లేక జీవితాంతంవరకు ఆశలన్నీ చంపుకొని బతికి బాధపడటంకంటె ఉరిశిక్ష అనుభవించటం చులకనగాదూ" అని తాను కూడా ఒక సమిధ వేశాడు సేటు.

'ఈ రెండు శిక్షలూ నాగరిక దేశాల్లో గర్హమయినవి. నెమ్మదిగానో తొందరగానో వ్యక్తుల ప్రాణాలు తీయటమే ఈ రెంటి ఉద్దేశం. కాని తప్పుచేసిన వాళ్లను మంచిమార్గంలో ప్రవేశపెట్టటానికి బదులు సంఘంలోనుండి వాళ్లను పూర్తిగా అంతమొందించటం దెబ్బతగిలిన వేలును పూర్తి కోసివేయటం వంటిది' అన్నాడు.

లలితా ప్రసాదు చేతిలోని సిగరెట్టు బూడిద దులుపుతూ. నిజమే! ఈ రెంటిలో నాకయితే యావజ్జీవ శిక్షేనయమనిపిస్తుంది' అన్నాడు నరోత్తందాసు సేటువంక చూస్తే సేటు తన మాటను పడగొట్టాలని అన్నట్లుగా అనుకొని 'యావజ్జీవం ఏమిటోయి? ఒక ఐదేండ్లు ఉండలేవు! ఏకాంతంగా యావజ్జీవం గడపాలంటే మాటలా?, అన్నాడు సేటు పూర్తిగా వాదనలోకి జొరబడి. ఇద్దరికీ తమ మాట నెగ్గాలన్న పంతం ఎక్కువయి వాదన ముదురుతోంది. స్నేహితులు వాళ్లకు పొగవేస్తున్నారు. తాము తమాషా చూస్తే, 'ఐదేళ్లుకాదు పదేళ్లుంటాను నువ్వు ఎట్లా చెప్పితే అట్లా' అన్నాడు నరోత్తందాసు, 'ఆ! పందెం! రెండు లక్షలు!" అన్నాడు సేటు ఉద్రేకం పట్టలేక, 'ఓ సిద్ధం! నువ్వు రెండు లక్షలు గుమ్మరించాలి మరి ?' అన్నాడు నరోత్తందాసు. 'తప్పకుండా?" అన్నాడు. సేటు.

ఇంకేముంది? వ్యవహారం ముదిరింది. సేటు రాజరాంతోటలో పదేళ్లపాటు ఏకాంతవాసం నరోత్తందాసు అనుభవించేటట్లు తదుపరి నరోత్తందాసుకు సేటు రెండు లక్షలు ఇచ్చేటట్లు ఒప్పందం చేయించారు. స్నేహితులు.

సేటు అంతా అయిపోయ్యాక కళ్లు తెరిచాడు. "ఎంతపని జరిగింది? ఎందుకు వచ్చినట్లు ఈ రెండు లక్షలదండుగ" అన్నాడు. స్నేహితులతో, స్నేహితు లందరూ రెండు లక్షల కొరకు వెనుకకు పొయ్యే పీనాసి అని బనాయించారు. సేటు సిగ్గుతో మారుమాట్లాడక ఒప్పందం అంగీకరించాడు.

తోటలో ఒక గది ప్రత్యేకించారు నరోత్తందాసుకొరకు. సరిగ్గా పదేళ్లకు ఏ రెండు నిమిషాలు తక్కువయినా కూడా రెండు లక్షలు చెల్లించే బాధ్యత సేటుకు ఉండదు. ఖైదీకి కావలసిన వస్తువులు ఆర్డరు వ్రాసి తెప్పించుకోవచ్చు. పుస్తకాలు బట్టలు భోజనం వగైరాలు. అతనికి బాహ్య ప్రపంచంతో ఏమాత్రం సంబంధం ఉండకుండా ఈ వస్తువులన్నీ కిటికీ ద్వారానే వెళ్లవలసి ఉండేవి. ఖైదీ కావాలంటే ఉత్త రాలు వ్రాసుకోవచ్చు.

మొదటి సంవత్సరమంతా చాల విసుగుగా, విచారంగా గడిపాడు. ఖైదీ ఎన్నోసార్లు ఏడవటం కూడా వినపడేది అక్కడి చౌకీదారుకి, రెండు మూడేళ్ల గడిచాక ఈ ఒంటరి జీవితానికి అలవాటు పడ్డాడు. రాత్రింబగళ్లు చదవటమే చదవటం. ఖైదీ కావాలెనని వ్రాసి పంపిన పుస్తకాలు తెప్పించకలేక అవస్థపడేవాడు సేటు, తన స్థితిని గురించి విచార పడటానికి సమయమే చిక్కకపోయేది ఖైదీకి. ఒకనాడు సేటుకు ఖైదీ పదిభాషలలో ఒక ఉత్తరం వ్రాశాడు. ఆ ఉత్తరం ఆయాభాషలు వచ్చినవాళ్లకు చూపెట్టుమని తప్పులు లేకుండా సరిగా ఉన్నట్లయితే తోటలో శంఖు ఊదమని వ్రాశాడు. అట్లాగే శంఖు ఊదారు.



సేటు రాజారాంకు ఇదంతా చూస్తే చాలా ఆశ్చర్యమైనది. ఈ ఏకాంతవాసం పదేళ్లపాటు అనుభవించ బోతాడా? నేను రెండు లక్ష లియ్యబోతానా అనుకున్నాడు. సేటు. మొదటి సంవత్సరంలోనే భరించలేక ఆత్మహత్య చేసుకుంటాడని ఆశించిన సేటు చూస్తుండగానే నాలుగేళ్లు గడిచిపోవటం, అందులో ఖైదీ ఏమాత్రం ఒంటరితనం బాధ' అనుభవించటం లేదని తెలుసుకొని కిటకిట పడ్డాడు.

"రేపు ఉదయం వరకు పదేళ్లు నిండుతాయి. 'మా ఒప్పందం ప్రకారం అతనికి రేపు నేను రెండు లక్షలు గుమ్మరించాలి' అనుకున్నాడు సేటు. కాలం అంతా ఒక్కతీరుగా ఉండదు. పదేళ్ల కింద రోజుకు ఐదువందలు సంపాదించే సేటుకు ఇవ్వాళ యాభై రూపాయలు రావటం కష్టంగా ఉన్నది. వ్యాపారం నష్టం వచ్చి సన్నగిల్లటం మూలానా రెండు రూపాయలు రెండు లక్షల సమానంగా ఖర్చు పెట్టుతున్నాడు. 'రేపు ఎట్లాగూ ఇయ్యటం తప్పదు. ఇస్తే ఇంక నేను బిచ్చమెత్తుకోవాల్సిందే? అంటూ ఎటూ తోచక పచారు చేస్తున్నాడు తన గదిలో. 'నేననుకున్నట్లు వీడు చచ్చిపోతే ఎంతబాగుండేది! ఏ దిగులు

**చప్పున పెట్టెదగ్గరకు వెళ్లి ఎర్రటి ముఖమలు ఒరలో మెరిసిపోతున్న చిన్న కరవాలం మొలలో దోపుకొని తాళపు చెవులగుత్తి పట్టుకొని బయలుదేరాడు. తోటలోకి వెళ్లి చేతిలోని టార్చి వెలిగించి చౌకీదారును పిలిచాడు. వాడు పలకలేదు అంతరాత్రి. 'మొదలు అనుమానం చౌకీదారు మీదపడుతుంది. తరువాత ఎట్లాగయినా తప్పించుకోవచ్చు' అని మొలలో ఉన్న కత్తిని చూసుకున్నాడు. మెల్లిగా గది దగ్గరకు వచ్చాడు. బల్లమీద లాంతరు వెలుగు కిటికీలోనుంచి కనబడుతున్నది. టేబిలు దగ్గర కుర్చీలో ఖైదీ కూర్చున్నాడు కిటికీవేపు వెన్నుచేసి, ఐదునిమిషాలు గడిచాయి. ఖైదీ కదలనేలేదు.**

నాటి కథ

లేకుండా!' అని గొణిగాడు మళ్లీ! ఇంతలో గడియారం రెండు కొట్టింది. కిటికీలో నుండి బయటికి చూచాడు. దట్టంగా చీకటి ఉన్నది. సన్నగా తుంపరపడుతోంది. చప్పున పెట్టెదగ్గరకు వెళ్లి ఎర్రటి మఖమలు ఒరలో మెరిసిపోతున్న చిన్న కరవాలం మొలలో దోపుకొని తాళపు చెవులగుత్తి పట్టుకొని బయలుదేరాడు. తోటలోకి వెళ్లి చేతిలోని టార్చి వెలిగించి చౌకీదారును పిలిచాడు. వాడు పలకలేదు అంతరాత్రి. 'మొదలు అనుమానం చౌకీదారు మీదపడుతుంది. తరువాత ఎట్లాగయినా తప్పించుకోవచ్చు' అని మొలలో ఉన్న కత్తిని చూసుకున్నాడు. మెల్లిగా గది దగ్గరకు వచ్చాడు. బల్లమీద లాంతరు వెలుగు కిటికీలోనుంచి కనబడుతున్నది. టేబిలు దగ్గర కుర్చీలో ఖైదీ కూర్చున్నాడు కిటికీవేపు వెన్నుచేసి, ఐదునిమిషాలు గడిచాయి. ఖైదీ కదలనేలేదు. 'పదేళ్ళ నుండి ఇట్లా కదలకుండ కూర్చోటం అలవాటయింది కాబోలు' ననుకున్నాడు సేటు. కిటికీ తలుపు చప్పుడు చేశాడు. అయినా కదల్లేదు. సేటు తలుపు తాళం తీశాడు. పదేళ్లకింద వేసిన తాళం, తీస్తుంటే కిర్రుకిర్రుమన్నది. తాను తాళంతీస్తే ఎంత ఆశ్చర్యంగా చూస్తాడో లేక ఏమన్నా అంటాడేమోననుకున్నాడు. కాని అతడు కదలనన్నా కదలలేదు. గడ్డం జుట్టు బాగా పెరిగింది. చిక్కిశల్యమయి ఉన్నది అతని శరీరం, సూర్యరశ్మి లేక ఒళ్లంతా పండుబారింది. టేబిలుమీద అన్నీ తెరచిన పుస్తకాలు కుప్పలుగా పడి ఉన్నవి. అతని ఒళ్లో కూడా ఒక పుస్తకం ఉన్నది. చదువుతూ చదువుతూ నిద్రపోయినట్లున్నది అనుకున్నాడు సేటు. 'ఇప్పుడు పొడిచివేయటం చాలా చులకనయినపని' అని టేబిలువంక చూడగానే ఒక కాగితము మీద ఏదో వ్రాసి ఉన్నది.

అది తీసి దీపం వెలుతురులో చదవటం మొదటు పెట్టాడు. 'నేను రేపు ఉదయం బంధవిముక్తుణ్ణి అవుతాను. నాకు స్వేచ్ఛ వస్తుంది. కాని నేను ఈ గది వదలి వెళ్లడానికి ముందు కొన్ని విషయాలు నీకు విశదీకరించటం అవసరం. ప్రపంచం అంతా పెద్దవాళ్ల న్నట్లు మిథ్య. ఈ స్వేచ్ఛ, ఈ జీవితం బుద్బుదప్రాయాలు. ప్రపంచం పైమెరుగులతో నిండి ఉన్నది. ఇట్లాంటి బూటకపు ప్రపంచంలో జీవించటం నా కిష్టం లేదు. ఈ పదేళ్లబట్టి నేను ఐహిక సుఖాలన్నిటినీ పుస్తకాల ద్వారా అనుభవించాను. తోటల్లో విహరించాను, ఆరామాల్లో విశ్రాంతి తీసుకున్నాను. స్త్రీలను ప్రేమించాను, యాత్రలు సేవించాను, చూడదగినవి చూశాను, వినదగినవి విన్నాను, అంతా అనుభవమయినది నాకు.

నీ పుస్తకాలవల్ల జ్ఞానం సంపాదించాను. నేను మీ అందరికంటె తెలివిగల వాడనయ్యానన్న నమ్మకం నాకు బాగా కుదిరింది. కాని ఈ పుస్తకాలు ఈ జ్ఞానం అంతా వ్యర్థం. ఎంతటివాడికయినా చావుతప్పదు. అందం, చందం, ధనం, ధాన్యం, తెలివి, గొప్పతనం అంతా చెల్లు దీనితో, ప్రపంచం అబద్ధాన్ని నిజం అంటుంది. పై మెరుగులన్ని నిజమయిన అందం అని నమ్ముతుంది. ఇట్లాంటి లోకమే స్వర్గమని ఆనందిస్తుంది.

నాకు ప్రపంచం మీద విసుగుపుట్టింది. ఇవేవి నన్నాకర్షించవు. కొన్నాళ్ల క్రింద రెండు లక్షల ఆస్తికోసం ఎన్నోకలలు కన్నాను. అనుభవించినట్లే ఆనందించాను. కాని నేడు నాకవి అనవసరం. కనుక నేను నిర్ణీత సమయంకంటే ముందుగా వెళ్లిపోయి మన ఒప్పందం విచ్ఛేదం చేస్తున్నాను." సేటు ఇదంతా చదివి కాగితం అక్కడ పడేసి 'నూరేళ్లు జీవించు నాయనా' అని నెమ్మదిగా వెళ్లిపోయినాడు. తెల్లవారి చౌకీదారు ఖైదీ పారిపోయ్యాడని బిక్కమొహం వేసుకొని చెప్పాడు.

రాజారాం సేటు బల్లమీద ఉన్న రెండు లక్షలు ఒప్పందం వ్రాసిన పత్రం వంక ఒకమాటు చూచి డ్రాయరులో పడేశాడు.

కవిత

# తేలదెపుడు...

సీ. నాస్తికాస్తికులెల్ల నశ్వర మెల్లరు
వాదవివాదాలు బహువిధాల

జేయుచు కోపము చేనొకరినితిట్ట
వారును తిట్టగ పగలు పెరిగి

మాటలు తూలగ మనుజులు విడిపోయి
మతములు వేరయ్యె మమతలోడి

కత్తులు దీయుచు కబ్బములునుపుట్టి
వివిధవాదములతో వీడి పోయి

తే. గురువు గోవిందు లొక్కటైన గుంజులాట
మనుషులందరి మదిలోన మదనపడుచు
చెట్టు విత్తుల వాదన చేరి జనుల
జీవ సృష్టికి దేవుడే జీవ మనిరి
ఓప్రచేతుడా వినుమయ్య ఒక్క మాట

**- వేణుశ్రీ**



కందన క్రీ.శ.14 శతాబ్దంలో రామగిరిని పాలించిన ముప్పభూపాలుని మంత్రి. కందన అన్న కేసన కూడా మంత్రియే. కందన కరీంనగర్ సమీపంలోని వెలిగందలకు మంత్రిగా పాలించాడు. వెలిగందలామాత్యుడు, కందనామాత్యుడు అని పేరు. ఈ కాలంలోని మడికి సింగన ఈతనికి మిత్రుడు. మడికి సింగన కృతులను కందనకంకితమిచ్చాడు. కందన నీతితారావళి పేరుతో ఒక కృతిని రచించాడు. మడికి సింగనకూడా సకలనీతి సమ్మతము పేరుతో ఒక సంకలనం చేశాడు. అందులో కూడా ఇతని పద్యాలున్నాయి. కందన వ్రాసిన నీతిపద్యాలలో కొన్ని ఇవి.

# సకలనీతి

**- కందనామాత్యుడు**

కం. అమలమగు సప్తసంతా
నములందనిశంబు యశమునకు కుదురైనా
శము లేక నెగడు నక్కా
వ్యము ధారుణిలోన ఔబళార్యుని కందా!

కం. ధరనొప్పు నీతిమార్గము
పరికింపక తిరుగుమంత్రి పని మంత్రములే
కురు విషభుజగము పట్టిన
కరణి సుమీ యౌబళార్య కందన మంత్రీ!

కం. బలవంతుడు మన్నించిన
బలహీనుడు బలియుడనగబడు ధారుణిలో
వలరాయడు చేపట్టిన
యలరులు బాణములు గావె యౌబళ కందా!

కం. తన్నుని నమ్మిన బ్రోవక
పొన్నాకుల మీద తేనె పూసిన భంగిన్
నున్నని మాటల యన్నల
మన్నన లేమందు మబ్బమంత్రియు కందా!

కం. వివిధకళాకోవిదుడై
సవినయుడై యీవి గలిగి సంగరజయుడై
నివుడని నృపతుల బొందునె
యువిదయు కీర్తియును నౌబళోత్తమ కందా!

కం. ఖలు సంగతి గూడిన ని
ర్మల చిత్తుండైన జేయు ప్రతికూలుండై
యల నూనియ కర్పూరము
గలసిన విషమైన యట్లు కందామాత్యా!

సమాజం

# నాటి తెలంగాణ కథ, సామాజికత

## (1940 నుండి 1950)

**నాటి కథల్లో వైవిధ్య భరితమైన సామాజిక అంశాలు మంచి చెడులు ఎట్లా కనబడుతున్నాయో వివరించిన వ్యాసం...**



కాంచనపల్లి గో.రా.

ఈ కాలం వచ్చే సరికల్లా నాటి కథల్లో కొంచెం ఇంగ్లీషు పదాల వాడకం కనిపిస్తుంది. తొలి నాటి కథల సంపాదకులలో ఒకరైన ముదిగంటి సుజాత రెడ్డి అన్నట్టు ఈ కథలు ఆంగ్ల కథల ప్రభావంతో వచ్చినవి కావు. ఉర్దూలోని ప్రేమ్ చంద్, కిషన్ చందర్, మొదలైన రచయితల రచనల ప్రభావం తో వచ్చినవి. అయినా కొన్ని కథలలో ఈ ఆంగ్ల పదాల వాడకం ఓ విశేషం. కాళోజి నారాయణ రావు, పి.వి. నరసింహారావు లాంటి ప్రముఖులు ఈ కాలంలో కథలు రాశారు. కథలన్నిటి లోనూ గుర్తించ దగిన సామాజిక స్పృహ కనిపిస్తుంది. జాగ్రత్తగా గమనిస్తే సాహిత్య ప్రక్రియ నిర్వహణతో పాటు, ప్రజల జీవన గతులు కూడా తెలుస్తాయి.

1940లో వచ్చిన అందుగుల లక్ష్మణ రావు **అంతేనా నోము** కథలో చలం ప్రసక్తి వస్తుంది. మాడరన్ కేఫ్, హిందూ దినపత్రిక చూడడం, కాఫీ స్ట్రాంగ్, ఇవన్నీ ఆ కాలానికి ఆధునిక విషయాలు. నగరీకరణ ప్రారంభానికి చిహ్నాలు. ఇది పల్లె వాతావరణానికి చెందని ఆ కాలపు కథ.

ఓ యువకుడు వితంతువుని వివాహం చేసుకోవాలనే ఆదర్శంతో ఉంటాడు, ధైర్యంగా చేసుకుంటాడు. కాని కొంత కాలానికి ఆ వివాహం మీద వెగటు పడి, మరో పెళ్లికి సిద్ధ పడతాడు. చివరికి ఆ అమ్మాయి ఇది అర్థం చేసుకొని వేరే జీవితం గడపడానికి నిర్ణయించుకుంటుంది. మానసిక బలహీనులైన యువకుల చాంచల్యాన్ని చిత్రించిన కథ ఇది. ఇప్పటికి ఇట్లా ఆదర్శాలంటే ఉరికి, మళ్ళీ ఆచరణకు వచ్చేసరికి చతికిల పడే యువత మనకు కనిపిస్తుంది.

కాళోజి కవిగా సుప్రసిద్ధుడు. తెలంగాణ ఉద్యమ సమయంలో అయన స్ఫూర్తి మరువలేనిది. ఆయన గొప్ప కథకుడు కూడా అనేది ఈ సంకలనంలో తెలుస్తుంది. మానవ లోకంలో (కులం కంపు ఉన్న భారత దేశంలో) జరిగిన కుమ్ములాటలో మృతి చెందిన మనుషుల ఆత్మలు మాట్లాడుకోవడం, 1943లో వచ్చిన కాళోజి **"తెలియక ప్రేమ, తెలిసి ద్వేషము,"** అనే కథలో చిత్రించిన అంశం. దేవాలయ ప్రవేశం కోసం హరిజనులు చేసిన పోరాటం, దాన్ని నిరోధించటం కోసం బ్రాహ్మణులు నిలబడ్డ తీరు చిత్రించారు ఈ కథలో. మృతి చెందిన మనుషుల ఆత్మలు కూడా ఒకరి కులం ఒకరికి తెలియనపుడు స్నేహంగా మాట్లాడుకొని తీరా తెలిశాక అక్కడ కూడా ఈ కులం ఆవృతంలో ప్రవేశించి కీచులాడుకోవడం చూస్తాం. భారత దేశాన్ని ఈ నాటికీ సవాల్ చేస్తున్న కులం యొక్క వికృతత్వం వ్యంగ్యంగా చిత్రించారు కాళోజి.

అట్లాగే ఇదే సంవత్సరంలో వచ్చిన పెండ్యాల శేషగిరి రావు కథ **"ముహూర్త బలం"** జీవితంలో ఊహించని మలుపులు ఎట్లా వస్తాయో చిత్రించిన కథ. శ్రీనివాస రావు అనే వ్యక్తి పొందిన ఎన్నో ఒడిదొడుకులు, చివరికి అతడు పెద్ద మోతుబరి కావడం, అతని అనంతరం అతని కొడుకుల అవివేకం వలన సర్వం కోల్పోయి యథా స్థితికి చేరడం, ఇందులోని కథనం. "ఘాటైన జ్యోతిషుడు" లాంటి గమ్మత్తైన పదాలు, జ్యోతిషం, ముహూర్త బలం, మనుషులపై ప్రభావం చూపుతాయనే పాత తరం నమ్మకం, ఇందులో చూస్తాం. కాని జీవితంలో అనుకోని సంఘటనలు జరగడాన్ని పెండ్యాల స్వాభావికంగా చిత్రించారు.

మధురంగా పాడే లలిత అనే ఓ స్త్రీ పాటకు పక్కింటి వ్యక్తి ఆకర్షించ బడతాడు. అతనూ గాయకుడే. అతనితో కలయికకు ఆమె సిగ్గుతో కూడిన మౌనంతో అర్ధాంగీకారం తెలుపుతుంది. కాని అతనిలో వివేకం మేల్కొంటుంది. ఆకర్షణ నుండి బయటకు వస్తాడు. అతని భార్య, వేరే పేరుతో రాసిన కథ అని

చదివి అందులో లలిత పాత్ర తానని ఊహించుకొని, రాసిన వ్యక్తి పైన ఆగ్రహిస్తుంది. కాని రాసింది తన భర్తే అని తేలడం అందులో కొస మెరుపు. అడ్మైర్, వీక్ మూవ్‌మెంట్, లాంటి ఇంగ్లీష్ పదాల వాడకం కనిపిస్తుంది 1945లో వచ్చిన ప్రమాదం అనే బూర్ల రంగనాథ రావు కథలో.

అదే సంవత్సరం వచ్చిన ధరణి కోట శ్రీనివాస్ రావు **"చల్లపులుసు"** కథ హాస్య దృక్పథంతో రాయబడింది. కాని చల్ల పులుసు తెలంగాణకే చెందిన వంటకం. మిత్రుడు ఇంటికి వచ్చి భోంచేసి తాను తిన్నవాటిలో ఈ చల్ల పులుసు బాగుందని, కొత్తగా ఉందని మెచ్చు కుంటాడు. వంట చేసినామెను భర్త, పిల్లలు, చల్ల పులుసు, అని చల్లపులుసు స్పెషలిస్ట్, అని ఆటపట్టిస్తారు. ఇదే కథలో అప్పటి వివాహ పద్ధతులు అన్యాపదేశంగా చెబుతాడు రచయిత.

"మన పెద్దలకు ఎంత సేపు కుటుంబ సంప్రదాయాలు, కట్నాలు, మర్యాదలు, గొప్పలు గోడలు, కావాలి గాని, పిల్ల, పిల్లవాడి ఇష్టాఇష్టాలు, ఎవరికి కావాలి? పిల్ల అందం గా ఉందా? అని ఎవరైనా ధైర్యం చేసి అడిగితే, అందం దేనికోయ్? జుర్రుకు తినడానికా, సంసారం చేయాలి గాని", అని సమాధానం చెబుతారు.

ఇంకా ఈ కథలో ఇంగ్లీషు పదాలు వాడడం, ఉత్తరాలు రాయడం, లాంటి అంశాలు చూడవచ్చు. ఆ రోజుల్లో ఉత్తరాలు రాయడం కూడా ఒక కళే.

ఆ రోజుల్లో అన్ని కులాలలోను, కుల భావన విపరీతంగా ఉండేది. కులం కట్టు వీడిన వానికి కుల బహిష్కారం ఉండేది. కుల బహిష్కరణ జరిగిన వాడు కులంలో కలవాలంటే, ప్రాయశ్చిత్తం చేసి మళ్ళీ కులంలో కలుపుకోనేవారు. ఇప్పటికి ఇలాంటి దుష్ట సంప్రదాయాలు అక్కడక్కడా కొనసాగుతున్నాయి. నాడు ఒక వంక భారత స్వాతంత్ర సంగ్రామం జరుగుతుంది. గాంధీ ప్రభావం దేశవాసులపై పుష్కలంగా ఉంది. కులరహిత సమాజ నిర్మాణ ఆదర్శాలు ఒక వంక వినిపిస్తున్నాయి. కులవ్యవస్థ బలంగా ఉన్న కాలం అదే. ఓ పద్మశాలి కుటుంబంలోని యువకుడు కులాంతర వివాహం చేసుకొని, కష్టాలు పడిన వైనం చిత్రించిన కథ ఆత్మఘోష. ఈ కులాంతర వివాహం వల్ల అతని తోబుట్టువులను భర్తలు వదలి పెడతారు. ప్రాయశ్చిత్తం గురించిన ప్రస్తావన కూడా కథలో వస్తుంది. ఒక కులం వాడు మరో కులం వాడి నీళ్ళ బిందె ఎత్తడం కూడా తప్పనే నిమ్న స్థాయిలో ఉన్న సమాజం ఈ కథలో కనిపిస్తుంది.

సాంప్రదాయానికి అభ్యుదయానికి స్పర్థ నాటినుండి ఉన్నదే. కమ్యూనిస్ట్ భావాలు గల భర్త, తన భార్యను తన భావజాలం వైపు, కార్య కర్తృత్వం వైపు రమ్మని శాసించడం, 1945లో ప్రతిమ రాసిన నిట్టూర్పు అనే కథ. భర్త కమ్యూనిస్ట్ సహచరులు కూడా భార్యకు తమ ఉద్యమంలో చేరమని చెబుతారు. ఆమె సంప్రదాయాభిమాని. అంగీకరించదు. ఎదుటి వ్యక్తి ఇష్టాన్ని గౌరవించలేని భర్త, చివరికి వార్ధాకు, మహాత్ముని దగ్గరకు వెళ్లాలని ఆమె నిర్ణయించు కుంటుంది. స్టేషన్‌లో రైలు పక్కన ఆమెను ఆపడానికి పరుగెత్తు కొచ్చిన భర్త, ఆమెను కదులుతున్న రైలు నుంచి కిందకు లాగుతాడు. కింద పడిపోయిన ఆమె తలకు బలమైన గాయం అవుతుంది. పోలీసుకు భర్తను రక్షించడానికి చిన్న గాయమే అని చెబుతుంది. కాని ఇంటికి తీసుకెళ్లేసరికి ఆమె మరణిస్తుంది. నాటి సమాజంలోని సంప్రదాయ ధోరణి, భర్తప్రాధాన్యం, కమ్యూనిజమ్ సమాజం మీద చూపెడుతున్న ప్రభావం, దాని ఫలితాలు, మానవ వైరుధ్యాలు, ఈ కథలో చిత్రించారు ప్రతిమ.

**సమాజం కోసం ఎంత సాహసమైనా చేసే వీరవనితలు కూడా గ్రామ ప్రజలలో ఉన్నారు. అట్లాంటి స్త్రీ కథే పి.వి.రాసిన గొల్ల రామవ్వ కథ. ఈ కథ కూడా 1948 సంవత్సరమే వెలువడినది. గసాంటి, గడంచె, లాంటి తెలంగాణ పదాలతో పాటు అనుల్లంఘనీయం, పయస్సంగీతం ,తరుణసింహం, లాంటి సంస్కృత పదబంధాలు కూడా ఈ కథలో ఉన్నాయి. కమ్యూనిస్టులు, వాళ్ళను వెతుకుతూ వచ్చిన పోలీసులు, ఘర్షణతో అట్టుడికిన కాలం అది.**

జీవితంలో అనుకోని మలుపులు ఉత్థాన పతనాల స్వాభావికతను చిత్రించిన మరో కథ 1946లో సర్వదేవ భట్ల నరసింహ మూర్తి రాసిన **భిక్షుకులు**.

తల్లిదండ్రులు లేని అనాథగా మిగిలి బాధ పడిన వ్యక్తి. చివరికి పట్టభద్రుడై ఉద్యోగస్తుడవుతాడు. రసాయనిక శాస్త్రవేత్త అవుతాడు. వికాసం జరుగుతుంది. కూతురు జన్మిస్తుంది. భార్య మరణించి మరల విషాదంలో మునుగుతాడు. తరువాత అంధుడై ఉద్యోగం కోల్పోతాడు. చివరికి ఒక ఇంట్లోకి వెడితే ఆ అపరిచిత వ్యక్తి తన కూతురును బలాత్కరించబోతాడు. తన చేతిలో కర్ర విసరగా అది పొరపాటున (అంధుడు కావటం వల్ల) తన కూతురుకే తగిలి ఆమె మరణిస్తుంది. ఈ విషాదాంత కథను రచయిత చిత్రించిన తీరు హృదయ మూలాలు కదలిస్తుంది. ఇందులో రచయిత అక్కడక్కడా వాడిన కవితామయ వ్యక్తీకరణలు ఉదాహరణకు, 1) అతడు సంసార సాగరంలో రాజహంస వలె ఈదసాగాడు. 2) అతని హృదయము సంతోషముగా గంతులు వేయుచున్నది. 3) రెక్కలు రాని పక్షి వలె కొట్టుకున్నాడు. 4) దిక్కులు లేని యతి వలె రోదన చేశాడు లాంటి కవితాత్మక వ్యక్తీకరణలతో కొనసాగించాడు.

కొంత మంది ఆదర్శ వంతులలాగా నటిస్తారు. కాని వాళ్ళ దాకా వెడితే కాని అర్థం కాదు వాళ్ళ ఆదర్శం. నాటి జాతీయోద్యమ సందర్భంలో ఇలాంటి అవకాశవాదం గురించి చెప్పిన కథ 1946లో వెలువడిన నాగులవల్లి కోదండ రావు కథ **దేశమాత కళ**.

దేశంలో సత్యాగ్రహం నడుస్తున్న

కాలంలో ఒక ఊరిలో ఉన్న పెద్దలందరూ కూడి. తాముకూడా ఉప్పు సత్యాగ్రహం లో పాల్గొనాలని ఆలోచిస్తారు. ఊరి నుండి ఎవరినో ఒక్కరిని పంపాలని నిర్ణయించుకుంటారు. అందరూ ఆలోచన సమర్థిస్తారు కాని ఎవరూ ముందుకు రారు. ఒక అనామకుడు ముందుకు వస్తాడు. ఆ ఊరికి నాయకుడు లాంటి సత్యనాథం పంతులు కూడా తన రంగు బయట పెట్టుకుంటాడు.

ఇదే సమయంలో సమాజం కోసం ఎంత సాహసమైనా చేసే వీరవనితలు కూడా గ్రామ ప్రజలలో ఉన్నారు. అట్లాంటి స్త్రీ కథే పి.వి.రాసిన **గొల్ల రామవ్వ కథ.** ఈ కథ కూడా 1948 సంవత్సరమే వెలువడినది. గసొంటి, గడంచె, లాంటి తెలంగాణ పదాలతో పాటు అనుల్లంఘనీయం, పయస్సంగీతం, తరుణసింహం, లాంటి సంస్కృత పదబంధాలు కూడా ఈ కథలో ఉన్నాయి. కమ్యూనిస్టులు, వాళ్ళను వెతుకుతూ వచ్చిన పోలీసులు, ఘర్షణతో అట్టుడికిన కాలం అది. ఒక విప్లవ యోధుడైన యువకున్ని గొల్ల రామవ్వ తన మనవరాలి దగ్గర పడుకోబెట్టి వాళ్ళను భార్యా భర్తలని పోలీసులను నమ్మించి ఆ వీరుణ్ణి పోలీసుల నుండి కాపాడిన కథ ఇది. నాటి రక్తసిక్త తెలంగాణకు అద్దం పట్టిన కథ ఇది. అటువంటి భయానక వాతావరణంలో గొల్ల రామవ్వ లాంటి వీరవనితలు, చమత్కారులు, కూడా తెలంగాణలో ఉండేవారని చాటిచెప్పిన పి.వి. కథ ఇది.

ఎం. హీరాలాల్ రాయ్ ఇదే ఏట రాసిన కథ **"ఎవరి కథ రాయను?"** ఈ ప్రశ్న వేస్తూనే అందరి కథ రాస్తాడు. ఇది కథ అనడం కంటే సమాచారం అనాలి. జర్నలిస్ట్‌లను సిగరెట్ లాగా వెలిగించుకొనే రాజకీయ నాయకులు, రహస్య జీవితం గడుపుతూ నిన్నటిదాకా ప్రభుత్వంతో పోరాడిన విప్లవకారులు, సన్నని పూచ కాళ్ళు, కర్ర పుల్ల లాంటి చేతులు, కలిగిన సగటు మనుషులు అయన ఆలోచనలకు వచ్చారు. వదినతో చమత్కారంగా వాళ్ళ పిల్లలని గురించి "మీరిద్దరూ కూడబలుక్కొని ఈ ఉత్పత్తిని ఆపండి, లేకుంటే ఎవరైనా లక్షాధికారికి తలా ఒకన్ని పెంపకం ఇవ్వండి", అనే మాట నాటి కుటుంబాలలో సంతాన నిరోధం లేని అజ్ఞానాన్ని చాటుతుంది.

ఆ కాలంలో తరతమ భేదాలు చాలా ఎక్కువ. ఒక ఇరవై ఏండ్ల కింది వరకు ఇవి బాహాటంగానే కొనసాగాయి. ఒక పాలేరు పిల్లవాడితో యజమాని పిల్లవాడు ఆడుకోవడం జీర్ణించుకోలేనివారు ఈ కాలం వరకు కూడా ఎందరో ఉన్నారు. ఈ కోవకు చెందినదే పాలేరు తమ్ముడు కథ. ఈ కథను 1948లో మానేపల్లి తాతాచార్య రాశారు.



బాలసంఘ సభ్యులం, భరత మాత పుత్రులం

కులము మతము ఏదియైన, కలసి మెలసి ఉండెదం

ఈ పాటతో మొదలౌతుంది కథ. యజమాని కొడుకు బుల్లయ్య ఆ పాట పాడేవాళ్ళతో ఆడుకొంటానంటాడు. తల్లి అంగీకరించదు. బుల్లయ్య పట్టు పడతాడు. పాలేరు కుర్రవాడు వెంకడిని తోడు పంపిస్తుంది. వెంకడు కూడా ఆటలో పాల్గొంటాడు. బుల్లయ్య మొదట వద్దన్నా చివరికి కలసి ఆడుకొంటాడు.

చాలా మంది అధోజగతి కుటుంబాల పిల్లవాళ్ళకు ఇది నిత్యానుభవమే. రచయిత ఈ అనుభవం చెబుతూ అంతరాలున్న సమాజాన్ని అన్యాపదేశంగా మన కళ్ళ ముందు పెడతాడు.

సామాజిక అంతరాలు, దైన్యులైన స్త్రీల పట్ల అఘాయిత్యాలు, నేటి పరిస్థితులకు తీసిపోనివే ఆనాడు కూడా ఉండేవి. దైన్య స్త్రీల పట్ల చులకన భావం, దానితో పాటు కామేచ్ఛ, కనిపించేది. ఈ పర్యవసానాన్ని చిత్రించిన కథ 1950లో తాళ్లూరి రామానుజ స్వామి రాసిన **భిక్షుణులు** కథ.

కథ పాతకాలపు కథా కథన

**సాంప్రదాయానికి అభ్యుదయానికి స్పర్ధ నాటినుండి ఉన్నదే. కమ్యూనిస్ట్ భావాలు గల భర్త, తన భార్యను తన భావజాలం వైపు, కార్య కర్తృత్వం వైపు రమ్మని శాసించడం, 1945లో ప్రతిమ రాసిన నిట్టూర్పు అనే కథ. భర్త కమ్యూనిస్ట్ సహచరులు కూడా భార్యకు తమ ఉద్యమంలో చేరమని చెబుతారు. ఆమె సంప్రదాయాభిమాని. అంగీకరించదు. ఎదుటి వ్యక్తి ఇష్టాన్ని గౌరవించలేని భర్త, చివరికి వార్ధాకు, మహాత్ముని దగ్గరకు వెళ్లాలని ఆమె నిర్ణయించుకుంటుంది.**

సమాజం

ధోరణితోనే ప్రారంభమౌతుంది. రచయిత అనేక మార్లు కవిత్వ ధోరణిలోకి వెడుతుంటాడు. "ఇద్దరు భిక్షిణులు కాల కిరాతునిచే కాల్చబడిన హృదయాల్లో స్వార్థ పరత్వంతో నిండిన ఈ పాడు మానవ సంఘం యొక్క, పదాఘాతాలతో ముక్కలైన ఆశయాలతో దారి ప్రక్క చెట్ల క్రింద గుడ్డ పీలికల్లో తమ శరీరాన్ని పూడ్చి పడుకొని" ఈ విధంగా ప్రారంభిస్తారు.

ఓ అటుకులు అమ్ముకునే వ్యాపారి భిక్షుకిని మోసగించిన కథ ఇది. తల్లి కూతురుకి చెబుతుంది. ఆ అటుకుల వ్యాపారి వల్లనే తాను పుట్టానని కూతురుకి తెలుస్తుంది. తరువాత ఆ కూతురు ఒక పోలీసు బలాత్కారానికి గురౌతుంది. చివరికి తల్లి అర్ధరాత్రి పిడుగుపాటు వల్ల మరణిస్తుంది. కూతురు నదిలోకి దూకి ఆత్మహత్య చేసుకుంటుంది. చివరికి నాటి వ్యాపారి కొట్టు ముందున్న శవాన్ని గుర్తించి కంగుతింటాడు. తానొక ఉదారునివలె నటిస్తూ దహనం చేస్తాడు. ఈ విషాద కథ, శైలి కూడా భిన్న ధోరణిలోనే కొనసాగుతుంది.

"మళ్ళీ నిశాకాంత పరుగు మొదలైంది"

"ఈ మాటలు విని పరధ్యానంలో త్రాచుపాముపై కాలు పెట్టినట్లు ఉలికి పడ్డాడు."

"వారి స్థితి చూసి ఆకాశం కన్నీరు కారుస్తున్నదా అన్నట్టు, చినుకులు చాల మొదలైనవి." ఇట్లాంటి కవితా వాక్యాలతో సాగిపోయే ఈ కథ నాటి సమాజంలోని మానవ విచక్షణను, క్రౌర్యాన్ని, దైన్యాన్ని చిత్రించింది.

ఈ పదేళ్ళ కాలంలోని కథలన్నింటిలో గొప్ప సామాజిక దృక్పథం కనబడుతుంది. ప్రజల్లో ఉన్న స్వతంత్రేచ్ఛకు ఇవి అద్దం పడతాయి. తెలంగాణా సమాజం యొక్క పునాదులు తవ్వి మన ముందు పోస్తాయి ఈ కథలు.

కవిత

# బొడ్ల సంచీ



**హిమజ**



రంగు రంగుల బట్టముక్కలకు
సూదీ దారపు అల్లికతో
నేర్పుగా ఓ సంచీలాంటి
రూపమిచ్చేది మా అవ్వ

కొన్ని రూపాయి కాగితాలు
గలగలలాడే నాణేలు కొన్ని
తిరుమణి చూర్ణం
చిన్ని నశ్యపు డబ్బా
తన ట్రంకుపెట్టె తాళంచెవి
అవి ఇవి కాదు
అవ్వ సమస్త జీవనావసరాలు
అందులో దాక్కునేవి

ధవళవస్త్రాలతో పోటీ పడే
ముగ్గుబుట్టజుత్తుని
వేలెడు ముడి చుట్టుకొని
తీర్థవడి పుచ్చుకొని
చాయ్ తాగి గుడివైపు
తొవ్వ బట్టిందంటే చాలు
సంచీ బొడ్ల చెక్కాల్సిందే

దైవం దానం ధర్మం అన్నీ
అందులోంచే సమకూర్చే
అక్షయపాత్ర ఆ బొడ్లసంచీ
పెరటివైద్యంతో చేతికందిన సొమ్ము
మదుపు చేసి పిల్లలమైన
మా ముచ్చట్లు తీర్చే
కిడ్డీబాంక్ ఆ సంచీ

తేలికగా ఖాళీగా ఆ సంచీని
మేమెప్పుడూ చూళ్ళేదు

సంచీ అంటే బట్టముక్కల కూర్పే కాదు
ఆనాటి అవ్వల నాయనమ్మల
ఆర్థిక స్వావలంబన సారం, సారస్యం

మా అవ్వ సాదాసీదా జీవనశైలి
తన బొడ్లసంచీ నియంత్రణ
గీతని ఎప్పుడూ దాటలేదు
ఎక్కడా చేయిచాచి ఎరుగదు

ప్లాస్టిక్ కరెన్సీ చలామణీలో
డిజిటల్ ట్రాన్సాక్షన్స్ మామూలైపోయి
బ్రాండెడ్ పర్సులు, వాలెట్లు
ఇప్పుడెన్ని వచ్చి చేరినా
నాలుగు రూపాయలు
నాలుగుచోట్ల దాచిపెట్టమని

మంచం ఉన్నంతలో
కాళ్ళు చాచి బతకమని
మనీ మానేజ్మెంట్ నేర్పించే
ఏ బిజినెస్ స్కూల్ కి తక్కువేమీ కాదు
మా అవ్వ బొడ్లసంచీ !!

వ్యాసం

# తెలంగాణ సాహిత్య కేతనం డా॥ దేవులపల్లి రామానుజరావు జీవితం

**నాటి తెలంగాణలో సాహిత్య దీప స్తంభంగా, సాహితీ పోషకులుగా వెలుగొందిన దేవులపల్లి రామానుజరావుని ఆవిష్కరించే ప్రయత్నం...**



డా॥ జె.చెన్నయ్య

డా॥ దేవులపల్లి రామానుజరావు 20వ శతాబ్దిలో సుమారు 5 దశాబ్దాల కాలం భాషా సాంస్కృతిక వికాస యుగాన్ని శాసించినారు. తెలుగునాట రామానుజరావు కవులకు, రచయితలకు, పండితులకు తలలోని నాలుకగా మసలుకున్నారు. ఎక్కిన ప్రతి వేదిక మీద తమ కంచు కంఠంతో సారభూతమైన ప్రసంగాలు చేసి విమర్శకులను మెప్పించారు. కవిగా, వక్తగా, పత్రికా సంపాదకునిగా, బహుభాషా వేత్తగా, విద్యావేత్తగా నిరంతరం బహు కార్యమగ్నులై సఫలజీవనం గడిపారు.

నాలుగోఫారం వరకు ఇంటివద్దనే విద్యాభ్యాసం సాగింది. స్థితిమంతులైన కుటుంబ నేపథ్యం వల్ల రామానుజరావు మొదట్లో పాఠశాలకు వెళ్ళవలసిన అవసరం కలగలేదు. నాలుగో ఫారంలో హనుమకొండలోని కాలేజీయేట్ హైస్కూల్లో చేరారు. తర్వాత హైదరాబాద్ నిజాం కళాశాలలో బి.ఎ.లో చేరారు. అప్పుడా కళాశాల మద్రాసు విశ్వవిద్యాలయాని కనుబంధమై వుండేది. ఆ కాలంలోనే రామానుజరావుకు ఆంధ్ర పితామహ మాడపాటి హనుమంతరావు తోనూ, సురవరం ప్రతాపరెడ్డి తోనూ సన్నిహిత పరిచయం ఏర్పడింది. వరంగల్లు నుంచి హైదరాబాద్ వచ్చినప్పుడల్లా వారిని కలుసుకుంటూ వుండేవారు. చిన్నప్పుడు కాళోజి నారాయణరావు పాఠశాలలో సహాధ్యాయి. చిన్ననాడే భాషా సాహిత్యాల పట్ల అపారమైన అభిరుచి ఏర్పడింది. కవితా వ్యాసంగం ప్రారంభించారు. గోలకొండ పత్రికలో వ్యాసాలు రాసి ప్రచురించేవారు.

1942లో 'తెలంగాణ' పేరుతో ఒక దినపత్రిక హైదరాబాద్ నుంచి వెలువడింది. ఆ పత్రిక సంపాదక వర్గంలో చేరమని కోరుతూ మాడపాటి హనుమంతరావు రామానుజరావుకు లేఖ రాశారు. అయితే అప్పటికే నాగపూర్‌లో న్యాయకళాశాలలో చేరడం వల్ల ఆ అవకాశాన్ని వినియోగించుకోలేకపోయారు.

నిజానికి నిజాం కళాశాలలో డిగ్రీ చదువుతున్నప్పుడే రామానుజరావుకు సాహిత్యంపై గాఢమైన అభినివేశం ఏర్పడింది. భావకవుల రచనలంటే ఆరోజుల్లో సాహిత్య విద్యార్థులకు ఎంతో మక్కువ. రామానుజరావు కూడా భావకవిత్వాన్ని బాగా చదివారు. ముఖ్యంగా ముద్దుకృష్ణ 'వైతాళికులు' బాగా ఆకర్షించింది. రాయప్రోలు సభలకు హాజరవుతూ ఆయన కవిత్వాన్ని అభిమానించేవారు. విశ్వనాథ 'కిన్నెరసాని' పాటలు కూడా ఆయనను బాగా ఆకట్టుకున్నాయి. విశ్వనాథ కిన్నెరసాని పాటలు స్వయంగా గానం చేస్తుండగా విని పరవశించిపోయేవారు రామానుజరావు. కళాశాల విద్యార్థిగా ఉన్నప్పుడు భావకవుల ప్రణయ కవిత్వం, స్వాతంత్ర్యోద్యమం రెండూ ఆయనను ప్రభావితం చేశాయి. 1942-44 మధ్య నాగపూర్ న్యాయ కళాశాలలో చదువుతున్న కాలంలో రాసిన కవిత్వం 'పచ్చతోరణం' పేరుతో 1953లో ప్రచురితమైంది. నాగపూర్‌లో చదువుతున్నప్పుడు స్వాతంత్ర్యోద్యమాన్ని దగ్గరినుంచి చూసి స్ఫూర్తి పొందారు. గాంధీజీ దర్శనం వార్ధాలో లభించింది. 'పచ్చతోరణం'కు రాయప్రోలు వారు పీఠిక రాశారు. తల్లావఝుల, పింగళి, మల్లంపల్లి, వేటూరి, మధునాపంతుల మొదలైన కవిపండితుల ప్రశంసలు లభించడంతో రామాను జరావుకు కవిగా ఎంతో పేరు వచ్చింది. అదే కాలంలో అనేక పత్రికల్లో వ్యాసాలు రాశారు. విశ్వనాథ, రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ, శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి, పుట్టపర్తి నారాయణచార్యుల ఆశీస్సులు కూడా లభించాయి.

నిజాం రాష్ట్రంలో తెలుగువారు, కన్నడిగులు, మరాఠీలు కలిసివున్నారు.

తెలంగాణలోని ఇతర జిల్లాల్లో తెలుగువారే అధికం, హైదరాబాద్ నగరంలో మాత్రం అన్ని ప్రాంతాల వారున్నారు. వీరేగాక కొన్ని మరాఠ్వాడా జిల్లాలు, కొన్ని కన్నడ జిల్లాలు హైదరాబాద్ సంస్థానంలో ఉన్నాయి. నిజాంకాలంలో పాఠశాలలు తక్కువ. అక్షరాస్యత మరీ తక్కువ. మొత్తం జనాభాలో ఉర్దూ భాషీయులు పదిశాతమే అయినా నిజాము ఉర్దూను అధికార భాషగా అమలు పరిచారు. తెలుగు చదివే అవకాశాలులేవు. ప్రోత్సాహం అంతకంటే లేదు. పైగా తెలుగు చదవడం, మాట్లాడడం ఒక నేరమన్నట్లు చూసేవారు. హిందువులు సైతం షేర్వాని, పైజామా ధరించేవారు. ఇళ్ళలో, బంధుమిత్రులు, ఇతరులతో ఉర్దూలోనే మాట్లాడేవారు.

అలాంటి పరిస్థితుల్లో తెలుగును నిలబెట్టడానికి 1943మే 26న ఆంధ్ర సారస్వత పరిషత్తు ఏర్పడింది. తొలి అధ్యక్షులు లోకనంది శంకర నారాయణరావు. మలి అధ్యక్షులు సురవరం ప్రతాపరెడ్డి. దేవులపల్లి రామానుజరావు నాగపూర్‌లో న్యాయశాస్త్ర పట్టభద్రులై తిరిగిరాగానే ఆంధ్ర సారస్వత పరిషత్తులో సభ్యునిగా చేరారు. పరిషత్తు మొదటి వార్షిక సభలు వరంగల్లు కోటలో మూడు రోజుల పాటు ఘనంగా జరిగాయి. తెలంగాణ తెలుగు ఆత్మగౌరవ ప్రదర్శకంగా జరిగాయి. ఉదయరాజు రాజేశ్వరరావు ఆహ్వాన సంఘాధ్యక్షులుగా, కాళోజి నారాయణ రావు కార్యదర్శిగా వున్నారు. కోటలో కవి సమ్మేళనం కోసం వేసిన పందిళ్ళని రజాకార్లు దాడిచేసి తగులబెట్టారు. అయినప్పటికీ జంకక యథావిధిగా కార్యక్రమం నిర్వహించుకోవటంలో రామానుజరావు చేసిన కృషి కీలకమైంది. ఆ సభల్లో ఆయన తెలంగాణలోని ప్రాచీన ఆధునిక సాహిత్యానికి సంబంధించిన పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. దాశరథి అక్కడ రామానుజరావుకు తొలిసారి పరిచయం కావడమే గాక ప్రదర్శనను ప్రారంభించి అభినందించారు.

ఆ కాలంలో రామానుజరావు వరంగల్లులోని శబ్దానుశాసన గ్రంథాలయానికి కార్యదర్శిగా ఉండేవారు. కొమర్రాజు లక్ష్మణరావు స్థాపించిన ఆ గ్రంథాలయం 25 సంవత్సరాలు పూర్తి చేసుకొని 1944లో రజతోత్సవం జరుపుకున్నది. రామానుజరావు కార్యదర్శిగా ఉండగా ఈ రజతోత్సవాలను ఘనంగా నిర్వహించారు. రాయప్రోలు సుబ్బారావు ఉత్సవాలకు అధ్యక్షత వహించారు. గాడిచర్ల హరిసర్వోత్తమరావు ప్రారంభించారు.

1946 ప్రాంతంలో రామానుజరావు మిత్రుల ప్రోద్బలంతో వరంగల్ నుంచి 'శోభ' అనే సాహిత్య పత్రికను ప్రారంభించారు. సురవరం ప్రతాపరెడ్డి, మాడపాటి, కాళోజీ, పొట్లపల్లి రామారావు వంటివారు ఎంతగానో తోడ్పాటునందించారు. ఆ పత్రికలో సురవరం ప్రతాపరెడ్డి 'ఆంధ్రుల సాంఘిక చరిత్ర' ప్రచురితమైంది. తర్వాత ఆ గ్రంథానికి గాను ప్రతాపరెడ్డి గారికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. తెలుగువారికి కేంద్ర సాహిత్య అకాడమీ అందించిన తొలి పురస్కారం అది. పత్రికకు రచనలందించిన వారిలో సురవరంవారే గాక బూర్గుల రామకృష్ణారావు, దాశరథి వంటివారున్నారు.



నాగపూర్‌లో న్యాయశాస్త్ర విద్యాభ్యాసం చేస్తున్న కాలంలో పి.వి. నరసింహారావు రామానుజరావుకు సహాధ్యాయి. ఎంతో స్నేహంగా ఉండేవారు. నరసింహారావు తర్వాత కొంతకాలం

వ్యాసం

బూర్గుల రామ కృష్ణారావు వద్ద జూనియర్‌గా న్యాయవాద వృత్తి కొనసాగించారు. ఆ రోజుల్లో నాటక ప్రదర్శనలు, అవధానాలు, గ్రంథాలయాలు, నవలలు, పత్రికలు రామానుజరావును తెలుగు సాహిత్యంవైపు ఆకర్షించాయి. సికింద్రాబాద్‌లో సత్యహరిశ్చంద్ర నాటక కర్త బలిజేపల్లి లక్ష్మీకాంతం గారిని కలుసుకున్నారు. ఆయన స్వయంగా ఒక పాత్ర ధరించి ప్రదర్శించిన ఆ నాటకాన్ని రామానుజరావు మిత్రులతో కలిసి వీక్షించారు. అంతేగాక లక్ష్మీకాంతాన్ని, పానుగంటి వారిని తమ కళాశాలకు పిలిచి ఉపన్యాసాలిప్పించారు.

1943లో ఆంధ్ర సారస్వత పరిషత్తు ఏర్పడిన అనతికాలంలో రామానుజరావు కార్యవర్గ సభ్యుడయ్యారు. 1949లో ఉపాధ్యక్షుడయ్యారు. పరిషత్తు పరీక్షా కార్యదర్శిగా, కార్యదర్శిగా, అధ్యక్షునిగా యావజ్జీవితం పరిషత్తు కోసం, తెలుగు భాషా సంస్కృతుల వికాసం కోసం పూర్తికాలాన్ని వెచ్చించారు. సారస్వత పరిషత్తు శాఖోపశాఖలుగా విస్తరించింది. రాష్ట్రేతర ప్రాంతాల్లో పరిషత్తు పరీక్షా కేంద్రాలు ఏర్పాటయ్యాయి. పరీక్షల్లో ఉత్తీర్ణులైనవారు తెలుగునాట మూల మూలన పాఠశాలల్లో తెలుగు ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు పొందడమే గాక తెలుగు భాషా చైతన్యాన్ని వ్యాప్తి చేశారు. పరిషత్తు ఎన్నో గొప్ప గ్రంథాలను ప్రచురించింది. నిరంతరం సాహిత్య కార్యక్రమాలు జరిగాయి. ప్రాచ్యకళాశాల, పండితశిక్షణ కళాశాల ఏర్పాటైంది. పరిషత్తు వార్షిక సభలలో తెలుగునాట మూలమూలలనుంచి తెలుగు కవిపండితులు పాల్గొనేవారు. 1953 జనవరిలో పరిషత్తు సప్తమ వార్షిక సభలు 3 రోజులపాటు ఆలంపురంలో జరిగాయి. దేవులపల్లి రామానుజరావు పరిషత్తు అధ్యక్షుల హోదాలో సభలకు అధ్యక్షులయ్యారు. నాటి ఉపరాష్ట్రపతి డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్, హైదరాబాద్ ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు ఆ కార్యక్రమంలో పాల్గొన్నారు. హైదరాబాద్ నుంచి ఆలంపురం మహాసభలకు ప్రత్యేకరైలు వేయడం చెప్పుకోదగిన విషయం. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి నుంచి శ్రీశ్రీ వరకు మహామహులైన కవి పండితులు సభల్లో పాల్గొన్నారు. పరిషత్ పరీక్షల్లో ఉత్తీర్ణులైనవారికి పట్టాలు అందించడంతో పాటు విశ్వనాథ సత్యనారాయణ గారు స్నాతకోపన్యాసం చేశారు. డా॥ రాధాకృష్ణన్ గారు ఆంగ్లంలోనూ, తెలుగులోనూ మాట్లాడారు. రామానుజరావు పరిషత్తును సర్వాంగీణంగా అభివృద్ధి పరచేందుకు చేసిన కృషి అనితర సాధ్యమైంది.

పెద్దలు సంపాదించి ఇచ్చిన భూములను పెంపు చేసుకోవడంలో, చదివిన డిగ్రీతో ఏదైనా ఉన్నతోద్యోగాన్ని చూసుకోవడంలో, న్యాయశాస్త్రపట్టంతో ప్రాక్టీసు చేపట్టి ఉన్నతస్థాయి న్యాయవాది కావడంలో రామానుజరావు శ్రద్ధ చూపివుంటే నిస్సంశయంగా ధనాన్ని బాగా ఆర్జించి ఉండేవారు. కాని చిన్ననాటి నుంచి ఇష్టమైన భాషా సాహిత్యాలను సముద్ధరించే దిశగా తన జీవన గమనాన్ని నిర్దేశించుకున్నారు. తన లక్ష్యంకోసం త్రికరణశుద్ధిగా పనిచేశారు. తెలుగు సాహితీరంగంలోని వారందరికీ అత్యంత గౌరవనీయు డయ్యారు. వారి పేర్లు చెబుతూపోతే పెద్ద జాబితా అవుతుంది. ఆయన అభిమానం పొందని, ఆయనను అభిమానించని వారు లేరంటే అతిశయోక్తి కాదు. చూడడానికి పొట్టివాడైనా సాహిత్య కృషిలో విరాణ్మూర్తిగా పేరుపొందిన రామానుజరావుకు ఈ కృషిలో ఆంధ్ర సారస్వత పరిషత్తు, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ రెండు భుజాలుగా, రెండు అద్భుత వేదికలుగా ఉన్నాయి. దేశానికి స్వాతంత్ర్యం రాగానే అన్ని రాష్ట్రాల్లో వలెనే 1957లో ఆంధ్రప్రదేశ్‌లోనూ సాహిత్యఅకాడమీ ఏర్పడింది. మొట్టమొదట డా॥ బెజవాడ గోపాలరెడ్డి అధ్యక్షులుగా, విశ్వనాథ సత్యనారాయణ ఉపాధ్యక్షులుగా, దేవులపల్లి రామానుజరావు కార్యదర్శిగా ఎన్నికయ్యారు. అధ్యక్షులు గొప్ప సాహితీవేత్త అయినా జాతీయ స్థాయిలో బహుకార్య నిమగ్నులైవుండటం వల్ల ఆయన పనులను, తమ పనులను రామానుజరావే చూసేవారు. అకాడమీ పక్షాన శతాధిక గ్రంథాలు ముద్రించారు. ప్రముఖుల జయంతులు, వర్ధంతులు నిర్వహించారు. రచయితలు తమ పుస్తకాలు ముద్రించుకోవడానికి ఆర్థిక సహాయం అందించేవారు. ఉత్తమ గ్రంథాలకు సాహితీ పురస్కారాలు బహుకరించేవారు.



**తెలుగు సాహిత్యక్షేత్రంలో ఎంతోమంది రచయితలకు నిరంతర ప్రోత్సాహం అందిస్తూ ఎన్నో సంస్థలను ఉన్నతస్థాయిలో నిలబెట్టడంలో రామానుజరావు అవిరళంగా పాటుపడుతూ తన రచనా కృషిని కూడా ఉత్తమ స్థాయిలో కొనసాగించారు. తరుణవయస్సులోనే పరిణతి చెందిన సాహిత్య విమర్శ చేశారు. 'సారస్వత నవనీతం' 'తెలుగు సీమలో సాంస్కృతిక పునరుజ్జీవనం', 'తెలంగాణాలో జాతీయోద్యమాలు', 'నా రేడియో ప్రసంగాలు', 'తలపుల దుమారము', 'పంచవర్ష ప్రణాళికలు', 'బంకించంద్రఛటర్జీ జీవితము', హైదరాబాద్‌లో స్వాతంత్ర్యోద్యమం', బాలల కోసం 'ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ', 'మనదేశం-తెలుగుసీమ', జవహర్‌లాల్‌నెహ్రూ, గౌతమ బుద్ధుడు వంటి రచనలు వెలువరించారు.**

వ్యాసం

ఒక్కమాటలో చెప్పాలంటే గోపాలరెడ్డి, రామానుజరావుల సారథ్యంలో సాహిత్యానికి నిత్యకళ్యాణం పచ్చ తోరణంలా పండుగలు చేసేవారు. డా॥ గోపాలరెడ్డికి 75 ఏండ్లు నిండినందువల్ల ఆ నియమంతో ఉపాధ్యక్షునిగా వున్న దేవులపల్లి రామానుజ రావు అధ్యక్షులై సాహితీసేవను నిర్విఘ్నంగా కొనసాగించారు.

రామానుజరావుకు ఆంధ్ర సారస్వత పరిషత్తు, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ నిర్వహణనే గాకుండా తెలుగు అకాడమీ, అంతర్జాతీయ తెలుగు సంస్థ, తెలుగు భాషా సమితి, జిల్లా గ్రంథాలయ సంస్థ వంటి అనేక ఇతర సంస్థలు, వ్యవస్థలతో సన్నిహిత సంబంధం వుంది. ఆయా సంస్థల కార్యకలాపాల విస్తృతిలో ఆయన ప్రత్యక్ష పాత్రవుంది. కేంద్ర సాహిత్య అకాడమీ కార్యనిర్వాహక సభ్యులుగా 10 సంవత్సరాలు సేవలందించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయానికి సిండికేటు, సెనేట్ సభ్యునిగా మధ్య మధ్య వైస్‌ఛాన్స్‌లర్‌గా విశ్వవిద్యాలయ విద్యా కార్యక్రమాలపై ప్రభావం చూపారు.

1949 జనవరిలో తూప్రాన్‌లో ఆంధ్ర సారస్వత పరిషత్తు సభలు జరిగాయి.

**పెద్దలు సంపాదించి ఇచ్చిన భూములను పెంపు చేసుకోవడంలో, చదివిన డిగ్రీతో ఏదైనా ఉన్నతోద్యోగాన్ని చూసుకోవడంలో, న్యాయశాస్త్ర పట్టంతో ప్రాక్టీసు చేపట్టి ఉన్నతస్థాయి న్యాయవాది కావడంలో రామానుజరావు శ్రద్ధ చూపివుంటే నిస్సంశయంగా ధనాన్ని బాగా ఆర్జించి ఉండేవారు. కాని చిన్ననాటి నుంచి ఇష్టమైన భాషా సాహిత్యాలను సముద్ధరించే దిశగా తన జీవన గమనాన్ని నిర్దేశించుకున్నారు. తన లక్ష్యంకోసం త్రికరణశుద్ధిగా పనిచేశారు.**



ఇటీవల జరిగిన డా॥ రామానుజరావు శతజయంతి ఉత్సవ దృశ్యం...

మెట్రిక్యులేషన్ వరకు ప్రజల మాతృభాషలో విద్యాభ్యాసం జరగాలని ఇంటర్, డిగ్రీ తరగతుల్లో తెలుగు, మరాఠి, కన్నడ భాషలు ద్వితీయ భాషలుగా ఉండాలని, పరిపాలనలో ప్రజల భాషకు సముచిత ప్రాధాన్యం ఉండాలని తీర్మానాలు చేశారు. ఈ తీర్మానాలను ప్రభుత్వం దృష్టికి తెచ్చి అవి అమలయ్యేలా చర్యలు తీసుకోవడానికి ఒక సంఘం ఏర్పడింది. దేవులపల్లి రామానుజరావు ఆ సంఘానికి కార్యదర్శిగా వున్నారు. నాటి విద్యాశాఖ మంత్రి ధోండేరాజ్ బహద్దురును కలుసుకొని చర్చలు జరిపిన ఫలితంగా మాతృభాషలో మెట్రిక్యులేషన్ వరకు విద్యాబోధనకు ప్రభుత్వం అంగీకరించింది. తక్షణం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆ ఉత్తర్వుల అమలు వల్ల మాతృభాషలో విద్యాబోధనకు మార్గం సుగమమం అయింది. ఉపాధ్యాయుల కొరత ఏర్పడింది. ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రవేశ పరీక్ష ఉత్తీర్ణులైన వారిని పాఠశాల తెలుగు ఉపాధ్యాయులుగా, విశారద ఉత్తీర్ణులైన వారిని ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయులుగా నియమిం చేందుకు ప్రభుత్వం అంగీకరించింది. ఈ పరిణామం వల్ల సూర్యుని కాంతివలె పల్లెపల్లెలోనూ తెలుగు వెలుతురును పరిషత్తు తీసుకు వెళ్ళింది. ఈ కృషిలో రామానుజరావుకు ముఖ్యమైన పాత్ర వుంది.

తెలుగు సాహిత్యక్షేత్రంలో ఎంతో మంది రచయితలకు నిరంతర ప్రోత్సాహం అందిస్తూ ఎన్నో సంస్థలను ఉన్నత స్థాయిలో నిలబెట్టడంలో రామానుజరావు అవిరళంగా పాటు పడుతూ తన రచనాకృషిని కూడా ఉత్తమ స్థాయిలో కొనసాగించారు. తరుణవయస్సులోనే పరిణతి చెందిన సాహిత్య విమర్శ చేశారు. 'సారస్వత నవనీతం', 'తెలుగుసీమలో సాంస్కృతిక పునరుజ్జీవనం', 'తెలంగాణాలో జాతీయోద్యమాలు', 'నా రేడియో ప్రసంగాలు', 'తలపుల దుమారము', 'పంచవర్ష ప్రణాళికలు', 'బంకించంద్రఛటర్జీ జీవితము', 'హైదరాబాద్‌లో స్వాతంత్ర్యోద్యమం', బాలల కోసం 'ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ', 'మనదేశం-తెలుగుసీమ', జవహర్‌లాల్‌నెహ్రూ, గౌతమబుద్ధుడు వంటి రచనలు వెలువరించారు. కేంద్ర సాహిత్య అకాడమీ ప్రచురించిన స్వాతంత్ర్యానంతర కవితల కావ్యమాల - సంకలనానికి సంపాదకత్వం వహించారు.

దేవులపల్లి రామానుజరావు సంఘ సంస్కరణాభిలాషి, నిష్కళంక జాతీయవాది. సంస్కృతం, తెలుగు, ఆంగ్ల, ఫారసి, ఉర్దూ భాషల్లో ప్రావీణ్యం కలిగిన పండితులు. అనేక విషయాల్లో సంపూర్ణమైన అవగాహన కలిగినవారు. మంచివక్త, పరిశోధకుడు, ఎంతటి ఉద్గ్రంథమైనా చదివి సారాంశాన్ని ఇట్టే గ్రహించగల మేటి పాఠకుడు.

వ్యాసం

# కథకుడుగా కాళోజీ

**కవిగా కాళోజి అందరికీ తెలిసిన వాడే. ఆయనలోని కథా రచనా శిల్పాన్ని చెబుతున్న రచయిత...**



ఎలనాగ

కాళోజీ నారాయణరావు చాలామంది పాఠకులకు కవిగా మాత్రమే తెలుసు. ఆయన రాసిన 'నా గొడవ' 1960లలో, 70లలో స్థానీయంగా చిన్న దుమారం లేపిందని చెప్పవచ్చు. కానీ, కవిత్వం కన్న ముందు ఆయన కథలు రాశారట. అయితే వాటిసంఖ్య చిన్నదవటం వలన, పైగా అవి అచ్చులో వెలువడకపోవడం వలన, చాలామంది తెలుగు పాఠకులకు ఆ విషయం తెలియదు!



కాళోజీ నిజానికి కవిగా రచయితగా కంటే, సమాజంలోని అన్యాయాన్నెదిరించే వ్యక్తిగా, ప్రజాహక్కుల కోసం పోరాడే యోధునిగా, నిష్పక్షపాతం నిర్భయం నిక్కచ్చితనం మూర్తీభవించిన అరుదైన మనిషిగానే ప్రసిద్ధుడు. ఆయన నిజమైన కవి కాదని కొందరు విమర్శించినా, ఆ విమర్శలను తుత్తునియలు చేసే అద్భుత కవితా పంక్తులు ఆయనవి కొన్ని ఉన్నాయి. అవి కాళోజీలో రాజకీయ చైతన్యం పుష్కలంగా ఉందని నిరూపిస్తాయి కూడా.

కాళోజీ కథల్లో సామాజిక చైతన్యం, న్యాయ రాజకీయ వ్యవస్థల పట్ల నిశ్చితాభిప్రాయం, మొత్తంగా ఒక అభ్యుదయ భావజాలం (progressive ideology) ఇవన్నీ ఉండటం ఎట్లాగూ ఆశ్చర్యాన్ని కలిగించదు. ఎందుకంటే, ఇవి ఆయన వ్యక్తిత్వంలోని భాగాలు. అయితే కథారచనకు ప్రత్యేక వ్యక్తిత్వం, నిక్కచ్చి అభిప్రాయాలు, సరైన అవగాహన మాత్రమే సరిపోవన్నది అందరికీ తెలిసిన విషయమే. కథలు రాయడంలోని మెళకువలు ముఖ్యంగా శిల్పం గురించిన అవగాహన కొరవడితే, రచయితకు విశిష్ట వ్యక్తిత్వం ఉన్నా అతని కలంలోంచి మంచి కథలు పుట్టవు. కథారచన గురించిన సరైన అవగాహన కాళోజీకి ఉన్నదని, ఆయన రాసిన దాదాపు ప్రతి కథలో తెలిసిపోతుంది పాఠకునికి.

నేరుగానో, అన్యాపదేశంగానో సమాజానికి హితం చేకూర్చని ఇతివృత్తంతో ఒక్క కథ కూడా రాయలేదు కాళోజీ. ప్రజా ఉద్యమాల్లో ఒక్క చిన్నకథ పది పన్నెండు ఉపన్యాసాలంత ప్రభావాన్ని చూపిస్తుంది అని అభిప్రాయపడ్డారు ఆయన (ఇదీ నా గొడవ). ఇది ఒక పార్శ్వమైతే, శిల్పంలో కొత్తదనానికి ప్రాధాన్యమిస్తూ మూసకథలకు భిన్నంగా రాయడం పట్ల ఆయన ఎక్కువ ఇష్టాన్ని కనబరిచినట్టు సులభంగా తెలిసిపోతుంది, ఆ కథల్ని చదివితే. ఒకటి రెండు కథలు గల్పికలలాగా, లేక వార్తాచిత్రాలలాగా, లేదా కథనం లేని అసంపూర్ణమైన కథలలాగా కనిపిస్తాయంటారు కొందరు కథకులు. అయితే కథా నిర్వచనం మీదనే ధ్యాసనంతా కేంద్రీకరించడం కంటె, ఆ కథ సమాజం మీద బలమైన ప్రభావం చూపుతోందా లేదా అన్నదే కాళోజీకి ముఖ్యం. సామాజిక, రాజకీయ చైతన్యం నరనరాన పెద్దమొత్తంలో జీర్ణించుకు

పోయిన ఒక రచయిత కథ నిర్వచనం గురించి అంతగా పట్టించుకోకపోవడంలో ఆశ్చర్యపడాల్సిందేమీ లేదు.

**'తెలియక ప్రేమ, తెలిసి ద్వేషము'** కాళోజీ కథలన్నిటిలో మిగతా వాటికంటె ఎక్కువ ప్రాచుర్యం పొందింది. ఒక ఊళ్లోని దేవాలయంలోకి ప్రవేశించడం గురించి హరిజనులకు, సవర్ణ హిందువులకు మధ్య జరిగిన కొట్లాటలో చనిపోయిన ఒక బ్రాహ్మణుడు, ఒక హరిజనుడు ఇందులోని ముఖ్య పాత్రలు. వాళ్లిద్దరు నరకానికి వెళ్తున్నప్పుడు మధ్యలో ఒకరినొకరు పరిచయం చేసుకుంటారు. తాము ఒకే దొమ్మీలో చనిపోయినవాళ్లు అని తెలియనంత వరకు పరస్పరం ప్రేమను కనబరుస్తారు. కాని, వాస్తవం తెలియగానే వారిలో మళ్లీ వర్గవిద్వేషం బుసలు కొడుతుంది. దీన్ని గమనించిన యమభటుడు, "వీరి ద్వేషం చట్టుబండలు గాను. ఇదేం కావరం రా! చచ్చినా ఈ మతపిచ్చి, ఈ వర్ణభేద శత్రుత్వం పోలేదేం?" అంటాడు. మనదేశంలో మనుషులు ఎంత బలమైన కులమత స్పృహను కలిగివున్నారో తెలిపే కథయిది. భూలోకంలోని మనుషుల మతోన్మాదాన్ని చూసి యమభటుడు సైతం విస్తుపోవడం ఆసక్తికరమైన విషయం!

**'విభూతి, లేక ఫేస్ పౌడర్,' 'లంకా పునరుద్ధరణ,' 'ఆగష్టు పదిహేను'** ఇవి వ్యంగ్యవైభవం నిండిన కథలు. ఈ మూడింటిలో అన్యాపదేశంగా చెప్పడముంది. దీన్నే అలెగరి (allegory) అంటున్నారు. మొదటి కథలో ప్రధానంగా సెటైర్ కనిపిస్తుంది. మిగిలిన రెండింటిలో satire and sarcasm ల మిశ్రమం ఉన్నట్టు మనం గమనించవచ్చు. ఆ కథలు ఆ కాలపు రాజకీయ పరిస్థితులను వ్యంగ్యంగా విమర్శించిన అన్యాపదేశ కథలు. ఈ మూడు కథలలో కాళోజీ ప్రదర్శించిన శిల్పనైపుణ్యం అరుదైనదని చెప్పవచ్చు. శవప్రాయమైన కాంగ్రెస్ పార్టీ తాలూకు రాజకీయ సంస్కృతిని హేళన చేస్తూ బలమైన నిరసనను తెలుపడం **ఆగష్టు పదిహేను** కథలోని ఇతివృత్తం. ఇందులో మహాత్మా గాంధీని వ్యాసభగవానునిగా చిత్రించారు కాళోజీ. స్వాతంత్ర్యం వచ్చింతర్వాత కాంగ్రెస్ పార్టీని నిర్మూలించాలని భావించిన వ్యాసభగవానుని (గాంధీ) మాటలను అతని అనుయాయులు లెక్కచేయరు. ఒక శవంలాగా కంపు కొడుతున్న ఆ పార్టీ అస్తిత్వాన్ని ఎంతో ప్రేమతో ఆరాధించడం, దాన్ని నిర్మూలించేందుకు ఒప్పుకోకపోవడం చాలా విమర్శనాత్మకంగా, వ్యంగ్యాత్మకంగా చిత్రితమయ్యాయి కథలో.

**'లంకా పునరుద్ధరణ'** అన్నది రామాయణ కాలం నాటి కిష్కింధలోని విడ్డూరమైన పాలన మీద, పరిస్థితుల మీద సంకేతాత్మకంగా రాసిన కథ. అందులోని పాత్రలు, పరిస్థితులు నిజానికి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం, పోలీస్ చర్యల తర్వాతి పరిణామాలకు అద్దంపడతాయి. ఆ



**కాళోజీ ఇతర భాషలలోని కొన్ని కథలను తెలుగులోకి అనువదించారు కూడా. అపోహ, జాజితీగ, అనుభవము లేని ఆందోళన, రెండు గింజలు అట్లాంటివే. 'అపోహ'కు మూలం ఇంగ్లీషు అని పేర్కొన్నారు ఆయన. ఇది సోమర్సెట్ మామ్ రాసిన 'Mr. Know All'ను దాదాపు ఎనభై శాతం పోలివుంటుంది. ఆ ఆంగ్లకథ చాలా విభిన్నమైనది, విశిష్టమైనది, ఒకరకంగా వినూత్నమైనది. కాళోజీ అనువదించిన కథలు అనువాదాల్లాగా లేవు. అవి మూలకథలు (original stories) అనిపించేలా ఉండటం కాళోజీ అనువాద ప్రతిభకు నిదర్శనం.**

సందర్భంలో కేంద్రప్రభుత్వం శాంతిభద్రతలు అనే సాకుతో జనరల్ చౌదరీ, వెలోడిలను హైదరాబాద్ సంస్థానానికి పరిపాలకులుగా నియమించి, తుగ్లక్ వ్యవహారం లాంటిదానికి వీలు కల్పించడాన్ని చాతుర్యంతో, వ్యంగ్యంతో చిత్రించారు కాళోజీ. 'విభూతి, లేక ఫేస్ పౌడర్'లో శ్రీకృష్ణుడు, సత్యభామ, శివుడు, పార్వతి, దక్షుడు మొదలైన పురాణ పాత్రలను ఉద్దేశిస్తూ వేరే పేర్లున్న పాత్రల ద్వారా కథను నడిపించడం జరిగింది. ఇందులో అద్భుతమైన సెటైర్ ఆవిష్కృతమైంది.

ఎట్లాంటి అన్యాపదేశ పద్ధతినీ (allusion method ను) అవలంబించకుండా సూటిగా, స్పష్టంగా రాసిన కథ **భూతదయ**. కాళోజీ ఈ కథను మరో ఇద్దరు రచయితలతో కలిసి రాశారు. వారి పేర్లు వెల్దుర్తి మాణిక్యరావు, వెంకట రాజన్న అవధాని. 1937లో గోల్కొండ పత్రికలో ప్రచురితమైన కథ ఇది. ఒక ఊరి దేవాలయ ఆవరణలో కనిపించిన అనాథ పసికందును అక్కున చేర్చుకునేందుకు ఎవ్వరూ ముందుకు రారు కానీ, అదే దేవాలయంలో అదే చోట శ్రీరాముని విగ్రహమొకటి కనపడితే దాన్ని ప్రతిష్ఠింపజేసేందుకు అందరూ అత్యుత్సాహాన్ని చూపడమే కాక విరివిగా విరాళాలు ఇస్తారు. మానవత్వం కన్న మూఢభక్తి గొప్పది కాదనీ, పైగా అది నిరసింపతగినదనీ చెప్తారు రచయితలు. పైన పేర్కొన్నట్టుగా ఈ కథలో ఎంత సూటిదనం, స్పష్టత ఉన్నాయంటే, మనుషులలోని మానవత్వ లేమిని ప్రస్తావిస్తూ ఆ విషయాన్ని కథ చివర్న కరాఖండిగా ఎండగట్టడం జరిగింది. ఈ కోణంలోంచి పరిశీలిస్తే, ఈ కథ మిగతావాటికంటె భిన్నమైనదని తెలుస్తుంది. ఎందుకంటే, తక్కిన దాదాపు అన్ని కథల్లో ఏదో కొంత మోతాదులో అన్యాపదేశంగా చెప్పడముంది. కేవలం సగం పేజీ నిడివిని (రెండు పేరాగ్రాఫులను) కలిగివున్న కథ **ఎన్నిక**. స్వయంవరంలో తన జీవిత భాగస్వామిని ఎన్నుకునే స్వేచ్ఛ రాకుమార్తెకు ఉండాల్సినట్టే, ఎన్నికల్లో (elections లో) తమ నాయకులను ఎన్నుకునే స్వేచ్ఛ పౌరులందరికీ ఉండాలనే విషయాన్ని చెప్పకనే చెప్పారు ఈ కథలో.

**మనమే నయం** అనే కథలోని భిన్నత్వం ఏమిటంటే, ఇందులోని ప్రధాన పాత్రలు జంతువులు. ఈ మనుషులందరూ మనమీద బూటకపు ప్రేమను కనబరుస్తున్నారని ఒక ఎద్దు ఆక్షేపించగా, వాళ్ల పరిస్థితి కూడా దుర్భరంగానే ఉన్నదనీ, నిజానికి వాళ్లకంటె మన పరిస్థితే నయం అనీ మరో ఎద్దు ఈ కథలో సూచించడం జంతువుకు ఉదాత్తతను ఆపాదించి, దాన్ని మనిషికన్న ఉన్నత స్థాయిలో ప్రదర్శించడం కిందికి వస్తుంది. ఈ దృక్పథంతో కథలు రాసేవాళ్ల సంఖ్య తక్కువే.

కాళోజీ ఇతర భాషలలోని కొన్ని కథలను తెలుగులోకి అనువదించారు కూడా. **అపోహ, జాజితీగ, అనుభవము లేని ఆందోళన, రెండు గింజలు** అట్లాంటివే. 'అపోహ'కు మూలం ఇంగ్లీషు అని పేర్కొన్నారు ఆయన. ఇది సోమర్సెట్ మామ్ రాసిన Mr. Know All ను దాదాపు ఎనభై శాతం పోలివుంటుంది. ఆ ఆంగ్లకథ చాలా విభిన్నమైనది, విశిష్టమైనది, ఒకరకంగా వినూత్నమైనది.




**'తెలియక ప్రేమ, తెలిసి ద్వేషము' కాళోజీ కథలన్నిటిలో మిగతా వాటికంటె ఎక్కువ ప్రాచుర్యం పొందింది. ఒక ఊళ్లోని దేవాలయం లోకి ప్రవేశించడం గురించి హరిజనులకు, సవర్ణ హిందువులకు మధ్య జరిగిన కొట్లాటలో చనిపోయిన ఒక బ్రాహ్మణుడు, ఒక హరిజనుడు ఇందులోని ముఖ్య పాత్రలు. వాళ్లిద్దరు నరకానికి వెళ్తున్నప్పుడు మధ్యలో ఒకరినొకరు పరిచయం చేసుకుంటారు. తాము ఒకే దొమ్మీలో చనిపోయినవాళ్లు అని తెలియనంత వరకు పరస్పరం ప్రేమను కనబరుస్తారు. కాని, వాస్తవం తెలియగానే వారిలో మళ్లీ వర్గవిద్వేషం బుసలు కొడుతుంది.**

కాళోజీ అనువదించిన కథలు అనువాదాల్లాగా లేవు. అవి మూలకథలు (original stories) అనిపించేలా ఉండటం కాళోజీ అనువాద ప్రతిభకు నిదర్శనం.

ఆంధ్ర పబ్లిషింగ్ కంపెనీ, సుల్తాన్ బజార్, హైదరాబాదు దక్కన్ వారు మొదటిసారిగా కాళోజీ కథలను ప్రచురించారు. వాటిని 2000, 2011లలో కాళోజీ ఫౌండేషన్, వరంగల్ మళ్లీ అచ్చు వేయడం తెలుగు పాఠకుల అదృష్టమనవచ్చు. ఈ పుస్తకాన్ని ఈ వ్యాసరచయిత ఈ మధ్యనే ఆంగ్లంలోకి అనువదించగా, కాళోజీ ఫౌండేషనే ప్రచురించడం జరిగింది. కాళోజీ రాసిన కథలు కొన్ని అలభ్యంగా ఉన్నాయని అన్నారు ఆ ఫౌండేషన్ వారు. ఎవరైనా పూనుకుని వాటిని సంపాదించి, వెలుగులోకి తెస్తే, ఒక తెలంగాణ వైతాళిక రచయితకు సంపూర్ణ న్యాయాన్ని చేకూర్చినవారవుతారు.

కవిత

# గృహవాసం



డా॥ కొండపల్లి నీహారిణి

అంతు తెలియని ఆలోచనలు ఆరబోస్తూ
గుప్పిటబట్టని దినపత్రికయ్యింది నా మనసు ఇప్పుడు.
వంటర్రకు ఏదో కొత్తవెలుగు సహాయజ్యోతి ప్రసరిస్తున్నది!

కూరలో కారమెంతేయాలని కారణాన్ని వెతుకుతూ,
గంటెతిప్పనీయక ఖాళీ సమయాన్నిచ్చిన విచిత్రకాలానికో నమస్కారం!!
నాలోనేను రంగులేసుకున్న బొమ్మనై, నవ్వుల్ని విచ్చుకుంటుంటే,
మరో ఆశ్చర్యం ముందటర్రవరకూ తీసుకుపోయింది.

వాళ్ళమ్మకు అందిచ్చినట్టే మాఅమ్మకూ ఆయన చాయగిలాసనిస్తుంటే,
ఇనుమడించిన గౌరవాలకు హృదయ ఛాయ ఒకటేదో చెప్పని సాక్ష్యమయ్యింది
నేను కాకుండా, నాతోపాటుతిరిగే ఫ్యానూ, మోగకుండా పక్కన పడివున్న సెల్లు ఫోనూ,
మనసుగిల్లి కనుపాప చిత్రంతో దోస్తీ చేస్తున్నవి!

నాలో ఏదో చిదాకాశం విశాలమైందో,
ముగ్ధమనోహర నేల పరిమళభరితమైందో గాని,
పిల్లల అవసరాలు చూసి, పుస్తకాలు సదిరి,
మాసినవి ఉతకడానికని వేస్తున్న ఆ దృశ్యం మూసగా గాక,అపురూపమే అయింది!
సునామీలొచ్చిన పాత సంద్రాన్ని చెరిపి, ఆపాతమధుర గానాన్నిచ్చింది!!
సుతారంగ తిరస్కరించలేని ప్రియవాతావరణమైంది!!!

అనుభవమనేది చెప్పకుండా రాలిన వడగళ్ళవానగాదుగాని,
దండెం మీది ఎండిన బట్టలన్నీ ఆయనే తెస్తుంటే,
గుండెతడితో కలిసి సంశయం నిస్సంశయమయ్యింది.
నేనూ,మధ్యగదీ, బల్లపీట, పూల చెద్దరూ చూస్తుండగానే,
మా ఆయననే బట్టలన్నీ మడతవేసే వైనం నన్ను మరో లోకవిహారం చేయించింది!
బహు హుందాగా తిరిగే చేపపిల్లలా ఊపునేదో తెప్పిస్తున్నది!!

అల్మారీలల్ల బూజును దులుపుతుంటే,
చంటోడి ముక్కును ఆయనే తుడుస్తుంటే ,
పారేసుకున్న అనుభూతుల్ని మళ్ళీ తెచ్చుకున్న!!

క్యాకరేంగే కరోనా? నువ్వేం చేయగలవు?
కొండంత అండగా వెన్నంటి ఉన్నాడు నా భర్త!
అత్తమామలతో సహా ఆనందంగా నేనున్నానంటే నువ్వు పారిపోవూ?
పాతకోపతాపాలను కడిగేసుకున్న మేమిద్దరమూ
ఇప్పుడు , శుభ్రపరిచిన పాత్రల్లా తళతళ మెరుస్తున్నం.

"ఇంటిలోన అందం ఇంతింత కాదయా
ఇంతిదే కాక ఇతనిదీ అవునయా!"
అని కొత్తపద్యం చదవాలి అందరు!!
గృహవాసం ఇక గొప్ప సహవాసం!!



వ్యాసం

# ప్రపంచీకరణ కథ

ప్రపంచీకరణతో తెలుగు కథలో వచ్చిన పరిణామం తెలిపే వ్యాసం...



డా॥ బి.వి.ఎన్.స్వామి

'వసుధైక కుటుంబం' అనే భావన భారతదేశంలో ఏళ్ళ క్రితం నుండే ఉంది. Universal Brotherhood అన్నది క్రైస్తవం, ఇస్లాం కూడా అంగీకరించింది. 'ఎల్లలోకము ఒక్క ఇల్లై' అన్నాడు గురజాడ. ఇట్లా ప్రపంచం ఒక్కటై సాగాలనే కాంక్ష అందరిలో ఉంది. ఈ కాంక్షకు అనుగుణంగానే ప్రపంచీకరణ జరిగిందా? ప్రపంచమంతా ఒక్కటే అనే భావనపైకి అందంగానే ఉంది. అంతరార్థం అదేనా? జరుగుతున్నది అలానే ఉందా? ప్రపంచం కుగ్రామమైంది. అదే సమయాన ఎవరి ప్రపంచం వారిదైంది. ఎందుకిట్లా అయింది? ప్రపంచీకరణ పేరున జరిగింది, జరుగుతున్నది ఏమిటి?

చరిత్రను చూస్తే అనేక నాగరికతలు ఒకదాన్నొకటి సుసంపన్నం చేసుకోవడం చూస్తాం. నేడు దానికి భిన్నంగా జరుగుతుంది. ఆనాటి ఆలోచనల్లోని Brotherhood ఈనాడు జరుగుతున్న ప్రపంచీకరణ ఒకటేనా? కాదు ప్రపంచం మొత్తం మార్కెట్లలో అగ్రదేశాల సరుకే అమ్మకం అయ్యేట్లుగా అనుసంధానం చేయడమే ప్రపంచీకరణ ఉద్దేశ్యం. సంస్కృతుల ఆదాన, ప్రదానం స్థానంలో గుత్తాధిపత్యం వచ్చిచేరింది. ప్రపంచీకరణ ప్రభావం వల్ల ప్రతిదీ మార్పుకు గురైంది. వస్తు ఉత్పత్తులు, వస్తు వినియోగం, మానవసంబంధాలు, జీవనవిధానం, సంస్కృతిసాంప్రదాయాలు, అస్తిత్వాలు అన్ని కూడా మార్పుకు గురి అయ్యాయి. మనుషులకు సంస్కృతి ఉంటది. వస్తువుకు అది ఉండదు. మనిషికి సహాయపడే గుణం ఉంటుంది. వస్తువుకు ఉపయోగపడే లక్షణం ఉంటుంది. ప్రపంచీకరణ ప్రభావం వల్ల మనిషికి అనేక వస్తులక్షణాలు అబ్బినాయి. మొత్తంగా మనిషి ఒక వనరుగా మారిండు. సరుకుగా మారిండు. మనిషి ఉపయోగితావాద లక్షణాన్ని సంతరించుకున్నాడు. ఇదంతా చాపకింద నీరులా జరిగింది. కష్టించి పనిచేసే మనిషి, శ్రమించకుండా బతకడం నేర్చుకున్నాడు. అందుకు యంత్రసహాయం తీసుకున్నాడు. ఇది అభివృద్ధిగా లెక్కించబడింది. కాని శ్రమను అప్రధానం చేసి, సంస్కృతిని అర్థం చేసుకునే విధంగా అపసంస్కృతి వచ్చి చేరడం ప్రపంచీకరణ అందించిన ఫలితాల్లో ఒకటి.

మన భాషలకంటే ఉత్తమమైనది ఆంగ్లభాష అని భావిస్తున్నాం. అక్కడితో ఆగకుండా ఇంగ్లీష్ మాట్లాడేవాడు గొప్పవాడు అనే ఆలోచనకు వ్యాప్తి కలిగింది. ఇది ప్రమాదకరం. భాష, సంస్కృతిలో విభజన, నిమ్న ఉన్నతాల సృష్టి కూడా జరిగింది. ఈ విధమైన పరిణామం తెల్లదేశాల వస్తుప్రపంచాన్ని మనదేశానికి దిగుమతి చేసింది. ప్రపంచీకరణ అంటే స్థూలంగా మార్కెట్ల విస్తరణ, లాభనష్టాల బేరీజు అనే అర్థం స్థిరీకరింపబడింది. ఈ సందర్భంలోనే పి.వి. నరసింహారావు ప్రభుత్వం ఆర్థిక సంస్కరణలను మొదలు పెట్టి వాణిజ్య విధానానికి దారులు వేసింది.

మనదేశంలోకి వచ్చిన బహుళజాతి కంపెనీల వల్ల స్థానిక పరిశ్రమలు, కుల వృత్తులు కుదేలయ్యాయి. కొనుగోలుదారు యొక్క ఆర్థిక శక్తిని తన లాభాలుగా మార్చుకునే తెలివితేటలు కంపెనీలకు అధికంగా ఉన్నాయి. భారతదేశ మధ్యతరగతి మనిషికి కొనుగోలుశక్తి స్వల్పం. అందుకే ఇన్‌స్టాల్‌మెంట్ స్కీంలు ప్రారంభమయ్యాయి. ఒకటి కొంటే మరొకటి ఉచితం అనే విధానాలు మొదలయ్యాయి. నగరాలు పెరిగాయి. పల్లెలు నగరీకరణకు గురి అయ్యాయి. దీని వెనుక అభివృద్ధి నమూనాలు ఉన్నాయి. దీని ఫలితంగా పల్లెల్లో పుష్కలంగా దొరికే పాడిసంపదకు కరువు వచ్చింది. దాని స్థానంలో కోకాకోలా లాంటి విదేశీ పానీయాలు వచ్చి చేరాయి. ప్రతీ పల్లెకు రోడ్డు వేయడం ఒక రవాణా సౌకర్యం. ఆ రోడ్డు ద్వారానే బహుళ జాతి కంపెనీల వ్యాపారం పల్లెల్లో తిష్ఠవేసింది. టి.వి.లు, డిష్‌లు, టెక్నాలజీ పల్లెల్లో పనిచేస్తూ, పని సంస్కృతికి పాడెకట్టాయి. ఇవన్నీ

వస్తువినియోగ దాహాన్ని పుట్టించాయి. స్వసుఖ దాహాన్ని పెంచాయి. ఫలితంగా ఉమ్మడి జీవితం బీటలువారింది. శ్రామిక జీవనం చిన్న చూపుకు గురైంది. శ్రమకు దూరమైన మనిషి, కూర్చుని తినేవైట్‌కాలర్ వ్యామోహాన్ని ఒంటపట్టించుకున్నాడు. అది సిద్ధించక పోతే అతీతశక్తుల్ని ఆశ్రయిస్తున్నాడు. ఇదంతా గత మూడు దశాబ్దాలుగా జరుగుతున్న తంతు.

**నేడు ప్రపంచీకరణ జీవన విధానంగా మారింది. ఇది వరకున్న అంతరాలు మరింత పెరిగాయి. తమ కష్టాల కడగండ్ల నుండి బయటపడడానికి ఉద్యమించిన ప్రజలకు, చేయూతనిచ్చిన పోరుబాటలు సన్నగిల్లాయి. శత్రువు కనిపించడం లేదు. దెబ్బలు మాత్రం తగులుతున్నాయి. ఎవరి దెబ్బ రుచి వారిదే. అనేక అంతరాల దొంతరలతో నిండిన సమాజంలో ఒక్కో దొంతరపై ఒక్కో రకమైన దెబ్బ. కనుకనే విశాల ఐక్య పోరాటాల స్థానే అస్తిత్వ ఉద్యమాలు వెల్లుత్తాయి. స్త్రీవాద, దళిత వాద, మైనార్టీ వాద, ప్రాంతీయవాద ఉద్యమాలు తలెత్తుకున్నాయి.**

పుట్టువడి నుండి చావుఒడి వరకు ప్రపంచీకరణ పరచుకొని ఉంది.

తనకు పని ఉన్నప్పుడు తన పని, లేనప్పుడు ఇతరుల పని చేసుకుంటూ బతకడం పని సంస్కృతి. మనకు ఇది పూర్వులు పరచిన పని బాట. ఇప్పుడు పనికి దూరమయిన మనిషి, తనకున్న దాన్ని ప్రదర్శనకు పెట్టడమే పనిగా పెట్టుకున్నాడు. తనకున్న దానితో ఇతరుల వస్తుసంపదని పోల్చుకోవడం మనిషి అలవాటు చేసుకున్నాడు. లేనిదాన్ని పొందడానికి అపమార్గంపడుతున్నాడు. ఇదంతా విషసంస్కృతి. ఇది సమాజసమస్త మూలాలకు పాకింది. కులవృత్తులు కుప్పకూలాయి. మైదాన ప్రాంత జీవితాలు అతలా కుతలమయ్యాయి. పట్టణ ప్రాంత ప్రజలు 1990 నాటికి ప్రపంచీకరణకు అనువుగా మలచబడ్డారు. ఆ తరువాత మరింత వేగంగా దానికి లోనయి, తమకు తాము పరాయీకరింపబడ్డారు. ఈ మార్పు ఫలితాల ప్రభావం రుచి చూసే వరకు గాని గ్రహించలేక పోయారు. ఎందుకంటే 1990లకు ముందే పట్టణప్రాంత ప్రజలు ఈ వైపుకు మెల్లమెల్లగా నెట్టబడ్డారు. విద్య ఆధునిక సౌకర్యాలు అందుకు దోహదపడ్డాయి.

గిరిజన ప్రాంతంలో జరిగిన మార్పులు ప్రపంచీకరణను పట్టించేవిగా ఉన్నాయి. మొదటి నుండీ పోడు వ్యవసాయం చేసుకుంటూ పశుపోషణ, వేట, అటవీ వస్తువుల సేకరణ చేస్తూ దొరికిన దాంతో కడుపునింపుకుంటూ ఆటపాటలతో గడిపిన గిరిజనులు మైదానప్రాంత భూస్వాముల రాకతో మార్పుకు గురయ్యారు. భూమి వారినుండి ఇతరులకు మారింది. తమ భూమికి తామే పరాయివారయ్యారు. సరళీకరణ అడవుల్లో రహదారులను పరిచింది. అడవుల్లోని ఖనిజం, ఉత్పత్తులు, సంపద, కర్ర, సమస్తం తరలించబడుతున్నది. అవి మరోచోట వస్తువులుగా మారి విపణివీధిలో కనబడు తున్నాయి. వాటితో సహజీవనం చేసిన గిరిజనులు తమ సంస్కృతికి, భాషకు, జీవన విధానానికి, ప్రాంతానికి దూరం అయి ఇక్కట్లు పడుతున్నారు. ఈ విధంగా చెప్పుకుంటూ పోతే ప్రపంచీకరణ ప్రభావం పడని వర్గం, రంగం, కులం, మతం, ప్రాంతంగాని లేవు. ప్రతీ వ్యక్తీ దీని బారిన పడ్డవాడే. ఆర్థిక పరిభాషలో చెప్పాలంటే ప్రతీ వ్యక్తి



అప్పుపడ్డవాడే, గ్లోబలైజేషన్ ప్రభావం గురించి వివరిస్తూ హ్యూమన్ డెవలప్‌మెంట్ రిపోర్టు పెరుగుతున్న సంపద వెల్లువలో పెద్ద పడవలు తేలియాడుతుండగా చిన్న తెప్పలు, దోనెలు ప్రవాహపు వాలుకి కొట్టుకుపోయి క్రమంగా మునిగి పోతున్నాయని" పేర్కొంది.

నేడు ప్రపంచీకరణ జీవన విధానంగా మారింది. ఇదివరకున్న అంతరాలు మరింత పెరిగాయి. తమ కష్టాల కడగండ్ల నుండి బయటపడడానికి ఉద్య మించిన ప్రజలకు, చేయూతనిచ్చిన పోరుబాటలు సన్నగిల్లాయి. శత్రువు కనిపించడం లేదు. దెబ్బలు మాత్రం తగులుతున్నాయి. ఎవరి దెబ్బ రుచి వారిదే. అనేక అంతరాల దొంతరలతో నిండిన సమాజంలో ఒక్కో దొంతరపై ఒక్కో రకమైన దెబ్బ. కనుకనే విశాల ఐక్య పోరాటాల స్థానే అస్తిత్వ ఉద్యమాలు వెల్లువెత్తుతున్నాయి. స్త్రీవాద, దళితవాద, మైనార్టీవాద, ప్రాంతీయవాద ఉద్యమాలు తలెత్తుకున్నాయి. సమాజం శకలాలుగా విడిపోయింది. దీనివల్ల పోరాటశక్తి సన్నగిల్లింది. ఇది చాలు ప్రపంచీకరణ తనపని తాను చేసుకపోవడానికి. ఇందుకు ఇంటర్నెట్‌తో సహా ఆధునిక కమ్యూనికేషన్ వ్యవస్థను, ప్రచార వ్యవస్థను, రకరకాల సాంకేతిక శాస్త్రవిజ్ఞాన సాధనాలను వినియోగించు కుంటున్నారు. అంతర్జాతీయంగా WTO ఒప్పందం కుదిరింది. మార్కెట్ విశ్వవ్యాప్తమైంది. కొత్త మార్కెట్లు, వాణిజ్యలాభాలు తేగా, కొత్తవలసల్లోని సంస్కృతులు వినోద సరుకుగా మారాయి.'ఏ ఇజం లేదు టూరిజం తప్ప" అనే మాట రాజ్యమేలింది. మొత్తంగా గ్లోబలైజేషన్ అనే మాట ఫ్యాషన్ అయింది. మారక తప్పని అనివార్యస్థితిని గ్లోబలైజేషన్ తెచ్చిపెట్టింది.

ఇలాంటి గ్లోబలైజేషన్ నేపథ్యంలో తెలంగాణలో ఎలాంటి కథ వచ్చింది. ఆ కథ చిత్రించిన జీవితాలు ఎటువంటివి? జీవితాలపై ప్రపంచీకరణ ఎలాంటి ప్రభావం చూపింది. రచయితలు ఈ ప్రభావాల్ని ఏ విధంగా చిత్రించారు. వారి దృష్టి ఎలా ఉంది. ధ్వంసమైన జీవితాల్ని కథ పట్టించుకుందా? సరళీకరణను సాధనంగా చేసుకొని ఎదిగిన జీవితాల్ని చిత్రించిందా? గ్లోబలైజేషన్‌కు ప్రత్యామ్నాయంగా చూపెట్టిన పరిష్కారాలున్నాయా? ముప్పువాటిల్లిన భాష, సంస్కృతుల రక్షణ ఎలా? వీటి ఉనికిని సమర్థించిన కథ, గ్లోబలైజేషన్ వ్యతిరేక కథగా నిలుస్తుంది. ప్రపంచీ కరణను సమర్థించే కథకు ఎలాంటి జీవితం ఆలంబనైంది అనే విషయాలను పరిశీలించాల్సి ఉంది.

ఆర్థిక సంస్కరణల వల్ల, ప్రజాజీవితంలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. తీవ్రమైన అంతరాలు ఏర్పడ్డాయి. వృత్తులు కోల్పోయి మనుషులు, పుట్టినచోట బతకలేక బతుకు దెరువు కోసం వలస వెళ్ళారు. బొంబాయి, బొగ్గుబాయి, దుబాయి, తెలంగాణ ప్రజల వలస కేంద్రాల య్యాయి. ఈ పరిస్థితులు కుటుంబాల్లో తెచ్చిన అలజడులు అనేకం. మానవ సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పారిశ్రామిక ప్రగతి, సాంకేతిక ప్రగతి అభివృద్ధిలో పోటీపడి కొందరికి ఫలాల్ని అందించాయి. అవి పేదలకు మాత్రం అందలేదు. అందకపోవడమే కాక నష్టపోయారుకూడా. సమాజం అనేక ఆటుపోట్లకు గురి అయింది. ఇటువంటి ప్రతిఫలాలను, ప్రతికూలతలను కథ పట్టించుకుంది.

గ్లోబలైజేషన్ ప్రభావాల్లో వృత్తులు నాశనమవడం ఒకటి. ఆ వృత్తులను ఆశ్రయించుకొని బతుకుతున్న ప్రజలు అనాధలైనారు. వారి జీవితం గాడి తప్పింది. వారు పనిలేక ఆకలికి అలమటించారు. పనికోసం ఉన్న ఊరుకు, కన్నవారికి దూరంగా వెళ్ళాల్సి వచ్చింది. అటువంటి వలసలను దృష్టిలో పెట్టుకొని చేనేతకార్మికుల జీవిత నేపథ్యంలో వచ్చిన కథ "వలస". జూకంటి జగన్నాథం రాసిన ఈ కథలో రెండు తరాలజీవితం ఉంది.

**గ్లోబలైజేషన్ ప్రభావాల్లో వృత్తులు నాశనమవడం ఒకటి. ఆ వృత్తులను ఆశ్రయించుకొని బతుకుతున్న ప్రజలు అనాధలైనారు. వారి జీవితం గాడి తప్పింది. వారు పనిలేక ఆకలికి అలమటించారు. పనికోసం ఉన్న ఊరుకు, కన్నవారికి దూరంగా వెళ్ళాల్సి వచ్చింది. అటువంటి వలసలను దృష్టిలో పెట్టుకొని చేనేత కార్మికుల జీవిత నేపథ్యంలో వచ్చిన కథ "వలస". జూకంటి జగన్నాథం రాసిన ఈ కథలో రెండు తరాల జీవితం ఉంది.**

ముదిగంటి సుజాతా రెడ్డి "వలస" కథలో వ్యవసాయం చేసే క్రమంలో ఊర్లో చేసిన అప్పులు, అవి తీర్చడానికి పల్లె విడిచి పట్నం బాట పట్టిన అట్టడుగు వర్గాల జీవితం కనపడుతుంది. ఈ "వలస" కథ తెలంగాణ భాషకు పట్టం కట్టింది. బి.వి.ఎన్.స్వామి రాసిన "వలస" కథలో అగ్రవర్ణ బ్రాహ్మణ జీవితం చిత్రితమైంది. తన పిల్లల్ని సంసారాన్ని సాదలేక ఇంటి యజమాని బొంబాయి వెళతాడు. అక్కడ శివుని గుడిలో ఉంటూ వేదం నేర్పుతాడు. ఒకరోజు శివుని గుడిలో పూజ చేస్తూ శ్వాస చాలిస్తాడు. బ్రాహ్మల జీవితాల్లోని బాధల పల్లవులు కథలో వినపడతాయి. గూడూరుసీతారాం "రంగడు" మారాజు కథలు వలస బాధల్ని చిత్రించాయి. కొక్కుల భాస్కర్ తెగిన పోగు" అంబల్లజనార్దన్ "బొంబాయి కథలు" ఐతా చంద్రయ్య, సదానంద్ శారదలు మహారాష్ట్ర వలసలపై రాసిన కథలు వలస ప్రభావాల్ని తెలుపుతాయి. "ఎడారి దీపాలు" గల్ఫ్ వలసపై కె.వి. నరేందర్ రాసిన కథ, చైతన్యప్రకాశ్ రాసిన "బతుకురేవు" కథ జీవితంలో వలస అనివార్యతను తెలిపింది. బతుకుదెరువు కోసం తెలంగాణ పల్లెల్లో దుబాయి లాంటి

దేశాలకు వెళ్ళడం రివాజు. వెళ్ళిన వాళ్ళు ఊరుకాని ఊరిలో బాధలు పడుతుంటారు. ఇక్కడ ఊర్లో ఉన్న భార్యా బిడ్డల బతుకు కూడా భయంతోనే ఉంటుంది. మగ దిక్కులేని స్త్రీ పరిస్థితి ఎట్లా ఉంటుందో "ఘర్షణ" అనే కథలో పెద్దింటి అశోక్‌కుమార్ చిత్రించాడు.

మానవీయ విలువలస్థానే మార్కెట్ విలువలను ప్రపంచీకరణ స్థిరపరిచింది. పరస్పరాశ్రితంగా స్వయం సమృద్ధి చెందిన సమాజం స్థానంలో ముక్కలు ముక్కలుగా విడిపోయి స్వతంత్రజీవనం సాగించే సామాజిక నమూనా స్థిరపడింది. వైట్‌కాలర్ సంస్కృతి వచ్చి చేరింది. అవసరాలనే కాదు ఆనందాలను కూడా ప్లాన్ చేసుకోవాలనే వాతావరణం మిగిలింది. వ్యాపారం కోసం పెట్టుబడిగా ఉపయోగపడే డబ్బు, తానే పెట్టుబడిగామారి ఫైనాన్స్ వ్యాపారంగా రూపొందింది. "డబ్బు పిల్లల్ని కంటుంది" అనే భావన వ్యాపించింది. ఈ భావన ఆధారంగా కె.వి. నరేందర్ "ఫైనాన్స్ భూతం" కథరాసిండు. హరిత విప్లవఫలితాలు మెల్లమెల్లగా అనుభవంలోకి వచ్చేసరికి దాని నిజస్వరూపం పర్యావరణ విధ్వంసంగా కనిపించింది. సమాజం అనుభవించే కరెంట్ వెలుగుల వెనుక బొగ్గు ఉంది. బొగ్గుకోసం ఓపెన్‌కాస్ట్ విభాగాన్ని విస్తరిస్తుంటారు. పి. చంద్‌రాసిన "భూనిర్వాసితులు" కథలో ఓపెన్‌కాస్ట్ వల్ల బాధితులైన ప్రజలు కనిపిస్తారు. అంపశయ్య నవీన్ రాసిన "ఊబి" అనే కథ హైక్లాస్ సొసైటీలో సైతం ప్రపంచీకరణ ఎలాంటి ప్రకంపనల్ని పుట్టిస్తుందో చెప్పే కథ. హెచ్.ఐ.వి. పాజిటివ్‌ను ఊబితో పోల్చి చెప్పారు. సమాజంలో ఉన్నత స్థాయిలో గల ప్రొఫెసర్ రమణి భర్త, సంపాదన కోసం సౌదీ వెళ్తాడు. మరింత సంపాదనతో హోదా ప్రదర్శించుకోవడం అనేది ఆర్థిక సరళీకరణ ప్రభావంగా కనపడుతుంది. సంపాదన పరులైన ఇద్దరు భార్యా భర్తలు విడివిడిగా ఉండడం వల్ల శారీరక వాంఛను తీర్చుకోవడం కోసం ప్రొఫెసర్ రమణి ఇతర సంబంధాలలోకి వెళుతుంది. ఫలితంగా హెచ్.ఐ.వి. పాజిటివ్ అటాక్ అవుతుంది. నూతన జీవిత ప్రతిఫలం ఇది. ప్రపంచీకరణ ఆరోగ్యరంగాన్ని కూడా పాడుచేసిందని ఈ కథ చెబుతుంది. కుటుంబం అనేది సమాజంలో అతి చిన్న యూనిట్. అందులో దాంపత్యం అతి ముఖ్యమైంది. అటువంటి దాంపత్యంపై ప్రపంచీకరణ ప్రభావం గురించి నవీన్ కథ రాస్తే, సంతాన నియంత్రణ గురించి దంపతుల ఆలోచనలను బెజ్జారపు వినోద్ కుమార్ కథగా రాసాడు. "సంశయం" అనే కథలో రెండవ బిడ్డను కనడమా? కనకపోవడమా అనేది ఇతివృత్తం. గ్లోబలైజేషన్ అనేది ఎంతగా "ఛాట్‌కంట్రోలింగ్"కు పాల్పడుతుందో ఈ కథ ద్వారా తెలుసుకోవచ్చు. దీని ద్వారా మొత్తం సమాజం మెకానికల్‌గా, ఒకేనమూనాగా మారే క్రమాన్ని కథలో చూడవచ్చు. ఈ విషయాన్ని ధృవీకరిస్తూ కథలో రచయిత ఇలా అంటాడు. "సంసారాన్ని ప్లాన్ ప్రకారం నడుపుకోడం సరే... కాని అనుభూతుల్ని కూడా ప్లాన్ ప్రకారం పొందడం నేర్పి ఈ సమాజం ఎంతటి ద్రోహం చేసింది." అనుభూతుల్ని, ఆ క్రమంలోనే జీవితాల్ని డిజైన్ చేయడమనేది గ్లోబలైజేషన్‌లోని ప్రధానాంశం. డిజైన్‌కు సంబంధించిన రూపాన్ని మార్కెట్ నిర్ణయించడమనేది సరళీకరించబడ్డ ఆర్థిక విధానం యొక్క పాలసీ.

గ్లోబలైజేషన్ పట్ల, దాని విషపరిణామాల పట్లమేధావులకు ఎంత జాగరూకత ఉందో నిరసన ఏమేరకు ఉందో చాలా కథల్లో తెలుస్తుంది. గ్లోబలైజేషన్ పట్ల కొంత మంది రచయితలు అనుకూలంగా కూడా ఉన్నారు. ప్రపంచీకరణ పరిణామాలను మన జీవితాలకు అనుకూలంగా మార్చుకోవాలని చెప్పేవారిలో బి.ఎస్.రాములు ఒకరు. వీరి కథల్లో "కామన్‌వెల్త్" అనే కథ ప్రపంచీకరణ ఫలితాల పట్ల, పరిణామాల పట్ల అనుకూలతను వ్యక్తపరుస్తుంది. సామాజిక తత్వవేత్తగా పేరొందిన రాములు ఈ కథను గ్లోబలైజేషన్ మీద చర్చగా వెలువరించారు. ఎల్లాకర్ అనే పాత్ర ద్వారా రచయిత గ్లోబలైజేషన్ అనుకూల వాదనలు చేయిస్తాడు. గీతాంజలి రాసిన "కథ 2020" ప్రణాళికా బద్ధమైన ప్రభుత్వ నమూనాపై వ్యంగ్యాస్త్రం. ప్రపంచీకరణ తర్వాత ప్రస్తుతం ఉన్న పరిస్థితికి, అంతకు ముందు ఉన్న పరిస్థితికి పోలిక చూపెడుతూ రాసిన కథ ఇది. నీళ్ళిచ్చే సంస్కృతికి బదులు నీళ్ళు వదిలే సంస్కృతిని ఈ ప్రపంచీకరణ తెచ్చింది. గ్లోబలైజేషన్ అంతిమసారం అమెరికనైజేషన్ అవడమే అనేది కథ తేల్చింది. వరల్డ్ బ్యాంక్ వ్యవసాయ విధానాలు, గాట్ ఒప్పందంపై సంతకాల ప్రతిఫలాలు వర్ధమాన దేశాల పర్యావరణంపై ప్రభావం చూపెట్టాయి. ఈ విషయాల్ని, పరిణామాల్ని దృష్టియందుంచుకొని సంపత్‌కుమార్ రాసిన కథ "డాలర్‌వర్సెస్ మదర్" ఇందులో భూమిని తల్లిగా చేసి ప్రపంచప్రజలందరికి భూమాత ద్వారా ఉత్తరం రాయిస్తాడు రచయిత. అభివృద్ధిచెందిన, చెందుతున్న దేశాలకు మధ్య వచ్చిన పొరపొచ్చాల పట్ల వేదన ఉంది. అందరూ కలిసి భూమిని నాశనం చేస్తున్నారని, తద్వారా భవిష్యత్ అవసరాలకు విషాదాన్ని మిగులుస్తున్నారనే వేదన కనపడుతుంది. కాలువ మల్లయ్య రాసిన వందలాది కథల్లో నేలతల్లి, భస్మాసురహస్తం, గ్లోబలి, భూమిస్వప్నం కథలు ప్రపంచీకరణ దుష్ఫలితాలను తెలిపాయి. పాలమూరు కరువు, వలసల గురించి ఉదయమిత్ర అనేక కథలురాసారు. పశుపోషణ భారమై పశువులు కబేళాలకు తరలి వెళ్ళడం వెంకట్రాములు రాసిన "జంగిడి" కథలో కనపడుతుంది. సాఫ్ట్‌వేర్ రంగంలో ప్రపంచీకరణ ప్రముఖంగా కనిపిస్తుంది. ఈ రంగంలో పనిచేసే దంపతుల మధ్య కలిగే స్పర్థలు, ఈ రంగం వల్ల మనుషుల మధ్య కలిగిన అంతరం, దూరం అందరూ ఎరిగినదే. ఈ విషయాలను నేపథ్యం

వ్యాసం

చేసుకొని యెన్నం ఉపేందర్ "గ్లోబల్ ఉప్పెన", "గ్లోబల్ నగరం" ఆడెపు లక్ష్మీపతి "జీవన్మృతుడు" కథలు రాసారు. ముదిగంటి సుజాతారెడ్డి ప్రచురించిన "మింగుతున్న పట్నం", "వ్యాపార మృగం" కథా సంపుటాలు గ్లోబలైజేషన్ ఫలితాలను అనేక కోణాల్లో చూపెట్టాయి. పెద్దింటి అశోక్‌కుమార్, ఇక్బాల్, పరిమళ్, ఉదయమిత్ర, దిలావర్, శిరంశెట్టి కాంతారావు, కొట్టం రామకృష్ణారెడ్డి లాంటి అనేకులు ప్రపంచీకరణ ప్రభావాల్ని కథల్లో నిక్షిప్తం చేసారు. కరువును తట్టుకోలేక బొంబాయి వలసపోవడం ఉదయమిత్ర రాసిన "పేగుబంధం" కథలో కనపడుతుంది. వలస వెళ్లిన కొడుకు కోడలు మట్టి పనిచేస్తూ మట్టిగడ్డలు మీదపడి మరణించడం జనజ్వాల రాసిన "పిచ్చిపిల్ల" కథ ద్వారా తెలుస్తుంది. గోర్లబుచ్చయ్య రాసిన "పాలమూరు పల్లె" కథలో వలసవెళ్ళిన కూలీలపై కాంట్రాక్టర్లు, మేస్త్రీలు చేసే దుర్మార్గం కథలో కనిపిస్తుంది. సంపత్‌రావు రాసిన "అతకని బతుకులు" కథలో అప్పుల్లో కూరుకుపోయిన పాలమూరు వ్యవసాయం గురించి రాసిండు "కఫన్" కథలో ప్రభుత్వమే రైతుల దగ్గర భూమిని హస్తగతం చేసుకున్న అప్రజాస్వామిక పద్ధతుల్ని ఇక్బాల్ విశదపరిచిండు.

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ వచ్చాక మనుషులు బావిలో కప్పలు అయ్యారని పులిపాటి గురుస్వామి "ఐటికప్ప" కథలో నిరూపించారు. ఆర్థికపరిణామాల్లోని అమానవీయ కోణాన్ని వ్యంగ్య ధోరణిలో వంశీకృష్ణ "పేచీకోరు అమ్మాయి"లో తెలిపారు. ముదిగొండ సాలగ్రామ్ "టెస్ట్‌ట్యూబ్‌లో కన్నీరు", మురళీకృష్ణ "జాతర", ఎస్వీ సత్యనారాయణ "వలస", దోర్బల బాలశేఖరశర్మ "నీళ్ళు లేని నది", మిట్టబోయిన వెంకటేశ్ "బతుకుదెరువు" కథలు వలస జీవిత వెలుగునీడలను రికార్డు చేశాయి. ఆధునిక అభివృద్ధి నమూనాలుగా నిలుస్తున్న ప్రాజెక్టుల వల్ల గిరిజన సంస్కృతి మాయంకావడాన్ని పద్దం అనసూయ "మూగబోయిన శబ్దం" కథ చిత్రించింది. పోలవరం ప్రాజెక్టు గురించి శిరంశెట్టి కాంతారావు "పోరువనం" కథ చెప్పింది. ఇది మానవీయ విలువ ఏ విధంగా గ్లోబల్ పరిణామం వల్ల దిగజారిందో తెలుపుతుంది. ప్రపంచీకరణ ప్రభావం అనేక కథల్లో, ఆయాకథకులు వివరించారు. కులవృత్తులు కూలిపోవడం దీనికి చెందిన ఒక పరిణామం. ఈ విషయాన్ని బి. మురళీధర్ "దశ్మి" కథలో చక్కగా వివరించారు.

కులవృత్తులు, మానవ సంబంధాలు, సంస్కృతి సంప్రదాయాలు అన్ని కూడా ప్రపంచీకరణ పుణ్యమా అని మార్పులకు లోనయ్యాయి. కొన్ని నశించి పోయాయి. ఇవన్ని విషయాలను కథ పట్టించుకుంది. ఒక వైపు కులవృత్తులు కూలిపోతుంటే మరోవైపు కొత్త వృత్తులు పుట్టుకొస్తున్నాయి. ఇవెంట్ మేనేజ్‌మెంట్ పేరు మీద అనేకమైన పనులు సమాజంలో కొలువుదీరాయి. వాటిని జీవితాంతం చేస్తూ బతుకుతున్న మనుషులు కనపడుతున్నారు. చనిపోయిన మనిషి కర్మకాండకు సంబంధించి, అంత్యక్రియలు పూర్తి అయ్యేవరకు ఉండి అన్నీ తానేఅయి నిర్వహించే వృత్తి ఒకటి కొత్తగా పుట్టింది. ఈ పని గురించి బి.వి.ఎన్. స్వామి రాసిన "చావు ప్యాకేజీ" కథ వివరించింది. సాఫ్ట్‌వేర్ రంగం కూడా కొత్తపనులు కల్పిస్తుంది. ఇలా సమాజంలో కొత్తవాతావరణం తారట్లాడుతుంది. దాని మంచి చెడ్డల గురించి కథ పట్టించుకుంది.

కవిత



# చెలియా....

**అన్వేషి**

ఇనరాజ కిరణాల ఘనతప్త జ్వాలల
నలరించి నిలుచు అంజలివి నీవు

అలచంద్ర చంద్రికా లలితంపు సవ్వడి
నిలిచి నవ్వేడి కళా నిధివి నీవు

శిలలెన్నొ చిగురించు జలదాంబు రాసి వై
ఇలకు ఏతెంచేటి కలవు నీవు

మోసంపు లోకాన కాసింత దయతోడ
పలకరించెడి పొద్దు పాట నీవు

ఎచట జూచిన నీవును అచట గలవు
నేను ఏదన్న అదియిల నీవు తన్వి
కరకు కత్తులు మెలగు ఈ కాననమున
పిల్లబాటవు గాదె ప్రఫుల్ల మూర్తి.

కవిత

# అజరామరం



- కరిపె రాజ్ కుమార్

జనవనం అపూర్వ పయనం
శైశవం అపురూప కవనం
యవ్వనం అచిరకాల గమనం!

ముఖంమీద ముడుతలు
అనారోగ్య మడతలు
వదులైన బిగుతులు
ఆయలు ఛాయలు
అంకెల్లోకి అనువాదాలు!

జనన నివారణ తరుణోపాయం
మరణ నిరోధక ఉపకరణ సంగ్రహణం
శాస్త్రం సౌపపత్తికసౌలభ్యం
ప్రయోగ విధాన ఫలవంతం?

జవనాశ్వజాడల సకిలింపు
జరామరణ సంగమ సడలింపు
జీవనకాల గమకాల పొడిగింపు
అవధానం అవిచ్ఛిన్నం! అవిరచితం!

శతమానం భవతి?
శాశ్వత విలసిత విలాసం
భవిష్యత్ కాన్వాసుపై
అమృత ప్రబంధం!
అజరామర సుగంధం!!



డా॥ వెల్దాల కొండలరావు

# తంగేడు

వనమంతా ఆకుపచ్చన,
అచటచటా ముచ్చటగా నీవు నిండు ముత్తైదువౌతు పచ్చన.
నీవెచటెచటయితే వెలుస్తావో అచ్చ పసుపుపచ్చగా
అచట నివసించినారేమో నీలాంటి
నిమ్మపండు లాంటి నిండైన ఆడపడుచులని
లేక మొలిచావేమో నీవే వారి అస్తికలపై
వారి అందాలకు అనవాళ్ళుగా యని.

గుత్తులుగుత్తులుగా పూయు నీ పూలు చూస్తుంటే
ప్రకృతి తన పట్టరాని ఆనందాన్ని చిందులు
త్రొక్కుతూ ఇట చిగురించెనా?
విహంగమై విహరించెనా? యని అనిపిస్తుంది నాకు.

స్త్రీకి పసుపూ కుంకుమా అందమంటారు.
నీ దళాలు నాకు పసుప్పచ్చని చీరె ధరించిన వధువువలె,
నీ కొమ్మలు, ఆకుపచ్చని ఆకులు ధరించి నిన్ను మోసుకుపోతున్న
పల్లకీ బోయిలవలె అనిపిస్తాయి నాకు
నీవూ, మోదుగా, పసుపూ కుంకుమలవలె
వనజాక్షికి అలంకారాలవలె, వనమంతా వెలిగించే వెన్నెలల,
కన్నెలల వలె అనిపిస్తాయి నాకు.

కథ

# బంగారు జడ కుప్పెలు

**జడ కుప్పెలతో పెన వేసుకున్న సెంటుమెంటును తెలిపిన ఒక స్త్రీమూర్తి కథ....**



డా॥ వాణి దేవులపల్లి

"ఇంకెంత సేపురా.. తల్లీ.. జుట్టు నొప్పెడుతోంది.. ఇంకా అవలేదా నీ జడ వెయ్యడం...". తలను చేత్తో పట్టుకుని పదేళ్ళ మనవరాలు షణ్ముఖ ప్రియను ముద్దుగా విసుక్కుంది వసుంధరమ్మ. తను రోజూ వేసుకునే ముడిని విప్పి, తల దువ్వి ప్రియ 'జడ'లా అల్లడం, తన జుట్టుతో ఆడుకోవడం వసుంధరమ్మకు షరా మామూలే! ప్రియకు అదో సరదాతో కూడిన ఆట అయితే, ఆ ఆటను ప్రియ ముచ్చటను కాదనలేని మురిపెం ఆ నానమ్మది. తల్లి చూస్తే "పెద్దవాళ్ళతో ఏంటా ఆటలు?" అంటూ కోప్పడుతుందని ప్రియ దొంగ చాటుగా నానమ్మ గదిలో కొచ్చి చేస్తుందీ పని. వసుంధరమ్మది చాలా పొడవైన తలకట్టు. అలా ప్రియ ఆమెకు జడ వేస్తున్నప్పుడు ఎన్నో కబుర్లు చెప్పుకుంటారు నానమ్మ, మనవరాలు.

"ఇంకా ఎంతసేపు తల్లీ...". " ఇదిగో అయిపోయింది నానమ్మ.. నీ జుట్టు పొడుగ్గా వుంటుంది కదా... టైం పట్టదా ఏంటి మరి?" కిల కిలా నవ్వుతూ. "ఊ... ఇదిగో.." అంటూ ఆమె బారు జడను భుజం మీదుగా తిప్పుతూ ముందుకేసింది ప్రియ. తెల్లజుత్తు అక్కడక్కడా నల్లని జుట్టుతో పొడవైన జడ... చివరగా గంటల ఆకారంలో వుండి, బంగారు చెక్కడంతో వున్న గొట్టాల్లాంటి ఆకారాల్లోంచి కప్పినట్టుగా క్రిందకు జాలువారుతూ మెరుస్తున్న నల్లని పొడవైన పట్టుకుచ్చులు మెత్తగా హాయిగా తగుల్తూ..! వసుంధరమ్మకు ఒక్క క్షణం నోట మాట రాలేదు. తను కలగనట్లేదు కదా..!? బంగారు జడ కుప్పెలు.... తన జడకు అల్లుకుని అలంకరింపబడి అందంగా... వెండి తీగల్లా వున్న తన జుట్టులో పసిడి గంటల్లో ఒదిగిన నల్లని పట్టుకుచ్చులు సుతారంగా మెరుస్తూ.. వాటిని ఓసారి ఆప్యాయంగా అపురూపంగా తడిమి చూసుకుంది వసుంధరమ్మ. అవునూ... సందేహం లేదు అక్షరాలా బంగారు జడ కుప్పెలే ఇవి! తన జీవితంలో ఓ అపూర్వంగా, ముచ్చటగా మిగిలిపోయిన బంగారు జడకుప్పెలు ఇప్పుడు తన జడలో ముస్తాబై, అలవోకగా...రాజసంగా హొయలొలికిస్తూ...! అది 'కల కాదు' అని రూఢి చేసుకున్న వసుంధరమ్మ ఆనందంతో తబ్బిబ్బయింది. ఎందుకో హఠాత్తుగా ఆమె కళ్ళల్లో నీళ్ళు చిప్పిల్లాయి. కాస్సేపటికి తేరుకుని... "ఏంటిరా బంగారం.. నాకు నీ బంగారు జడకుప్పెతో జడేసావా? మా అమ్మే.. మా చిన్న తల్లీ..."

ఆమెకు చప్పున మొన్న కోడలు వందన 'బ్యాంకు వెళ్తున్నా అత్తయ్య గారు.. బతుకమ్మ పండగ వస్తుంది కదా... ప్రియ నగలు లాకర్ లోంచి తీసుకొస్తా..." అని చెప్పిన విషయం గుర్తొచ్చింది. 'ఇప్పుడు మళ్ళీ పాతకాలం నాటి నగలు- వంకీ, వడ్డాణం, పాపిటబిళ్ళ, జడమొగ్గలు, జడకుప్పెలు, చెంప స్వరాలు అన్నీ ఫ్యాషన్ అయిపోయాయి అత్తయ్య గారు.. పిల్లకి ఒక్కో నగా చేయించి పెడ్తున్నా...' అంతకు ముందెప్పుడో మాటల మధ్య కోడలు అన్న మాటలు స్ఫురించాయి.

ఆలోచనల్లో నిమగ్నమైన వసుంధరమ్మను "నానమ్మా... జడ బావుందా అంటే చెప్పవేం.. ఎన్నిసార్లు అడగాలి... జడ కుప్పెలుతో ఇంకా పొడవైంది కదా నీ  జడ ...." తన గుండ్రని భూగోళాల్లాంటి కళ్ళను అందంగా అటూ ఇటూ తిప్పుతూ అడుగుతున్న ప్రియ మాటలకు "ఊఁ.. చాలా బావుంది బంగారం... నువ్వు... మరి... మా అమ్మవు కదా... అందుకే ఇంత బాగా వేశావ్..." అంటూ మనవరాలిని హృదయానికి హత్తుకొని ముద్దులు పెడుతూ...' మా అమ్మవు కనుకనే నా తీరని కోరిక ఈ విధంగా.. ఇంత కాలానికి ఇలా తీర్చావురా బంగారం... "అస్పష్టంగా గొణికినట్టుగా అన్న ఆమె మాటలు ప్రియ చిన్ని మనసుకు అర్థం కాలేదు. కాస్సేపటికి తృప్తిగా తన్మయంగా కళ్ళు మూసుకున్న

కథ

వసుంధరమ్మ కళ్ళల్లోంచి రెండు కన్నీటి బొట్లు జలజలా రాలాయి.

ఆమె మనసు గతం వైపు పరుగు తీసింది.

★ ★ ★

వసుంధరకు అన్ని పండుగలు ఇష్టమే అయినా బతుకమ్మ పండుగంటే చాలా ఇష్టం. పండుగల రోజు తన పొడుగాటి జడకు అందంగా అల్లుతూ అమ్మ వేసే జడకుప్పెలంటే ఇంకా ఇష్టం. బతుకమ్మ పండుగ తొమ్మిది రోజులూ అలా జడకుప్పెలు వేసుకునే అవకాశం ఉన్నందువల్లనేమో ఈ పండుగ అంటే ఆమెకు మరీ ఇష్టం. ఆ తొమ్మిది రోజులూ స్నేహితులతో ఆడుతూ పాడుతూ అలుపెరగక గడిపే ఆ అందమైన సాయంకాలాలంటే ఎంతో ఇష్టం.

బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతిలో ఓ అపురూప ఘట్టం. ఇది ఆడవాళ్ళకు మాత్రమే సంబంధించిన ప్రత్యేకమైన పండుగ. ప్రతిరోజూ ఆడపిల్లలంతా ముస్తాబై అమ్మ వాళ్లతో కలిసి చక్కగా పూలతో పేర్చిన బతుకమ్మలు ఇంటికి దగ్గరలో ఉన్న వేణుగోపాల స్వామి గుడికి వెళ్లి బతుకమ్మ ఆడుకోవడం ఆనవాయితీ. ఊళ్ళోని ఆడవాళ్ళంతా కూడా ఇదే గుడికి వచ్చి గుంపులు గుంపులుగా, వృత్తాకారంలో నిల్చొని మధ్యలో తంగేడు పువ్వు ప్రధానంగా గునుగు, కట్ల, గన్నేరు, రుద్రాక్ష, గుమ్మడి, పారిజాతం, మందార, జాజి, విరజాజి, బొడ్డుమల్లె, మున్నగు రంగు రంగుల పూలతో గమ్మటంలా పేర్చిన బతుకమ్మలు పెట్టి, ఆ బతుకమ్మలను 'మహాలక్ష్మి' అవతారంగా మొదట పూజించి తర్వాత లక్ష్మీ స్వరూపుల్లా చక్కగా ముస్తాబై వచ్చిన ఆడవాళ్ళ కోలాటాలతో, చిట్టి శ్రీమహాలక్ష్మి స్వరూపుల్లా పట్టు పరికిణీల్లో బుట్ట బొమ్మల్లా ముస్తాబై వచ్చిన అమ్మాయి ఆట, పాటలతో గుడి ప్రాంగణమంతా కోలాహలంగా కన్నుల పండుగగా ఉండేది. ముఖ్యంగా తన దోస్తులు రమ, మంగ, లక్ష్మీ, మున్ని, సంధ్య, శారద, అపర్ణ, సులోచన, వనజ, శోభ, సుభద్రలతో కలిసి గుడి చుట్టూ తిరుగుతూ, సీతాకోక చిలుకల్లా పరిగెత్తుతూ ఆటలాడుకోవడం ఓ మధురమైన జ్ఞాపకం. ఇంతలో నెమ్మదిగా సూర్యుడు పడమర అస్తమిస్తూ, చిరుచీకట్లు పులుముకుంటుండగా, 'ఒక్కేసి పువ్వేసి చందమామా.... ఒక్క ఝాము ఆయె చందమామా...' అంటూ పాట పాడుతూ అమ్మ వాళ్ళు బతుకమ్మను ఆ రోజుకు నిద్రపుచ్చే దాకా తను ఆటలు కొనసాగేవి. ఆ తర్వాత ఇంటికి వచ్చిన దోస్తులందరితో తమ తమ డాబాల మీదికెళ్ళి ఎన్నెన్నో కబుర్లు చెప్పుకునే వారు. ఇంతలో అమ్మ పిలిచి పచ్చి మోదుగాకులతో కుట్టిన విస్తళ్ళలో చింతపండు పులిహోర, అప్పాలు, భక్షాలు పెట్టిస్తే ఆవురావురుమంటూ అందరం ఆరగించడం తనకింకా గుర్తు. ఆకుపచ్చని మోదుగాకు విస్తళ్ళలో పసుపు రంగు పులిహోర, ఎర్రని అప్పాలు, గోధుమ రంగులో భక్ష్యాలు-రంగు రంగుల తినుబండారాలు నోరూరించి కనువిందు చేసేవి. ఆ తర్వాత స్నేహితులందరూ కబుర్లతో ఒకరి చెవి లోలాకులను మరొకరు తడిమి చూస్తూ, ఒకరి మెళ్ళో పూసల దండలను మరొకరు స్పృశిస్తూ అమాయకంగా మెరిసే కళ్ళను కదలాడిస్తూ ముచ్చట్లలో మునకలేస్తూ తాము కొత్తగా రేడియోలో నేర్చుకున్న లలిత సంగీతం పాటలు, భక్తి గీతాలు, బతుకమ్మ పాటలు పాడుకొని ఆనందించేవారు. అప్పుడప్పుడే పశ్చిమాన అస్తమిస్తూ కనువిందు చేస్తున్న సూర్యబింబాన్ని అబ్బురంగా చూస్తూ ఇంటి వెనక నుండి సన్నజాజి, విరజాజి, మల్లె, మొల్ల, బొడ్డు మల్లె సౌరభాలను మోసుకొస్తూ తమ చెక్కిళ్ళను సుతిమెత్తగా స్పృశిస్తూ వీచే ఆహ్లాదకర పిల్ల తెమ్మెరలను ఆస్వాదిస్తూ... ఆ అందమైన సాయంకాలాలో సమయం ఎంత ఎలా గడిచిపోయిందో కూడా తెలియని స్థితి. గురవయ్య సారు కానిగి బడి దోస్తుల నుంచి సర్కారు బడి దోస్తుల వరకు అరమరికలు లేని ఆ స్నేహబంధం ఎంత గొప్పది! ఏ తరతమ భేదాలు లేని, కుల, మత, ప్రాంత విభేదాల సరిలేని ఆ సమున్నత మానవ సంబంధాల కలయిక నిజం చెప్పాలంటే.... ఓ గొప్ప సామ్యవాద పరిమళానికి ప్రతీక. 'అవును...! ఆ రోజులెంత మధురం! ఆలోచనల్లోంచి ఒక్క క్షణం కళ్ళు తెరిచి జడకున్న బంగారు జడ కుప్పెలను మరోసారి ఆత్మీయంగా, పదిలంగా తడిమి చూసుకుంది వసుంధరమ్మ. ఏదో అలికిడిగా అన్పించడంతో చప్పున జడ కుప్పెలను కొంగు చాటుకు దాచింది. ఆమెకు సిగ్గుగా అన్పించింది ఒక్క క్షణం. 'ఇలా జడకుప్పెలతో తననెవరైనా చూస్తే?.. కొడుకులు గానీ, కోడళ్ళు గానీ, అసలే బతుకమ్మ పండుగ కని వచ్చిన పెద్దకొడుకు కుటుంబం, వియ్యంకులు అందరు బంధువులున్నారు ఇంట్లో. 'డెబ్బై ఏళ్ళ వయస్సులో ఈ పెద్దావిడకు ఇప్పుడివేం షోకులు... ఇదేం పోయే కాలం.. అనుకోరూ...?'. 'ఛ.. తన కొడుకులు... కోడళ్ళు బంగారం...! ఆత్మీయతాను బంధాలతో, సానుకూల దృక్పథంతో, ప్రేమానురాగాలతో అల్లుకున్న కుటుంబం తనది. ఆయన పోయినప్పటి నుండి తనను కంటికి రెప్పలా

**అమ్మ నాన్న సంభాషణ వల్ల మొత్తానికి తనకు బంగారు జడకుప్పెలు చేయించడమనే విషయం పక్కన పెడితే ఉన్న అక్క జడకుప్పెలకూ ఎసరొచ్చిందనే విషయం వసుంధర చిట్టి బుర్రకర్థమైంది. పాపం అమ్మ తనకు జడకుప్పెలు చేయించలేకపోతున్నందుకు ఏడ్వడం, బాధపడడం వసుకి అస్సలు నచ్చలేదు. "నాన్నగారు సంతలో తెచ్చిన ప్లాస్టిక్ జడకుప్పెలు బావున్నాయి" అని చెప్పాలి అమ్మకు. గట్టిగా నిర్ణయించుకుంది వసు.**

క
థ

చూసుకుంటున్నారు పిల్లలు. ప్రతీ పండుగ ఎక్కడో ఓ చోట అందరూ చేరి, కోడళ్ళ తల్లిదండ్రులతో సహా కలిసి ఆత్మీయంగా, ఆనందంగా జరుపుకుంటారు. ఏ మాటకామాటే చెప్పుకోవాలి. వియ్యంకులు కూడా తనను ఎంతో గౌరవంగా అభిమానంగా చూస్తారు. తమకు అటు పుట్టిల్లు ఇటు మెట్టినిల్లు రెండూ పెద్ద సమిష్టి కుటుంబాలవడంతో పెద్ద కుటుంబాల్లో వుండే ఇబ్బందులే కాదు అరమరికలు లేనితనం, అడ్జస్టుమెంట్లు కూడా తను చిన్నప్పటి నుండే ఒంటపట్టించుకోవడం వల్ల పిల్లలకు కూడా ఆ సంస్కృతితో కూడిన సంస్కారం వచ్చింది. అందుకే, వాళ్ళకు కూడా ఏ పండుగొచ్చినా ఇల్లు పదిమందితో గలగలా సంభాషణలతో, నవ్వులతో సందడిగా కళ కళ లాడాల్సిందే.

వసుంధరమ్మ పెదాలపై చిన్ని గర్వంతో కూడిన చిరునవ్వు కదలాడింది ఒక్క క్షణం.

కొంగుచాటునున్న జడకుప్పెలు కితకితలు పెట్టగా, బయటకు తీసి వాటిని ప్రేమగా నిమరింది. మళ్ళీ సుతారంగా పట్టుకుని వాటిని చెంపకు ఆర్తిగా అనించుకుంది. పట్టుకుచ్చుల మెత్తదనం చెప్పలేని హాయినిచ్చింది ఎందుకో.

అక్కకున్న బంగారు జడకుప్పెల్లాంటివే తనకూ కావాలని సంతలో కొన్న ప్లాస్టిక్ జడకుప్పెలు ఇకముందు అసలు వేసుకోనని ఆ రోజు కరాఖండిగా చెప్పి, అమ్మతో దెబ్బలాడడం గుర్తొచ్చి వసుంధరమ్మ కళ్ళు సజలమయ్యాయి.

ఆ రోజు తనకు బాగా గుర్తుంది. అమ్మతో సంతలో కొన్న పిచ్చి ప్లాస్టిక్ జడకుప్పెలు రంగు వెలిసి ఉత్తినే విరిగి పోతున్నాయని, తను అస్సలు వాటిని వేసుకోనని, అక్కకున్నటువంటి బంగారు జడకుప్పెలే తనకు కావాలని ఏడ్చి గోల చేసి, చివరికి అలిగి అన్నం కూడా తినకుండా పడుకుంది తను. అమ్మ ఎంతో బ్రతిమిలాడింది బుజ్జగించింది. చివరగా తనను దగ్గరగా తీసికొని ముద్దులు పెట్టి వచ్చే బతుకమ్మ పండుగ వరకు బంగారు జడకుప్పెలు ఎలాగైనా చేయిస్తానని మాటిచ్చింది. అ తరువాత తను సంతోషంగా తృప్తిగా పడుకుంది. కానీ బంగారు జడకుప్పెలు గూర్చిన కలలతో, ఆలోచనలతో ఆ రాత్రి తనకెంతకూ నిద్రపట్టలేదు. ఇంతలో దగ్గరగా అమ్మా నాన్నల మాటలు వినిపించాయి.

"పార్వతీ, నీకో విషయం చెప్పాలి".

"నేనూ ఓ విషయం అడగాలనుకుంటున్నా మిమ్మల్ని "

"అయితే ముందు నువ్వు అడుగు"

"ఏం లేదండీ సంక్రాంతి, ఉగాది, దసరా ఏ పండగొచ్చినా ఈ పిల్లలతో బంగారు జడకుప్పెలు పేచీ వస్తుంది. ఉన్నదేమో ఒక్కటే జడకుప్పెలు. ఏదైనా పంటతాలూకు పైకం చేతికొస్తే ఈ సారైనా చిన్న తల్లి వసుకు బంగారు జడకుప్పెలు చేయిద్దామని! మాకు తెల్సుకదా పెద్దదాని మొండితనం... అందునా దానికి అత్తయ్య గారాబం కూడా తోడైంది. వసుకు ఒక్కసారైనా తన బంగారు జడకుప్పెలు ఇవ్వదు. ఇక బతుకమ్మ పండుగొచ్చిందంటే చాలు అ తొమ్మిది రోజులు... ప్రతి రోజూ ఆ బంగారు జడకుప్పెల గురించి ఇద్దరికీ గొడవే! ఏం చెయ్యాలో అర్థం గావట్లేదండీ...! తిరిగి చూస్తే మళ్ళీ బతుకమ్మ పండుగ రానే వస్తోంది..." దిగాలుగా అమ్మ గొంతు. తాను అడగాలనుకున్న విషయమే భార్య ప్రస్తావించడం రామారావుకి సులువయింది.

"ఇంటి పరిస్థితులు నీకు తెలియందేముంది పార్వతీ.. పెద్ద కుటుంబం... పంట ద్వారా వచ్చిన డబ్బు ఎప్పటికప్పుడు ఇంటి ఖర్చులకే చాలని స్థితి. చెల్లెళ్ళ పెళ్ళిళ్ళు, తమ్ముళ్ళ చదువులకు అయిన అప్పులు వడ్డీలు పాపం పెరిగినట్టు పెరుగుతూనే వున్నాయి...!"

"అవునను కోండి...కానీ.."

"ఈ విషయం గూర్చి ఇక ఆలోచించడానికేం లేదు పార్వతీ... మధ్య తరగతి జీవనాల్లో బంగారం కొన్నా, అది అలంకారానికో, అచ్చటా ముచ్చటా



తీర్చుకోవడానికో కాదు పార్వతీ... అవసరాలకు ఆదుకుంటుందని మాత్రమే....! అందుకే దాన్ని 'స్త్రీ ధనం' అన్నారు. ఈ సారి బతుకమ్మ పండక్కి సంతలో రెండు ప్లాస్టిక్ జడకుప్పెలు కొనాలి....''

'అంటే మీరనేది...?'

'అవును... ఇంట్లోని బంగారం.. జడకుప్పెలతో సహా కుదువ పెట్టడమో, అవసరమైతే కొన్ని వస్తువుల్ని అమ్మడమో చెయ్యాల్సిన స్థితి... ఓ వైపు వరినాట్లు వేసే టైం... మరోవైపు పత్తి చేలకు షావుకార్ దగ్గర మందులు తేవడం.. కలుపు తీయించడం... ఎంత లేదన్నా ఇరవై, ముప్పై వేలు కావాలి పెట్టుబడి...''

కాస్సేపటికి అమ్మ వెక్కిళ్ళు..!

అమ్మ నాన్న, సంభాషణ వల్ల మొత్తానికి తనకు బంగారు జడకుప్పెలు చేయించడమనే విషయం పక్కన పెడితే ఉన్న అక్క జడకుప్పెలకూ ఎసరొచ్చిందనే విషయం వసుంధర చిట్టి బుర్రకర్థమైంది. పాపం అమ్మ తనకు జడకుప్పెలు చేయించలేకపోతున్నందుకు ఏడ్వడం, బాధపడడం వసుకి అస్సలు నచ్చలేదు. "నాన్నగారు సంతలో తెచ్చిన ప్లాస్టిక్ జడకుప్పెలు బావున్నాయి" అని చెప్పాలి అమ్మకు. గట్టిగా నిర్ణయించుకుంది వసు.

**అమ్మ తన స్వార్థం, తన సుఖం చూసుకోకుండా తన పిల్లల కోసం ఆరాటపడింది. అతని కళ్ళు వర్షిస్తూనే వున్నాయ్ ఆగకుండా. అమ్మలందరూ ఇలానే వుంటారా? కావచ్చు.. కానీ అరుదైన వ్యక్తిత్వంతో అలరారే తమ అమ్మ వసుంధరమ్మ మాత్రం తమకు ప్రత్యేకం. తమ ఇష్టాలను, చిన్ని చిన్ని సంతోషాలను, పెద్ద పెద్ద కోరికలను తీర్చడం కోసం అవసరమైతే నాన్న గారితో విభేదించడమే కాదు, దేనినీ లక్ష్యపెట్టని మాతృమూర్తి! ఆహా.. అమృత మూర్తి!**

* * *

కాలం తన పని తాను చేసుకుపోతూనే వుంది. అక్క పెళ్ళి కాగానే తన డిగ్రీ చదువు పూర్తి కాకుండానే తెలిసిన మంచి సంబంధం అంటూ శివరామ్‌తో తన పెళ్ళి చేసేశారు అమ్మనాన్నలు. అమ్మ వారసత్వం తనకొచ్చిందా అన్నట్టు అతిపెద్ద ఉమ్మడి కుటుంబం అయిన అత్తవారింట్లో పెద్ద కోడలిగా అడుగుపెట్టింది తను. శివరామ్‌తో బాటు ఇంటి బాధ్యతలు నెత్తిన పడ్డాయి. అటు మరుదుల చదువులు, ఆడబిడ్డల చదువులు, పెళ్ళిళ్ళు, బారసాలలు ఓ వైపు.. ఈ లోపు తమకు కలిగిన ఇద్దరు బాబులు శ్రీరామ్, జయరామ్‌లను పెంచి పెద్ద చేయడంలాంటి బాధ్యతలలో పడి తను తన బంగారు జడకుప్పెల కోరికను ఎప్పుడో మర్చిపోయింది. కనీసం తనకి ఓ ఆడపిల్ల కల్గినా బహుశా మళ్ళీ తెరమీదికొచ్చేదేమో తన కోరిక! కానీ చిత్రంగా తనకు ఇద్దరూ మగపిల్లలే అవడంతో వాళ్ళ అవసరాలు, కోరికలు తీరుస్తూ గొప్పవాళ్ళుగా స్థితిమంతులుగా తీర్చిదిద్దాలన్న తాపత్రయంతో తన 'బంగారు జడకుప్పెలు' కోరిక మనసు అట్టడుగు పొరల్లో నిక్షిప్తమైపోయింది. కానీ.. ఇంత కాలానికి మళ్ళీ ఈ విధంగా తీరడం యాదృచ్ఛికమా? దైవ నిర్ణయమా? ధారగా ప్రవహిస్తున్న కన్నీళ్ళను తుడుచుకుంది వసుంధరమ్మ. ఏడ్చి ఏడ్చి బరువెక్కిన ఆమె కళ్ళు మూతలు పడుతున్నట్టన్పించింది. జడకున్న బంగారు జడకుప్పెలను సాగతీస్తున్నట్టుగా నిమురుతూ వాటిని హృదయానికి హత్తుకుంది. ఇప్పుడు ఆమె పెదవులపై వెన్నెలలా పరుచుకున్న చిక్కటి చిరునవ్వు..!

* * *

ఇంటి ముందు వసారాలో జయరామ్ అటు ఇటు కాలుగాలిన పిల్లిలా తిరుగుతున్నాడు. అతని మనసు నిండా కందిరీగల్లా ముసురుకున్న ఆలోచనలు. నిన్న అమ్మ గదిలో అల్మారాలో ఏదో ఆఫీస్ పేపరు కోసం వెతుకుతుంటే కన్పించింది అమ్మ డైరీ. సభ్యత కాదని తెలిసీ చదివిన అమ్మ డైరీలోని అంశాలే పదే పదే గుర్తొస్తున్నాయి. తనకు తెలియకుండానే ఒక్కసారిగా జయరామ్ కళ్ళు తడయ్యాయి.

అతిపెద్ద ఉమ్మడి కుటుంబంలో అమ్మ తనకు, అన్నయ్యకు ఏ లోటు రాకుండా పెంచడానికి ఎంత తపన పడిందో, ఎంత కష్ట పడిందీ తెల్సింది. అటు ఇంటి బాధ్యతలతో తీరిక లేకుండా వుంటూనే, ఇటు ఖాళీగా వున్న కొద్ది సమయంలో ట్యూషన్లు చెబుతూ ఆర్థిక వెసులుబాటు కల్పించుకుంది. ముఖ్యంగా అన్నయ్య, తను ఏది కావాలని, కొనివ్వమని అడిగినా నాన్నగారిని ఒప్పించి కొనిచ్చేట్టు చేసేది. తనకు చిన్నప్పుడు 'బే బ్లేడ్' (చైనా బొంగరాలు)ల పిచ్చి బాగా వుండేది. అది కొనివ్వమని నాన్నగారిని అడిగినప్పుడు 'ఏంటీ..దీనికి మూడొందల అరవై రూపాయలా...? అక్కర్లేదు.. మామూలు మన తాడూ, బొంగరం కొనుక్కో. అన్నప్పుడు తన మొహం వాడిపోయింది. చిన్నబుచ్చుకున్నాడు. అలిగాడు, అన్నం తినలేదు. అప్పుడు అమ్మ నాన్నతో దెబ్బ లాడి, ఒప్పించి తనకు ఆ 'బే బ్లేడ్' కొనిపించింది. అప్పుడు తను అమ్మ మెడచుట్టూ చేతులు వేసి అమ్మను ముద్దులతో ముంచెత్తాడు. ఆ క్షణం అమ్మ కళ్ళు కోటి కాంతులతో మెరవడం తనకింకా జ్ఞాపకం. ఆ తరువాత తను 'అట్లాస్' సైకిల్ కావాలన్నప్పుడు, గిటార్ కావాలని ముచ్చట పడినప్పుడు తన స్నేహితులందరికీ వాళ్ళ మావయ్యలో, బాబాయిలో బంధువులో అమెరికా నుండి తెచ్చిన 'ఐ పాడ్' కొనివ్వమని అడిగినప్పుడు, ఇలా ప్రతి సందర్భంలో అమ్మ నాన్నగారిని ఒప్పించి తనకు ఆ వస్తువులన్నీ కొనిపెట్టిన విషయం గుర్తొచ్చింది. తనకు అప్పటికే 'ఆపిల్' కంపెనీ వస్తువులంటే పిచ్చి. ఆపిల్ కంపెనీ

'ఐ ప్యాడ్' కొత్త మోడల్ రిలీజ్ కాగానే అమెరికాలో వున్న 'కజిన్'తో తెప్పించుకోవాలనుందని అమ్మతో అనగానే డబ్బు సర్దింది. ఆ తరువాత ఇంజనీరింగ్ చదివేటప్పుడు తనకు ల్యాప్‌టాప్ అవసరమనీ, మార్కెట్‌లో కొత్తగా విడుదలయిన 'ఆపిల్' కంపెనీ 'మ్యాక్ బుక్' కావాలన్న కోరికను అమ్మ చెవిన వేశాడు. దాని ధర చెప్పినప్పుడు అమ్మ 'అమ్మో అంత ధరనా?' అన్నప్పుడు తను నిరాశకు గురయ్యాడు. కానీ, అమ్మ వారం, పది రోజుల్లోనే డబ్బిచ్చి 'తెప్పించుకో నాన్నా... నీకెలాగూ అవసరం కదా! అట్లాంటప్పుడు లేటెస్ట్ దయితే నీకు ఎక్కువ ఉపయోగం కదా!' అన్నప్పుడు అమ్మ డబ్బెలా సర్దిందో తనకప్పుడు తెలియనేలేదు. కానీ నిన్న డైరీ చదివినప్పుడు అమ్మ తన మెళ్ళోని పుస్తెల గొలుసు అమ్మి తనకు 'ల్యాప్‌టాప్' కొనిచ్చిందని తెలిసినప్పుడు మనసు బాధగా మూలిగింది. 'అమ్మా...' అతని అణువణువూ అమ్మ పట్ల కృతజ్ఞతతో ప్రేమతో నిండిపోయింది. బాధ కన్నీళ్ళ రూపంలో కట్టలు తెంచుకుంది.

అమ్మ తన స్వార్థం, తన సుఖం చూసుకోకుండా తన పిల్లల కోసం ఆరాటపడింది. అతని కళ్ళు వర్షిస్తూనే వున్నాయ్ ఆగకుండా. అమ్మలందరూ ఇలానే వుంటారా? కావచ్చు.. కానీ అరుదైన వ్యక్తిత్వంతో అలరారే తమ అమ్మ వసుంధరమ్మ మాత్రం తమకు ప్రత్యేకం. తమ ఇష్టాలను, చిన్ని చిన్ని సంతోషాలను, పెద్ద పెద్ద కోరికలను తీర్చడం కోసం అవసరమైతే నాన్న గారితో విభేదించడమే కాదు, దేనినీ లక్ష్యపెట్టని మాతృమూర్తి! ఆహా.. అమృత మూర్తి!

నాన్న-పిల్లలు ఏదైనా అడగగానే కొనిపెడితే వారు మొండివారుగా తయారవుతారని పైగా అలా కొనిపెడితే డబ్బు విలువ వాళ్ళకు తెలియకుండా పెరుగుతారని, అందువల్ల ఇంటి పరిస్థితులు ఎప్పటికప్పుడు వారితో చెప్పి అర్థం చేయించాలని అనేవారు. అమ్మ దానికి పూర్తిగా వ్యతిరేకం. ఇంట్లో ఇబ్బందులు, ఆర్థిక స్థితిగతులు పిల్లలకు తెలియకూడదనీ, ఇంటి చికాకులు వాళ్ళ బుర్రలో చొప్పించి హాయిగా ఆడుతూ, పాడుతూ, చదువుతూ ఆరోగ్యం గా ఎదగాల్సిన ఆ నిష్కల్మష నిర్మల పసి హృదయాలను కలుషితం చేయకూడదనే, వారి అవసరాలు, ఆనందాలు తీరుస్తూ పిల్లల వ్యక్తిత్వాలను తీర్చిదిద్దడం పెద్దలుగా తమ బాధ్యతేనని అమ్మ అభిప్రాయం. ఏ వయస్సులో మొగ్గ తొడిగిన కోరికను, ఇష్టాన్ని ఆ వయస్సులోనే తీర్చాలని అడిగీ, ఆ తర్వాత ఆ కోరిక పైన ఇష్టం చచ్చిపోయాక అది కొనిపెట్టినా ప్రయోజనం వుండదనేది అమ్మ వాదన. జీవితం లో ఏ దశా తిరిగి మళ్ళీ వెనక్కి రాదని ముఖ్యంగా మానవ జీవితంలో బాల్యదశ చాలా అందమైనదనీ, అపురూపమైనదనీ, అత్యంత విలువైనదీ అనీ, వ్యక్తి వికాసానికి ఆ దశ మూలమనీ, లేత మనసులు నొచ్చుకుంటే అది వారి భవిష్యత్ పై ప్రభావం పడుతుందనీ ఒక టీచర్‌లా నాన్నగారికి అర్థమయ్యేలా చెప్పేది అమ్మ. అయితే, అమ్మ ఏర్పరచుకున్న ఈ అభిప్రాయం వెనక అమ్మకు బాల్యంలో ఓ 'తీరని కోరిక' వుందనీ, అది ఆమె చిన్ని హృదయాన్ని గాయపరిచిందనీ తనకు నిన్ననే తెలిసింది. ఈ విషయం అతన్ని తీవ్రంగా కలిచివేసింది. కన్నీళ్ళతో మసక బారిన కళ్ళద్దాలను కర్చీఫ్‌తో తుడుచుకున్నాడు జయరామ్! తమ కోసం తన జీవితాన్నే ధారపోసి తామే సర్వస్వంగా జీవించిన అమ్మ గూర్చి తెలుసుకో లేక పోయినందుకు సిగ్గుపడ్డాడు జయరామ్!

"అమ్మా, ఇప్పుడు నేనే విధంగా తీర్చగలనమ్మా నీ కోరిక" బాధగా రోదించింది అతని హృదయం. దాని ఫలితమే షణ్ముఖ ప్రియ వచ్చి ఎప్పటిలా తను వసుంధరమ్మతో ఆడుకునే ఆటలో భాగంగానే అన్పించేలా వసుంధరమ్మకు తన 'బంగారు జడకుప్పెలు'తో జడవెయ్యడం!

ఎంతో ఆలోచించిన మీదట భార్యకు కూడా తెలియకుండా ప్రియతో చెప్పి ఆ విధంగా చేసేలా ఏర్పాటు చేసాడు జయరామ్! ప్రియ అమ్మకు 'జడకుప్పెలు'తో జడ వేసినప్పటి నుండి బయట కిటికీ గుండా తల్లి హావభావాలను గమనిస్తూనే వున్నాడు అతను. సంతోషంతో ఆమె ఉక్కిరిబిక్కిరి కావడం, పదే పదే జడకుప్పెలు పట్టు కుచ్చులను ఆత్మీయంగా తడమటం, తృప్తిగా కళ్ళు మూసుకోవటం, ఆనందభాష్పాలు రాల్చటం వంటి చర్యలను కళ్ళారా చూసిన జయరామ్ మనసు సంతోషంతో నిండిపోయింది.

"ఏయ్ ప్రియా.. జడకుప్పెలు ఎక్కడ పడేశావే?" అంటూ అప్పుడే అటుగా వచ్చిన వందన అత్తగారి జడకు జడకుప్పెలు వేలాడుతుండడం చూసి, "అయ్యో.. ఇదేంటి.. ఈ పిల్ల మీకు.. జడకుప్పెలతో జడవేసిందా అత్తయ్య... ఛ.. దీని అల్లరి రోజు రోజుకి శృతిమించుతోంది. క్షమించడత్తయ్య... చిన్న పిల్ల.. ఏమీ అనుకోకండి". రెండు చేతుల్లో బంగారు జడకుప్పెలను అపురూపంగా పట్టుకుని తాదాత్మ్యంగా కళ్ళు మూసుకున్నట్టున్న వసుంధరమ్మతో నొచ్చుకున్నట్టుగా అంది వందన. ఆమె సమాధానమివ్వకపోవడంతో, "నన్ను విప్పమంటారా అత్తయ్యా, జడకుప్పెలు..." అంటూ ముందుకు వంగి ఆమె చేతుల్లోని జడ కుప్పెలని తెద్దామని చేతులు చాపి ప్రయత్నించిన వందనకు అది సాధ్యం కాలేదు. అప్పటికే బిగుసుకున్న వసుంధరమ్మ చేతుల్లో విడివడని బంగారు జడకుప్పెలు! చిరునవ్వుతో ప్రశాంతంగా నిద్రపోతున్నట్టున్న వసుంధరమ్మ! ఒక్కసారి షాక్ కొట్టినట్టునట్టుగా చేతులు వెనక్కి తీసుకున్న వందన దుఃఖంతో సుళ్ళు తిరుగుతూ.. 'ఏమండీ' అంటూ భర్తను బిగ్గరగా కేకేస్తూ అక్కడే కూలబడిపోయింది.

సాహిత్య శిఖరం

## నోబెల్ సాహిత్య బహుమతి 2015

# స్వెత్లానా అలెక్సీవిచ్



బెలారస్ కు చెందిన రచయిత్రి స్వెత్లానా అలెక్సీవిచ్, 2015 వ సంవత్సరంలో సాహిత్య విభాగంలో నోబెల్ బహుమతి గెలుచుకుంది. ఆమె రచించిన 'ఎ మాన్యుమెంట్స్ టు సఫరింగ్ అండ్ కరేజ్ ఇన్ అవర్ టైం' అనే పుస్తకం నోబెల్‌ను తెచ్చి పెట్టింది. ఈమె పుస్తకాలు దాదాపు 19 దేశాల్లో ప్రచురితమయ్యాయి. జర్నలిస్టుగా కెరీర్ ను ప్రారంభించిన స్వెత్లానా అలెక్సీవిచ్, యుద్ధ బాధితుల వెతలను ప్రపంచానికి చూపించటమే లక్ష్యంగా పనిచేశారు. ముఖ్యంగా మహిళల దయనీయ పరిస్థితులే కథా వస్తువులుగా పలు పుస్తకాలు రాశారు. 'ది అన్ ఉమెన్లీ ఫేస్ ఆఫ్ ది వార్' స్వెత్లానా అలెక్సీవిచ్ యొక్క మొదటి రచన. స్వెత్లానా అలెక్సీవిచ్ రచించిన ద లాస్ట్ విట్నెసెస్, జింకీ బాయ్స్ - సోవియట్ వాయిసెస్ ఫ్రమ్ ద అఫ్ఘానిస్థాన్ వార్, ద చెర్నోబిల్ ప్రేయర్ - ఎ క్రానికల్ ఆఫ్ ఫ్యూచర్ పుస్తకాలు ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పొందాయి.

## జ్ఞాన్ పీఠ్ అవార్డు గ్రహీత 2013

# కేదార్‌నాథ్ సింగ్




ప్రముఖ హిందీ కవి కేదార్‌నాథ్ సింగ్‌కు 2013 లో జ్ఞాన్ పీఠ్ అవార్డు లభించింది. కేదార్‌నాథ్ సింగ్ రచించిన 'అకాల్ మే సారస్'కు గాను ఈ పురస్కారం లభించింది. ఉత్తర ప్రదేశ్‌లో జన్మించిన కేదార్‌నాథ్, తన చుట్టూ ఉన్న ప్రపంచాన్నే తన కవిత్వానికి వస్తువుగా మలచుకుని అనేక రచనలు చేశారు. తన చుట్టూ ఉన్న పదజాలాన్నేకవితా భాషగా స్వీకరించి ప్రజల భాషను సజీవంగా నిలబెట్టారు. కేదార్‌నాథ్ ప్రతి రచనలో సమాజంలోని వైరుధ్యాలు, వివిధ ప్రజాస్వామ్య ఉద్యమాల ఆకాంక్షలు ప్రతిబింబిస్తాయి. 'అభిబిల్కుల్ అభి', 'జమీన్ పక్ రహీ హై', 'అకాల్ మే సారస్', బాఘ్, కేదార్‌నాథ్ సింగ్ ప్రముఖ రచనలు.

కథ

# పంచ్ కళ్యాణి

స్వతంత్రేచ్ఛ కలిగిన తెలంగాణ యువతి ధైర్యాన్ని మన ముందుకు తీసుకువచ్చిన కథ...



పిన్నంశెట్టి కిషన్

మబ్బులదుప్పటి కప్పుకుని రాత్రంతా చినుకేసి, మునగదీసిన చుట్టపువాన ఉదయాన కూరాడు బువ్వ తినకుండనే వెళ్ళి పోయింది. "పాడిందే పాడేరా! పాసు పండ్ల దాసరి!" అని రోజూ రాత్రంత వర్షమే, సినిమాకు పోకుండ.

"గంగ విడువుము పార్వతి చాలున్!" అని అడగక ముందే వరమిచ్చి వదిలినట్లుంది శివయ్య. ఎటు చూసినా నీళ్లు... ఊరంతా నీళ్లు... నీళ్లలోనే ఊరు.

తాడి చెట్టు ఎత్తుతో మూలవాగు పొంగుతుంది.

కట్టుకాలువ నిండుగా... చాయ్ నీళ్లతో కదులుతుంది చెరువుకు తాగించ.

లాలపల్లెకు పోయే తొవ్వను కడుపులో దాచుకుంది చామకుంట.

చెరువు నిండి, నీటిప్రవాహం కట్ట పైనుండి దొర్లడానికి అలలపాదాలతో పరుగులు పెడుతుంది. కట్ట యాడ తెగిపోతుందోనన్న భయంతో కట్ట మైసమ్మకి మొక్కుకుని, బలి ఏర్పాట్లు చేస్తున్నరు పెద్దలు.

**మేము మాటల్ల ఉండంగనే కళ్యాణి నీళ్ళలోకి మునిగి, ఒకడి జుట్టు పట్టుకు తేలి, వాడ్ని నీళ్లల్ల ముంచుకుంట మెట్ల దగ్గరికి ఈడ్చుక వచ్చింది. నీళ్లు మింగి మొస ఆడుతలేదు వాడికి. కనుగుడ్లు ఎర్రగయినయి. కండ్లపొంట కారేది నీళ్ళో! కన్నీళ్ళో!.**

ధర్మ గుండం, చెరువు యుగళ గీతంలా కలిసి పోవడానికి పోటీ పడుతున్నయి. గుండంలోని మంటపాలు మునిగి పైకప్పులు తపుకుల్లా తేలుతున్నయి. నడిచే దారిలోకి నీళ్లు వొచ్చి గుడి ప్రహరి గోడలను తాకుతున్నయి. పెద్ద బజారు వైపేమో మెట్ల పైనుండి నీళ్ళు పొంగి పొర్లుతున్నయి. ప్రత్యేకంగా కాళ్ళు కడుక్కుని గుళ్ళోకి వెళ్లాల్సిన అవసరం లేకుండా వుంది.

చలువ పందిళ్లు తీసేయడంతో తలార స్నానం చేసి, కొమ్మల కురుల్ని ఆరేసుకున్న అమ్మ చెట్టులా గుడి, గుడి ప్రాంగణం అందంగా ఉంది.

తూము గేటు పూర్తిగా పైకి ఎత్తడం వల్ల నీళ్లు పొంగి, రోడ్ పైనుండి పారుతున్నయి. తూము మూతి దగ్గర వుబికి పడి లేస్తున్న నీళ్లలోంచి చేపలు ఎగురుతున్నయి, పడుచు పిల్ల బుగ్గల్లో మెరిసి మాయమయ్యే సొట్టల్లా. అప్పుడప్పుడు, చేపపిల్లలు ఎగిరొచ్చి కాలువ వొడ్డున అంట్లు తోమే బెస్త గంగవ్వ, కూర దేవన్నోళ్ల అమ్మ బెస్త మల్లవ్వల కాళ్ళ ముందర పడుతున్నాయి, పేగు బంధమో! నీటి బంధమో! పొగ బారిన బాసండ్ల వారి అరిపాదాల శ్రమ స్పర్శకు మోకరిల్లి మసి వదుల్చుకుని చందమామ చేపల్లా మెరుస్తున్నయి. బెస్త రాజయ్య, దేవయ్య తోపెలా తోటి (త్రిభుజాకార వల) అలుగుల చేపలు పడుతుండ్రు.

ఊరి మధ్యలోంచి నడిచివెళ్లే నదిలా వుంది కాలువ. "భీమేశ్వర ఆలయపు వీధి పొడువునా అలుగు పారే కాలువ ఉండేదట! ఈతలు కొట్టేంత లోతూ వెడల్పుతో అలుగు పారేదట! అందుకే ఆ వీధిలోని ఇళ్లన్నీ ఎత్తుగ ఉండే"దని చొప్పకట్ల చంద్రమౌళి సారు చెప్పేడిది. ఎంత సౌందర్యమయంగా ఉండేదో! ఊహించుకుంటేనే పులకాంకురాలు వస్తున్నయి. ఇళ్ల ముందర గద్దెలపై కూర్చుని, పారుకపు నీళ్లను చూస్తూ వుంటే కాలం తెలియదు. ప్రాణం లేచి వస్తది.

ప్రాణులకు ప్రాణం పోసే నీటి కాలం, ఓ అద్భుతం. ఎన్ని మొక్కలు వికసిస్తాయి! ఎన్నెన్ని జీవులు జీవం పోసుకుంటాయి! ఆ కాస్త కాలం కోసం కనిపించి కనుమరుగయ్యే ఉసిళ్ళు, బంగారు, ఆరుద్ర పురుగులు... చూసే చూపు ఉంటే చుట్టూ ఎన్నెన్ని అందాలు..

★ ★ ★

మూలవాగు పొంగు తీసి శివుని జటాజూటంలా పాయలు పాయలుగా పారుతుంది, వాగు వెడల్పున్న చోట. భీమునిపాదాల బండల దగ్గర పాయల్ని కల్పి అల్లిన జడలా పారుతుంది. తెల్లని

నీటి అలలపై మెరిసే వెలుతురు కిరణాలు చేప పిల్లల్లా మురిపిస్తూ అసలు చేపల్ని మరిపిస్తున్నయి. కొన్ని చోట్ల, 'కోమలి' నూగారులా ఉంది వాగు. నీటి ఉధ్ధృతి తగ్గడంతో, కట్టు కాలువలో గాలాలు వేసి చేపలు పడుతున్నరు కొందరు బెస్త మిత్రులు, తురక దోస్తులు...

చామకుంట లాలపల్లెకు దారి ఇచ్చింది.

ధర్మ గుండం మంటపాలు తిరిగి కనిపిస్తున్నయి.

మత్తడి దూకుడు తగ్గింది. కుచ్చిళ్ళు ఎత్తిపట్టుకున్న నీటికన్నెలా మెట్లు కనిపించి, చెరువు ఈతకు రమ్మని ఊరిస్తున్నది. బురద మెల్ల మెల్లగా తేరుకుంటు, నీటి రంగు మారుతుంది. చెరువు కన్నులోలె తామరాకులు తేలుతున్నయి.

★ ★ ★

అప్పుడప్పుడే కప్పలు, చేపలు చేరినట్టు ఈతకొట్ట పిల్లలు చేరుకున్నరు. నడుము లకు ఈత కట్టెలు, ఆనిగెపుకాయ బుర్రలు కట్టుకుని కొందరు. ఇంకొందరు కాటన్ బట్టతో కుట్టిన పూనా పైంట్ నడుం వైపు, కాళ్ళ చివర్ల దారంతో కట్టి, నీళ్లలో తడిపి ఊదంగనే గాలి నిండి రెండు పొడుగాటి ట్యూబుల్లా మారితే దాని జాయింట్ని కడుపు కింద వేసుకుని ఈదుతున్నరు. అవేవి లేనివాళ్లు చేతుల్తో తంతెల్ని పట్టుకుని కాళ్ళు ఆడిస్తున్నరు. కొత్తగా కొంత నేర్చుకున్న వాళ్లకి పెద్దలు నడుం దగ్గర దోతుల తోటి, ఎర్రపంచల తోటి కట్టి నీళ్ళలోపలికి నూకుతె, వాళ్ళ రెక్కల్లో బలం సన్నగిల్లి మునిగి పోతుంటే, "భయం పోకపోతే ఈత రాదురా!" అంటూ ధైర్యం చెప్పి, బయటికి గుంజుతున్నరు. ఇక ఈత వచ్చిన వాళ్ళ సంగతయితే చెప్పతరం కాదు - తూము పైనుండి ఉరుక్కుంటూ వచ్చి సూర్లు కొట్టేవాళ్ళు... ఆత్మప్రదక్షణ చేస్తున్నట్టుగా మెలికలు తిరుగుతూ పైకి ఎగిరి నీళ్ళలోకి దుంకెటోళ్లు.. గింగిరాలు కొడుతూ దొమ్మరిగడ్డలు వేస్తున్నట్టు దూకెటోళ్లు.. అంతా కోలాహలం.. ఉరకలేసే ఉత్సాహం.. సందడి సందడిగా ఉంది.

**కొంత సేపటికి వాళ్ళు దుంకుడు ఆపి, ముచ్చట్లు ఏవో పెట్టుకుంటుండ్రు. మా నజర్ వాళ్ళ మీదనే ఉందాయె! ఈ సారి చెవులు సుత అప్పజెప్పినం. వాళ్ళు మెట్లకాడి నుండి కొంత లోపలికి పోయి చోర్ పోలీస్ ఆడుడు షురూ జేసిండ్రు. చూపుడు వేలితో క్యారం బోర్డులో కాయిన్ని కొట్టినట్లు నీళ్ళపైన కొట్టాలె. నీళ్లు చిత్తకుండ వేలు నీటిలోపలికి పోతే పోలీస్. లేకపోతే దొంగ. దొంగలందరూ నీటిలో మునుగుతరు. పోలీసు నీళ్ల పైన తేలుతూ ఉంటడు. తక్కువ సేపు మునిగి తెలీనోడు దొరుకుతడు.**



"ఈ గోల మా కేల!" అనుకుని, మాలగడ్డకు ఈదుకుంట పోతున్నరు గజ ఈతగాళ్లు కొందరు.

మామూలుగా తూము దగ్గర ఆకర్షణ ఎక్కువ. నీళ్ల లెక్క మనసును సుత గుంజుతది. డైవింగ్ ప్లాటుఫామ్ మీద ఉరికినట్టు ఉరికివచ్చి సూర్లు కొట్టొచ్చని, దుంకొచ్చని అందరి కన్ను ఆడనే ఉంటది.

నిజానికి... నీళ్ళే ఆకర్షణ, తన ఒళ్ళో ఈదులాడ పిలుస్తున్నట్టు ఉంటుంది.. పచ్చని అడవి, తన రహస్యాల్ని కనుగొని జయించమంటుంది. పర్వతం, తనపై పొరాడి అధిరోహించ కవ్విస్తుంది.

ఆ రోజు ఐతారం. జనాలు తామర తంపరగా ఉన్నరు. ఎప్పుడైనా మేము గుండం దిక్కు ఈదుతం. నీళ్ల మోటార్ కోసం కట్టిన గద్దె మీదికెల్లి సూర్లు కొడుతం. ఆ యాల్ల మాకంటే ముందు గాల ఓ గుంపు కొడుతున్నరు. అటు పక్కకు ఆడోళ్ళు బట్టలు పిండుతున్నరు. ఇక తప్పదని ఆ గుంపు పక్కన తూముకేసి దిగినం. ఆ పోరగాండ్లల్ల తెలిసిన మొఖం ఒక్కటి లేదు. చుట్టపు చూపుగా మా ఊరు వచ్చినోల్లో, తీర్థపోల్లో, లొల్లి లొల్లి జేస్తున్నరు. బట్టలు తుక్కుంటున్నోళ్ల పైనుండి దూకుతున్నరు. వాళ్ళు కోపానికి వస్తే కొంతసేపే, మల్ల ఎప్పటాటనే. ముందే జాగ పోయిందంటే వాళ్ళు చేసే ఆటకోయిలి పనులకు కోపం నషాళానికి ఎక్కుతోంది. మాకు ఈత కొట్టుడు తక్కువైంది, వాళ్ళను తిట్టుకునుడు ఎక్కువైంది.

కొంత సేపటికి వాళ్ళు దుంకుడు ఆపి, ముచ్చట్లు ఏవో పెట్టుకుంటుండ్రు. మా నజర్ వాళ్ళ మీదనే ఉందాయె! ఈ సారి చెవులు సుత అప్పజెప్పినం. వాళ్ళు మెట్లకాడి నుండి కొంత లోపలికి పోయి చోర్ పోలీస్ ఆడుడు షురూ జేసిండ్రు. చూపుడు వేలితో క్యారం బోర్డులో కాయిన్ని కొట్టినట్లు నీళ్ళపైన కొట్టాలె. నీళ్ల చిత్తకుండ వేలు నీటిలోపలికి పోతే పోలీస్. లేకపోతే దొంగ. దొంగలందరూ నీటిలో మునుగుతరు. పోలీసు నీళ్ల పైన తేలుతూ ఉంటడు. తక్కువ సేపు మునిగి తేలినోడు దొరుకుతడు.

ఇంతట్ల, అమ్మాయిలంతా ఉతుకుడు ఆపి మెట్ల మీద నిలవడి మాట్లాడు కోవట్టిండ్రు. కాళ్ళను ఎవరో గిచ్చిండ్రని అనుకుంటున్నరు. ఆ మాటలు మాదాక వినిపిస్తున్నయి. కొత్తగ వచ్చిన పోరగాండ్లు ఇదేం పట్టనట్లు ఆడుతున్నరు. మాకు అర్థమయింది. అమ్మాయిలకూ అర్థమయి ఉంటుంది, 'నీళ్లలో మునిగినోడు ఎవడో వాళ్ళ కాళ్ళను గిచ్చి ఉంటడని. ఏదో మాట్లడుకుని, ఏం కానట్లే నీళ్ళలోకి దిగి బట్టలు ఉతుకుడు తిరిగి మొదలు పెట్టిండ్రు.

మా మిత్రులు ఆవేశంతో ఉన్నరాయె, "పోయి నాలుగు పీకి వద్దాం పాండ్రి" అన్నడు శఫిక్.

"అరేయ్! మీరేం హీరోలు కానక్కర్లేదు. ఆ బట్టల బ్యాచ్‌లో అసలు సిసలు హీరో ఉంది" అన్న.

"ఎవరు? ఎవరు?" అంటే, "ఉపాధ్యాయుల సాంబశివన్న పెద్ద చెల్లె... కళ్యాణి".

ఓసారి...

> **తూము గేటు పూర్తిగా పైకి ఎత్తడం వల్ల నీళ్లు పొంగి, రోడ్ పైనుండి పారుతున్నయి. తూము మూతి దగ్గర వుబికి పడి లేస్తున్న నీళ్లలోంచి చేపలు ఎగురుతున్నయి, పడుచు పిల్ల బుగ్గల్లో మెరిసి మాయమయ్యే సొట్టల్లా. అప్పుడప్పుడు, చేపపిల్లలు ఎగిరొచ్చి కాలువ వొడ్డున అంట్లు తోమే బెస్త గంగవ్వ, కూర దేవన్నోళ్ల అమ్మ బెస్త మల్లవ్వల కాళ్ళ ముందర పడుతున్నాయి, పేగు బంధమో! నీటి బంధమో! పొగ బారిన బాసండ్లు వారి అరిపాదాల శ్రమ స్పర్శకు మొకరిల్లి మసి వదుల్చుకుని చందమామ చేపల్లా మెరుస్తున్నయి.**

పంచకళ్యాణి దొంగల రాణి, అని పాడుకుంట ఓ పోరడు సైకిల్ మీద పోవుకుంట తనను ఛిడాయిస్తుంటే సైకిల్ ఎంబడి ఉరికి పోయి... క్యారియర్ అందుకుని... గుంజి కింద పడగొట్టి... పడ్డోన్ని గల్లా వట్టి లేపి... ఆచెంప ఈచెంప వాయించి పంపింది. ఇప్పుడు సుత ప్రేక్షకుల్లా సినిమా చూడుండ్రి" అన్న.

"అంతే కాదుగా కేశన్నగారి చందు లేడు.. గాయన చెర్ల జారి పడితే కళ్యాణక్కనే కాపాడింది. నాకు తెల్సు" అన్నడు, బుడుబుంగ లెక్క ఈదుకుంట ఎడ్ల సురేందర్. వీళ్ళ బాపులు ఎడ్ల వెంకన్న గారు, ఉపాధ్యాయుల బ్రహ్మమయ్య గారు గుళ్లో సహోద్యోగులు.

నోట్లె పట్టుకున్న నీళ్లను నల్లపైపులకెల్లి వస్తున్నట్లు ఊది, "అదే, ఇంకో ఇంకో ఊర్లె అయితేనా... సాహస బాలిక అవార్డుకు పంపేటోళ్లు!" అన్నడు చంద్రుడు.

"ఆడ ఉన్నోళ్లను చూసిండ్రా! కళ్యాణి వాళ్ళ వదిన, కేశన్నగారి మహేశ్వరి. మల్లారం ప్రమోదు చెల్లె, శ్రీమతి. మామిడిపల్లి కిట్టన్నచెల్లె, పద్మ. అందరికి ఈతగొట్టుడు, కొట్టుడు రెండూ తెలుసు. వాళ్ళ పంచాయితి వాళ్ళు తప్ప జేసుకుంటరు" అన్న.

మేము మాటల్ల ఉండంగనే కళ్యాణి నీళ్ళలోకి మునిగి, ఒకడి జుట్టు పట్టుకు తేలి, వాడ్ని నీళ్లల్ల ముంచుకుంట మెట్ల దగ్గరికి ఈడ్చుక వచ్చింది. నీళ్లు మింగి మొస ఆడుతలేదు వాడికి. కనుగుడ్లు ఎర్రగయినయి. కండ్లపొంట కారేది నీళ్ళో! కన్నీళ్ళో!. ఇయ్యర మయ్యర రెండు చెంపలు వాయిస్తుంటే తప్పయిందని దండం పెట్టిండు. అప్పటికే వాని సోపతిగాళ్లు పరారయిండ్రు.

ఈతలు ఆపి, నోళ్లు వెళ్ళబెట్టి చూస్తున్నరు అందరు. సినిమాలో pause shotలా ఉంది ఆ దృశ్యం.

మా ఊరి అమ్మాయిలు అమ్మవారి అంశ. అవసరమయితే అన్నపూర్ణలు, ఆపత్కాలాన అపర కాళికలు. కళ్యాణి చేసింది అదే.






# America in the World

ప్రపంచంలో అగ్రదేశం అనగానే వెంటనే గుర్తొచ్చే పేరు అమెరికా. అనేక దశాబ్దాలుగా ఆర్థిక, సాంకేతిక, సైన్య విభాగాల్లో అన్ని దేశాల కంటే ముందుంది యూఎస్ఏ. దీంతో అమెరికా లాంటి దేశం యొక్క విదేశాంగ విధానాల గురించి తెలుసుకోవాలనే ఆసక్తి ఉండటం సహజం. అమెరికా విదేశాంగ విధానాలు, దౌత్య సంబంధాల గురించి America in the World: A History of U.S. Diplomacy and Foreign Policy పుస్తకంలో వివరించారు రచయిత రాబర్ట్ జోలిక్. గత రెండు వందల సంవత్సరాలుగా, యూఎస్ఏ అవతరణ నాటి నుండి నేటి వరకు అమెరికా ఇతర దేశాలతో వ్యవహరించిన విధానం, ముఖ్యంగా విదేశాంగ విధానాలను ప్రభావితం చేసిన అంశాలను రచయిత ఈ పుస్తకంలో వివరించారు.




# Azim Premji

## The Man Beyond the Billions

అజీమ్ ప్రేమ్‌జీ, భారతదేశపు అతిపెద్ద సాఫ్ట్‌వేర్ సంస్థల్లో ఒకటైన విప్రో సంస్థకు అధినేత. వంటనూనెల ఉత్పత్తి సంస్థ నుండి వేల కోట్ల రూపాయల విప్రో సామ్రాజ్యం వరకు అజీజ్ ప్రేమ్ జీ అనేక రంగాల్లో తనదైన ముద్ర వేశారు. అజీజ్ ప్రేమ్ జీ సుదీర్ఘ పారిశ్రామిక ప్రయాణం గురించి "ద మ్యాన్ బియాండ్ ద బిలియన్స్" పుస్తకంలో వివరించారు రచయితలు సందీప్ ఖన్నా, వరుణ్ సూద్. అజీజ్ ప్రేమ్ జీ వ్యక్తిత్వానికి సంబంధించిన అనేక రకాల ఆసక్తికరమైన అంశాలను ఈ పుస్తకంలో పొందుపరిచారు. అజీమ్ ప్రేమ్‌జీ దాతృత్వం, వ్యాపారంలో చిన్న చిన్న తప్పిదాలు, ఇతరులతో ప్రవర్తించే విధానం వంటి అనేక విషయాలను రచయితలు ఇందులో వివరించారు.

# Portraits of Power




భారతదేశ పరిపాలనా వ్యవస్థలో ఐఏఎస్ అధికారులది ప్రత్యేక స్థానం. Portraits of Power పుస్తకం ద్వారా ఒక ఐఏఎస్ అధికారిగా తన స్వీయ చరిత్రను రాశారు. మాజీ బ్యూరోక్రాట్ ఎన్ కే సింగ్. తన వ్యక్తిగత జీవితం, కుటుంబం నుండి ప్రారంభించి, సివిల్ సర్వీస్ అధికారి వరకు అనేక అంశాలను ఎన్ కే సింగ్ ఇందులో వివరించారు. గత 50 సంవత్సరాలుగా దేశ విధాన రూపకల్పనలో తాను పాలుపంచుకున్న అనేక సంఘటనలు ఇందులో సవివరంగా పొందుపరిచారు. అంతేకాదు ఒక సివిల్ సర్వీస్ అధికారిగా తాను ఎదుర్కొన్న ఒత్తిళ్లు, ఐఏఎస్‌లపై రాజకీయాల ప్రభావం వంటి వాటిని సైతం ఈ పుస్తకంలో వివరించారు.

# జీవన తాత్వికతలో నిమగ్నం కాకుండా నేనేది రాయలేదు - డా॥ ఎన్.గోపి

నేటి మహాకవి అంతరంగావిష్కరణం...



డా॥ ఎస్. రఘు
అసిస్టెంట్ ప్రొఫెసర్,
ఉస్మానియా విశ్వవిద్యాలయం

మానవ సంవేదనలకు అక్షరరూపమిస్తే అది డా. ఎన్. గోపి కవిత్వమై మనల్ని కదిలిస్తుంది. ప్రాపంచిక జీవన పరిణామాలన్నీ గోపిగారి కవిత్వంలో నిక్షిప్తమై తాత్విక వ్యాఖ్యానాలై మానవాళికి దిశానిర్దేశం చేస్తాయి. "ముట్టుకుంటే తగలాలి కవిత్వం మనిషిలాగా" అనే ఆశయంతో కవిత్వ ఆల్కేమిని పట్టుకున్న పరుసవేది కవి డా.ఎన్. గోపి. ఐదు దశాబ్దాల తమ రచనాయానంలో ఎన్నెన్నో కవనశిఖరాలను గోపిగారు అధిరోహించారు. విశ్వవిద్యాలయ ఆచార్యుడి నుండి వైస్ ఛాన్సలర్ స్థాయికి చేరుకున్నారు. ఉన్నత విద్యా ప్రమాణాలను నెలకొల్పిన అకడమిషియన్‌గాను, ఉత్తమ పాలనాదక్షుడిగాను విద్యావ్యవస్థ పేరు ప్రతిష్ఠలను పెంపొందించారు. ఏడు దశాబ్దాలు పూర్తి చేసుకున్న జీవనోత్సాహంతో మరింత సృజనోద్వేగాన్ని నింపుకుని కదులుతున్న ఈ తరం మహాకవి డా.ఎన్. గోపిగారితో డా.ఎస్.రఘు జరిపిన సంభాషణ.

**★ గోపిగారు! ఐదు దశాబ్దాల మీ రచనా వ్యాసంగంలో 54 గ్రంథాలు వెలువరించి సాహిత్య లోకంలో ప్రఖ్యాతులయ్యారు. నిరంతర కవితా స్ఫూర్తితో 25 కవితా సంపుటాలను రచించారు. ఇంత విస్తృతంగా రాయడంలో ఏమైనా రహస్యం వుందా? బలమైన ప్రేరణ ఏంటి?**

రహస్యమేముంది. నేను నిరంతర కవిని. పల్లె నుంచి వచ్చిన వాడిని. బాల్యంలో పేదరికాన్ని కిరీటంలా ధరించినవాన్ని. కాబట్టి నేను లోకాన్ని ఎల్లప్పుడు వాస్తవికరమ్యంగా సంవేదనా ప్రపూర్ణంగా దర్శిస్తున్నవాన్ని. నాకేమనిపిస్తుందంటే రఘూ! మనలాంటి వాళ్ళకు ఎంత తోడినా అనుభవాలు అడుగంటవు. వస్తువులకు కరువుండదు. నేనే ఓ చోట అన్నాను "వస్తువు లేనప్పుడు కవిత్వం పస్తులుంటుంది" అని. నీకు తెలుసు నేను ఎక్కువగా ప్రయాణంలో కవితలు రాస్తుంటాను. నిత్య




చైతన్యశీలంగా వుండటం దీనికి కారణమని నేననుకుంటాను. నా తొలిసంపుటి 'తంగెడుపూలు' (1976) నుండి ఇప్పటివరకు ఓ రెండువేల కవితలు రాసుంటా. మరీ ముఖ్యంగా గత ఆరేళ్ళుగా సాహిత్య సందర్భంగా నేను భారతదేశమంతటా పర్యటించాను. ఈ ఆరేళ్ళలోనే ఓ వెయ్యి కవితలు రాశాను. కాబట్టి కవిత్వం నా ప్రవృత్తి, నా ఊపిరి. అయితే విస్తృతంగా రాయడం వల్ల క్వాలిటీకి ఢోకా ఏం లేదు. జీవన తాత్వికతలో మగ్నం కాకుండా నేనేదీ రాయలేదు.

**★ 2000లో కేంద్రసాహిత్య అకాడమీ అవార్డ్ పొందిన 'కాలాన్ని నిద్రపోనివ్వను' కవితా సంపుటి ఇరవై మూడు భారతీయ భాషల్లోకి అనువాదమైంది. అందులో మీరు కాలాన్ని గురించి అనేక తాత్విక కోణాల్లో ఆవిష్కరించారు. ఆ తర్వాత మీ కవిత్వ అభివ్యక్తి కూడా కొత్త రీతుల్లోకి మారింది. ఈ పరిణామానికి కారణాలు చెప్పండి సార్!**

'కాలాన్ని నిద్రపోనివ్వను' నా ఐదో కవితాసంపుటి. అంతకుముందు తంగెడుపూలు, మైలురాయి, చిత్రదీపాలు, వంతెన కవితా సంపుటాలకు మంచి గుర్తింపే వచ్చింది. నువ్వన్నట్లు నా తాత్విక ప్రయాణంలో 'కాలాన్ని

ముఖాముఖి

నిద్రపోనివ్వను' ఓ మలుపు. కాలానికి సంబంధించిన వివిధ పొరలను దానిలో విప్పిచూపాను. ముఖ్యంగా 'కాలం కన్న మనిషే గొప్పవాడు' అనే భావనను ప్రతిపాదించాను. దీనివల్ల మనిషికి ఆత్మ విశ్వాసం ఏర్పడుతుందని బహుశా నా అభిప్రాయం.

★ **'జలగీతం' దీర్ఘకావ్యం మీ మ్యాగ్నం వోపస్ (Magnum opus) రచన. అది పర్షియన్ భాషతో సహా 13 భాషల్లోకి అనువాదమైంది, వివిధ విశ్వవిద్యాలయాల్లో పాఠ్యగ్రంథంగానూ అధ్యయనం చేస్తున్నారు. అది ఇంతగా ప్రసిద్ధి పొందుతుందని మీరు ఊహించారా? ఆ నేపథ్యాన్ని వివరించండి.**

ఇప్పుడు జలం పెద్ద ప్రమాదంలో వుంది. ప్రాణి హక్కుగా వుండవలసిన నీరు వ్యాపార సరుకుగా మారింది. నేను నల్లగొండ జిల్లా నుండి వచ్చినవాన్ని. ఆ జిల్లాలోని ఫ్లోరోసిస్ ప్రభావాన్ని గ్రామాల్లోని దుష్పలితాల్ని ప్రత్యక్షంగా చూసి చలించిపోయినవాన్ని. తెలంగాణ గడ్డ మీదే నాగార్జున సాగర్ వున్నా తెలంగాణకు నీళ్ళందని వైనాన్ని గమనించిన వాన్ని. దశాబ్దాల జల పోరాటాలకు స్పందించి పిడికిలి బిగించినవాన్ని. ఇది నా తొలి దీర్ఘకవిత. దీనిని రాజస్థాన్‌లో చచ్చిపోయిన ఐదు నదులను బతికించి, మూడువేల చెరువులను తవ్వించిన జలపురుషుడు, రామన్ మెగసెసే అవార్డు గ్రహీత రాజేంద్రసింగ్‌కు అంకితమిచ్చాను. రవీంద్రభారతిలో జరిగిన ఆవిష్కరణకు ఆయన రాక ఒక పవిత్ర ఆకర్షణ. జలం అన్నిచోట్లకూ ప్రవహించినట్లే ఈ జలగీతం అందరి హృదయాల్లోకి ప్రవహించింది.



★ **1997లో మీరు అనుకోకుండా రూపకల్పన చేసిన నానీలు ఎంతో విస్తృతంగా పాఠకాదరణను పొందాయి. వందలాది కవులు రాయడం ఇప్పటి వరకు 360కి పైగా నానీల సంపుటాలు వెలువడటం ఆశ్చర్యం కలిగించింది. పుస్తక రూపంలో రాకుండా మరో వెయ్యి మంది నానీలు రాసి ఉంటారు. సాహిత్య చరిత్రలో నానీలకు ఒక ప్రత్యేక స్థానం లభించింది.**




2001లో 'వందేమాతరం నుంచి జనగణమన వరకు' గ్రంథాన్ని ఆవిష్కరించిన సందర్భంలో పి.వీ.తో...

ముఖాముఖి

**విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలు సైతం జరిగాయి. అసలు నానీల ప్రక్రియ ప్రత్యేకతలు ఏమైనా ఉన్నాయా?**

నా నానీల రచన యాదృచ్ఛికంగానే మొదలైనా వాటిలో ఒక అపూర్వమైన భావధార కన్పిస్తుంది. అప్పటి 'వార్త' సంపాదకుడు ఎ.బి.కె. ప్రసాద్ గారు మా ఇంటికి వచ్చినప్పుడు నా టేబుల్ మీద నానీల వ్రాత ప్రతి చూసి తిరగేసి 'ఒరే అబ్బాయ్ మీ ఇంట్లో గొప్ప విప్లవం వుంది. వీటిని నేను తీసుకెళుతున్నా' అని వార్త ఎడిట్ పేజిలో 20 వారాల పాటు ధారావాహికంగా ప్రచురించారు. అంతే అది కొత్త సూర్యోదయంగా నలువైపులా వ్యాపించింది. ఎందరో కవులు వీటిపట్ల ఆకర్షితులై నానీలు రాశారు. తెలుగు జిల్లాల అన్నింటిలోనూ తెలుగేతర ప్రాంతాలైన ఇతర రాష్ట్రాలలోనూ నానీకవులు ఉద్భవించారు. నానీ కవితారూపం ఇంతగా ప్రాచుర్యం పొందడానికి దాని నిర్మాణమే కారణమని ప్రగాఢంగా నమ్ముతున్నాను. నానీల్లోని కవితాశక్తి మరో కారణం. వస్తుపరంగా నానీలు మ్యాక్రోలెవల్లో (Macrolevel) వున్నా తెలుగు కవిత్వాన్ని మైక్రోలెవల్‌కు (Micro level) తీసుకెళ్ళాయి. నా నానీలు కూడా పన్నెండు భాషల్లోకి అనువాదమయ్యాయి. రష్యన్ భాషలోకి కూడా వెళ్ళి అక్కడ ఆదరణ పొందడం విశేషం. లఘుకవితా రూపాల్లో ఇదొక ట్రెండ్ సెట్టర్ అనడానికి నేనే మాత్రం సందేహించను.

★ **తెలుగులో వచ్చిన పది ప్రామాణిక పరిశోధన (Monumentel research) సిద్ధాంత గ్రంథాలలో మీ 'ప్రజాకవి వేమన' ఒకటి. అది ఎనిమిది పునర్ముద్రణలు పొందడం ఒక రికార్డు. ఇటీవల ఆ గ్రంథం కన్నడ భాషలోకి కూడా అనువాదం అయింది. ఇలా ఒక సిద్ధాంత గ్రంథం ఇంతగా ప్రసిద్ధి పొందడం వెనకున్న మీ పరిశోధనా శ్రమను ఈ తరం పరిశోధకులకు వివరిస్తారా?**

నేను గత యాభైఏళ్ళలో కవిత్వం రాయని సందర్భం ఏదన్నా వుంది అంటే వేమన పరిశోధనలో వున్న ఆ నాలుగేళ్ళు మాత్రమే. నేను వేమన పద్యాల సేకరణ కోసం మద్రాస్, తిరుపతి, కాకినాడల్లో ఆరేడు మాసాలు వున్నాను. నాకు 450 రూపాయల నెల జీతం వున్న కాలంలో నేను వేమన పరిశోధన కోసం యాభైవేల రూపాయలు అప్పుచేసి ఖర్చుపెట్టాను. వేమన పద్యాల తాళపత్ర గ్రంథాలను నెలల పాటు ఎత్తిరాసుకోవడం వల్ల (అప్పుడు జిరాక్స్ సౌకర్యం లేదు) నాలోకి ఏదో జీవన విద్యుత్తు ప్రసరించి నట్టయింది. కేవలం ఎం.ఏ., సిలబస్ పాండిత్యం కాస్తా ప్రపంచజ్ఞానంగా విస్తృతమైంది. 'శ్రమములోన పుట్టు సర్వంబు తానౌను' అనే వేమన పంక్తి నా పట్ల సార్థకమైనట్టుంది.




2000 సం॥రంలో కేంద్ర సాహిత్య అవార్డు వచ్చిన సందర్భంలో...

★ **వృద్ధుల జీవితానుభవాలను ఇతివృత్తంగా తీసుకుని 'వృద్ధోపనిషత్' కవితా సంపుటిని అందించారు. ప్రత్యేంగా వృద్ధులమీదే ఒక కావ్యం రాయాలని మీకు ఎందుకు అనిపించింది?**

నీవన్నట్టు నేనప్పుడే వృద్ధున్ని కాలేదు. కనీసం మానసికంగా. ప్రపంచంలోని వృద్ధుల సాహిత్యాన్ని గురించి ఆరేళ్ళుగా అధ్యయనం చేస్తున్నాను. ముఖ్యంగా యువతరానికి వాళ్లకు వృద్ధుల విలువ తెలియాలని నా తపన. వృద్ధుడు కూడా దైన్యానికి లోనుగాకుండా ధైర్యంగా వుండాలని నా కోరిక. ఇది వృద్ధుల జీవితంలోని అనేక పార్శ్వాలను తడిమిన విశాలకావ్యం. అనుకున్నట్టే ఇది అందరికి కనెక్ట్ అయింది. ఇది కూడా అప్పుడే పలు భాషల్లోకి అనువాదం కావడం దాని ప్రాసంగికతను తెలియజేస్తుంది.

★ **ఒక కవిగా, అకడమిషియన్‌గా, సాహిత్య అకాడమీ కన్వీనర్‌గా అమెరికా, ఇంగ్లాండ్, చైనా, జర్మనీ, మారిషస్, సైప్రస్ మొదలైన విదేశాల్లో పర్యటించారు. ప్రతి పర్యటనను ఒక విలువైన యాత్రా చరిత్రలుగా గ్రంథస్థం చేస్తారు. మీ విదేశీ పరిశీలనలో అంతర్జాతీయంగా కవిత్వం ఎలా వస్తుంది. మనమే స్థానంలో వున్నాం?**

యాత్రాచరిత్రలకు హిందీలో వున్నంత ఆదరణ తెలుగులో లేదనిపిస్తుంది. యాత్రాచరిత్ర ట్రావెల్ ఏజన్సీస్ వేసే యాత్రాదర్శిని లాంటిది కాదు. ఇది ఒక ప్రత్యేకమైన వ్యక్తి చేసిన ప్రయాణంలోని సద్య స్పందన. నావి సాహిత్య యాత్రలేగాని సాహసయాత్రలుకావు. నాకు లభించిన విదేశీ పర్యటన అవకాశాన్ని నా జాతి జనులకు అందించాలనే తపన వీటి రచనకు కారణం అనుకుంటా. ముఖ్యంగా ఒక దిగువ మధ్యతరగతి వాడి సంవేదన వీటిలో కనిపిస్తుంది. ఇక కవిత్వమంటారా మానవుల మౌలిక స్పందనలన్నీ ఒకటే. అయితే భావవిధానం (Mode of emotion) వేరుగా ఉంటుంది. సాంస్కృతిక చారిత్రక కుడ్యాలని ఛేదించి చూడగలిగితే మనం వాటిని హాయిగా

ముఖాముఖి

అందుకోగలం. అయితే విదేశాల్లోకంటే భారతదేశంలోనే మంచి కవిత్వం వస్తుందని నా భావన.

**★ కవిత్వమంతా అనేక భారతీయ భాషల్లోకి అనువాదమయ్యింది. నాకు తెలిసినంత వరకు ఏ తెలుగు కవి కూడా ఇన్ని భారతీయ భాషల్లోకి వెళ్ళినట్టులేదు. కొన్ని భాషల్లో అయితే మీరు ప్రత్యేకంగా గుర్తించబడి తెలుగు కవిత్వానికి గౌరవాన్ని తెచ్చిపెట్టారు. ఇదంతా ఎలా సాధ్యమైంది?**

30 సంవత్సరాలుగా నేను భారతదేశంలోని వివిధ రాష్ట్రాలలో అనేక కవి సమ్మేళనాల్లో పాల్గొన్నాను అక్కడ విన్నవారు నా కవితలు నచ్చి అనువాదానికి పూనుకున్నారు. వారిలో ఆయా భాషల ప్రసిద్ధ కవులే ఎక్కువ. సాహిత్య అకాడమి 23 భాషల్లో నా అనువాదాలు ప్రచురించింది అంటే అది మ్యాండేటరీ కాదు. అనువాదకుల చొరవవల్లే అది జరిగింది. అనువాదకులందరితో ఎప్పుడో అప్పుడు, ఎక్కడో అక్కడ వారితో నేను దాదాపు వెయ్యిగంటలు గడిపి వుంటాను. దాని ద్వారా భారతదేశంలోని ఏకత్వాన్ని దర్శించగలిగాను. ప్రస్తుతం "నేను - నా అనువాదకులు" అనే గ్రంథాన్ని రాయడానికి సంకల్పించాను. వాటిలో అనేక విషయాలను చర్చిస్తాను.

**★ 'ప్రపంచీకరోనా' అని కోవిడ్ విలయంపై కవితా సంపుటిని వేసారు కదా? ప్రత్యేకంగా ఇటీవలి ప్రపంచ పరిస్థితులపై ఒక బుద్ధిజీవిగా ఎలా స్పందిస్తారు. ఈ ప్రపంచానికి ఏం చెప్పదలచుకున్నారు.**

మనం ఈ కరోనాకాలం నుంచి చాలా నేర్చుకున్నామనిపిస్తుంది. ముఖ్యంగా భయం జాగ్రత్తగా మారింది. జాగ్రత్త సమస్త మానవాళిని దర్శించడానికి తోడ్పడింది. కోట్లాది వలస కార్మికుల కడగండ్లను చూసి అన్ని వ్యవస్థలకు గర్వభంగమైంది. 2018 అక్టోబర్‌లో నేను చైనాలోనే వున్నాను. ఇండియాకు తిరిగొచ్చిన కొన్ని నెలలకే కోవిడ్ వైరస్ ఇక్కడా ప్రత్యక్షమయింది. ఈ అతివేగ విస్తరణకు ప్రపంచంలోని పలు దేశాల మధ్య వ్యాపార సంబంధాలే కారణం. ఒకప్పటి ఆర్థిక సరళీకరణ అనుకున్నది మానవజాతి వినాశీకరణగా పరిణమించింది. నా 'ప్రపంచీకరోనా' కావ్య సంపుటిలో లాక్‌డౌన్ కాలంలోని మానసిక స్థితులన్నీ ప్రతిబింబితమైనాయి. ఇట్లాంటి మానవజాతికి 'ఆర్కైవ్' లో వుండి మార్గదర్శనం చేసే కవిత్వంగా నేను భావిస్తాను.

**★ వర్తమాన వచన కవిత ఏవిధంగా పయనిస్తుంది. ఈ తరం కవులకు మీరిచ్చే సందేశం ఏమిటి?**

ప్రతిభకు మనదగ్గర ఏమీ లోటులేదు. కాని దానికి అనుభవం, శిల్పం తోడవ్వాలి. ఈనాటి యువతకు అధ్యయనం బాగా వుండాలని నా అభిలాష. సామాజిక మాధ్యమాలు వేగానికి, విస్తృతికి తోడ్పడుతాయి గాని వాటివల్ల క్వాలిటీ పెరుగుతుందన్న గ్యారంటీ ఏమీ లేదు. కీర్తికి ఆత్రం పనికి రాదు. "నీడలాగా నీవెంట పడేదే నిక్కమైన కీర్తి" అన్నాడు మహాకవి సినారె.

కవిత

# విషాద గీతం...

డా॥ సి.హెచ్. ఆంజనేయులు



ఆకాశం అంచుల దాకా పతంగులతో విన్యాసాలు స్థానం
అక్కడ అక్కడ పొగ మబ్బులు కమ్మేస్తున్నాయి

కాలం కరిగిపోతుంది దూరం పెరిగిపోతోంది
భారం ఎక్కువ ఉంది

భారంగా జీవితకాలాన్ని నడిపించాలి
ఆశల లోగిళ్ళు పైనుండి అనంతంగా సాగిపోయే
జనజీవన విస్తృతమైన ప్రాణం కష్టాలు లేని కరుణ లేని కాలంలో
కరోనా ఇబ్బందులకు గురి చేసింది మరణాలను తెచ్చిపెట్టింది
ఏ పండుగలు పబ్బాలు ఎన్ని వచ్చినా ఖర్చుల దండకం బాబు బాగా పెరిగింది

ఎన్ని దినుసులు కొన్న ఇంకా కొనాల్సిన ఎన్నో ఉన్నాయి
అందుకే కాలాన్ని ప్రశ్నించిన ఖరీదైన జీవితాన్ని భరించలేకుండా ఉన్నాము

మనిషికి ఉద్యోగాల్లేక లాక్‌డౌన్ కాలంలో ఆర్థికంగా చిక్కిపోయాడు
లాక్ డౌన్ ఎంత విధించింది కష్టాలను కన్నీళ్లను మరణాలను విషాదాల అంతే లేదు

# రెప్పవాల్చని కవి సిధారెడ్డి

ఉపద్రవ కావ్యంలో సమాంతర విషాద స్థితిని ఆవిష్కరించిన వైనం....



గుడిపల్లి నిరంజన్

సాహిత్యానికి కచ్చితమైన విలువ వుండాలి. ఆ విలువ కచ్చితంగా ప్రజల బాధ వ్యక్తీకరించాలి. ప్రజలు పడుతున్న బాధను ఎత్తి పట్టి గాయానికి మందు పూయాలి. ఒక సమస్యను తార్కికంగా ఆలోచించి పరిష్కారంతో పాటు, మనోధైర్యాన్ని కూడా పాఠకుడికి, సమాజానికి కవి ఇవ్వాలి. అప్పుడే సాహిత్య లక్ష్యం పరిపుష్టి అవుతుంది. ఈ పని కచ్చితంగా నదిని సిధారెడ్డి రాసిన "అనిమేష" కావ్యం చేసింది. అనిమేష అంటే రెప్పవాల్చనీయని పరిస్థితి అని అర్థం. ప్రపంచం అంతా కంటికి కునుకు లేకుండా అనుభవించిన చిత్రమైన భయానక స్థితి కరోనా వల్ల కలిగింది. మొత్తం మానవ జీవన విధానమే తల్లడిల్లి తలకిందులుగా ఆసనాలు వేసింది.మహా సామ్రాజ్యాల ఆర్థిక వ్యవస్థలను కరోనా పీక నొక్కిపోయింది. వ్యవస్థలన్నీ తలకిందులై గబ్బిలం వేలాడినట్లు వేలాడాయి. రెప్ప మూసి ప్రశాంతంగా నిద్రించిన మనిషేలేడు. కనుకనే పుస్తకానికి "అనిమేష" పేరు పెట్టి ఉంటారు కవి.

సిధారెడ్డి స్పందనారహితంగా ఉండలేని మనిషి. ఖాళీ మెదడును కోరుకోని మనిషి. ప్రభావ రహితంగా కూడా ఉండలేని మనిషి. వ్యక్తిగత దినచర్యలతో కాలం గడిపే మనిషి అసలే కాదు. సగటు జీవుల స్పందనతో ఒక మేనిఫెస్టోను నిర్మించుకున్న మనిషి అని ఆయన సాహిత్య జీవితాన్ని పరిశీలిస్తే అర్థం అవుతుంది.

సిధారెడ్డి ప్రజా సమస్యల పట్ల స్పష్టమైన అవగాహన ఉన్న వ్యక్తి. 40 సంవత్సరాల పాటు ఏదో ఒక ఉద్యమంతో జీవితాన్ని అల్లుకున్న వ్యక్తి. ఒక 20 సంవత్సరాల పాటు ప్రగతిశీల ఉద్యమాల్లో ఉన్నాడు. ఇంకో ఇరవై సంవత్సరాలు తెలంగాణ ఉద్యమంతో కలిసి నడిచాడు. అన్ని సందర్భాల్లో అగ్గి గొంతుతో మాట్లాడిన వ్యక్తి.

తనే చెప్పుకున్నట్లు సిధారెడ్డికి ఊరు అంటే ఇష్టం. కలలంటే ఇష్టం. కవులంటే ఇష్టం. ప్రకృతి అంటే ఇష్టం. పక్షులు అంటే ఇష్టం. అక్షరాలు ఇష్టం. హక్కులకై పోరు చేసే సంఘాలు అంటే ఇష్టం. తన జీవితమంతా అక్షర ప్రయాణమై సాగిపోయాడు. ఎక్కడ ఆగిపోలేదు. అందుకు సాక్ష్యాలు తాను రాసిన పుస్తకాలే. **'భూమి స్వప్నం'**, **'సంభాషణ'**, **'ప్రాణహిత'**, **'ఒక బాధ గాదు'**, **'నది పుట్టువడి'**, **'ఇక్కడి చెట్ల గాలి'**, **'నీటి మనసు'** లాంటి కవితా సంపుటాలు నిదర్శనం. **'నాగేటి చాల్లల్ల'** పాటలుగా ప్రవహించాడు. **'చిత్రకన్ను'** కథలై అలుగెల్లినాడు.

నూరు పూలు, ఆవర్తనం, కులవృత్తులు తెలంగాణ సాహిత్యం లాంటి వ్యాస సంకలనాలు ఇప్పటికే ప్రచురించి ఉన్నారు. ఇదంతా ఎప్పుడు సాధ్యం అంటే అక్షర తపస్వి అయితేనే సాధ్యం. మనుషుల మధ్య ఉండవలసిన నైతిక పునాదిని, ప్రకృతి అవగాహనను, పరిశీలనాత్మక దృష్టిని ఒక జీవన మార్గంగా ఉండవలసిన ఆవశ్యకతని అనిమేష కావ్యం నొక్కి చెపుతున్నది.

పది నెలలు గడిచినా ప్రపంచం
తేరుకోని కన్నీటి దుస్థితిని
ఇగో ఇలా పలవరిస్తున్నారు..

"జీవితం జీవకళ కోల్పోయింది.
ప్రయోగశాల వెలవెలబోయింది/
విజ్ఞానశాస్త్రాలకు చెమట పడుతుంది/
అధికారం తలపట్టుకుంది"... అంటూ

"జరుగుతున్నదేదో/జరగవల్సిందేదో/
అంతుపట్టక జగమే చిన్నబోయింది"..
అంటూ సతమత స్థితిని బాధగా వలపోస్తున్నారు.

భారత రాజ్యాంగ ఆత్మగా ప్రవేశికను బాబా సాహెబ్ అంబేద్కర్ ఎలా రూపొందించారో, అలాగే అనిమేష కావ్య ఆత్మను కూడా సిధారెడ్డి గారే ముందు పేజీలో తక్కువ పదాలతో ఎక్కువ అర్థాన్ని, భావాన్ని ఇచ్చే విధంగా

పుస్తక పరిచయం

రాసినారు.

కరోనా కాలంలో ప్రభుత్వాలు ప్రజలకు శాస్త్రీయంగా అండగా నిలబడడం మరిచిపోయి, చప్పట్లు కొట్టుండ్రి, పళ్ళాలు కొట్టుండ్రి అనే పిలుపుకు ఇలా స్పందించారు..

"చప్పట్లు కొడితే, పక్షులు లేవయి, గంటలు మోగిస్తే, ధైర్యం పలుకది.." అంటూ ప్రభుత్వ విధానాలను ఎత్తిచూపినారు.

మనుషుల పట్ల ప్రేమ, సమాజం పట్ల బాధ్యత ఉన్న వ్యక్తి కనుకనే, సిధారెడ్డి కోవిడ్ కాలంలో ఎంతో మదన పడ్డాడు, వేదన పడ్డాడు, దుఃఖితుడయ్యాడు. బాధాకరమైన స్థితిగతులను కూడా బాధాతప్త హృదయంతో ఒక కళా కృతిగా మలిచి 'అనిమేష' దీర్ఘ కావ్యాన్ని అందించాడు.

"కడ చూపు కాకపోయినా, కడకు నిప్పు పెట్టడానికి వీలు కాకపోయినా, కొడుకొచ్చాడు కడుపంత దుఃఖంతో, అక్కలుంటారు తమ్ములుంటారు, భారంగా బంధువులుంటారు, ఎవరి మీద పడి ఏడవటానికి ఉండదు" అంటూ కనీస బాధను కూడా వ్యక్తం చేయలేని పరిస్థితిని కళ్ళ ముందు చూపి అందరిని ఏడిపిస్తారు.

ఎవరూ ఎవరిని నమ్మడం లేదు. తన చేతులను తానే నమ్మడం లేదు. తన రక్త సంబంధీకులను తానే నమ్మడం లేదు. "అనురాగాలకు అనుమానమే" అంటుకుంది అంటూ "అనుమానం వెంటాడే చోట అరణ్యమే మేలు" అంటున్నారు.

"ఊరికి రాత్రి కాపలా/రాత్రికి రాతి గోడ కాపలా.."

"రోమ్ నగరం కన్నుల/మాడిపోయిన వెన్నెల" లాంటి వ్యక్తీకరణలతో సిధారెడ్డిలోని కవి ఆకాశమంత ఎత్తుగా కనిపిస్తున్నాడు.

'అనిమేష' కావ్య నిర్మాణం చూస్తేనే సిధారెడ్డి టెక్నిక్ కనిపిస్తుంది. కోవిడ్-19 కరోనా కావ్య వస్తువు కాబట్టి ఈ పుస్తకంలో బాధలను 19 గాథలుగా విభజించి, ఒక్కో బాధకు ఒక్కో గాథగా కేటాయించారు. అన్ని గాథలలో బాధలనే వ్యక్తపరిచారు.

అనుకోకుండా వచ్చే ఉపద్రవాలను కావ్య వస్తువుగా ఎంచుకొన్న కావ్యాలు తెలుగు సాహిత్యంలో చాలా తక్కువ కావ్యాలే వచ్చి ఉంటాయి. ప్రతీ ఉపద్రవాన్ని కావ్యంగా మలిచే అవకాశం ఉండకపోవచ్చు. కానీ ప్రపంచం అంతా కూడా ఒక ఉపద్రవంగా భావించింది మాత్రం కరోనానే అని చెప్పవచ్చు. దేశానికి పరీక్ష కాలం దాపురించింది. ఈ పరీక్ష కాలంలో కవి చైతన్యం, కవి చూపు చాలా ముఖ్యమైనవి.

కోవిడ్ తర్వాత వచ్చిన ప్యానిక్ సిచువేషన్ని, ఒక నిస్సహాయ స్థితిని, ప్రజలు పడ్డ అన్ని రకాల బాధని, అన్ని రంగాల పతనాల్ని, ప్రభావాల్ని, సిధా రెడ్డి లోతైన చూపుతో అక్షరబద్ధం చేయడం "అనిమేష" కావ్యంలో కనపడుతుంది.

ఉపద్రవాలు వచ్చినపుడు ప్రజలు కలిగి ఉండాల్సిన తాత్విక అవగాహనను

**అనేక గాథల్లో చర్చించిన అనేక అంశాలు విశ్వజనీనమైనవి. జీవితానికి ఏ స్థాయిలోనైనా అనువదించుకోగల గొప్ప విషయాలు ఈ పుస్తకంలో ఉన్నాయి. కొత్తగా చదివిన పాఠకుడికి కూడా ఈ పుస్తకం ఉద్దీపన కలిగించేదిగా ఉంది. ఆలోచనల పుష్టిని, పరిపుష్టిని అందిస్తుంది. కొత్త, పాత పాఠకులను కూడా సంతృప్తిపరిచే కావ్యం ఇది. అనుభవం కలిగిన కవి కాబట్టి ప్రతి వాక్యంలో కవిత్వమై మెరుస్తాడు. కవిత్వం అల్లుతున్న సందర్భంలో కంటెంట్ ఎక్కడ పక్కదారి పట్టకుండా చూసుకోవడం వల్ల ఈ కవి నైపుణ్యం తెలుస్తోంది. మానవజాతి ఆనందకరమైన, ఆరోగ్య ప్రదమైన, విజయవంతమైన జీవితం గడపాలని కవి ఆకాంక్షిస్తున్నాడు.**



'అనిమేష' చక్కగా వివరించింది.

పుస్తకం చదివిన వారంతా సిధా రెడ్డి భావాలతో, బోధనలతో పూర్తిగా ఏకీభావం పొందుతారు. ప్రమాదాల పట్ల ఉపద్రవాల పట్ల తప్పకుండా జాగరూకతతో కూడిన అవగాహన పొంది తీరుతారు. ఒక భావాన్ని, భావ ప్రసారాన్ని మనకు తెలియ కుండానే మన పైకి ఒక కళాత్మకంగా సుతిమెత్తంగా సిధా రెడ్డి వదులుతారు.

ఒక్కో గాథ ఒక్కో లోతైన బాధ తెలుపుతుంది. అంతిమంగా మన మనసును ఆశావాదంలోకి మళ్లిస్తాడు కవి. ఎంత శక్తివంతమైన వైరస్ వచ్చినా, వైరస్‌కు లొంగని శక్తివంతమైన నమ్మకాన్ని మనిషికి ఈ కావ్యం పట్టిస్తుంది. అసలు ఈ కావ్యం నడిపించిన పద్ధతి కూడా మనల్ని ముగ్ధుల్ని చేస్తుంది. ఆత్మశోధన ఎంతో బలంగా చేస్తే కానీ, ఇంత కమ్మని కావ్యం రూపుదాల్చదు.

సిధారెడ్డి చాలా క్లారిటీ ఉన్నకవి. అపారమైన బుద్ధి సూక్ష్మత, ఎరుక కలిగిన కవికూడా అని ఇవిగో ఈ క్రింది కవితా పంక్తులు తెలుపున్నాయి.

"మతం ఒక వైరస్/ఎప్పుడో మెదడును కమ్మేసింది/రాజకీయం మరో వైరస్/రక్తనాళాల్లో చేరిపోయింది/ వ్యాపారం వావిలేని జీవి/మనసును మత్సరించింది...." అంటూ పై మూడు రంగాల వల్ల మనిషి మాయమై పోయిన స్థితిని ఇలా చెపుతున్నారు..

"ఇవ్వాళ మనిషి ఎక్కడ దొరుకుతాడు''... అని వెతుకుతారు.

"వ్యాధులతో వ్యాపారం చేయకుండ" ప్రపంచంలోని పరిశోధనలన్నీ ఇంకా ఇంకా శక్తివంతం కావాలని అన్ని స్థాయిలలో మెడికల్ సైన్స్ ప్రగతి సాధించాలని ప్రపంచమంతా కలిసి కట్టుగా

సహకారం అందించుకోవాలంటూ

"పరస్పర సహకారం విజ్ఞత

ప్రపంచ సంరక్షణ

ప్రపంచ దేశాల బాధ్యత'' అంటూ వసుధైక ప్రపంచం ఉండాలని కవి ఆశపడుతున్నారు.

అనేక గాథల్లో చర్చించిన అనేక అంశాలు విశ్వజనీనమైనవి .జీవితానికి ఏ స్థాయిలోనైనా అనువదించుకోగల గొప్ప విషయాలు ఈ పుస్తకంలో ఉన్నాయి.

కొత్తగా చదివిన పాఠకుడికి కూడా ఈ పుస్తకం ఉద్దీపన కలిగించేదిగా ఉంది. ఆలోచనల పుష్టిని, పరిపుష్టిని అందిస్తుంది. కొత్త, పాత పాఠకులను కూడా సంతృప్తిపరిచే కావ్యం ఇది.

అనుభవం కలిగిన కవి కాబట్టి ప్రతి వాక్యంలో కవిత్వమై మెరుస్తాడు. కవిత్వం అల్లుతున్న సందర్భంలో కంటెంట్ ఎక్కడా పక్కదారి పట్టకుండా చూసుకోవడం వల్ల ఈ కవి నైపుణ్యం తెలుస్తోంది. మానవజాతి ఆనందకరమైన, ఆరోగ్య ప్రదమైన, విజయవంతమైన జీవితం గడపాలని కవి ఆకాంక్షిస్తున్నాడు.

అంతిమంగా సాంకేతికతను నమ్ముతున్నాడు. దేవుడిని ఈ కవి నమ్మడం లేదు. డాక్టర్ల, శాస్త్రవేత్తల కృషిని మనసు నిండా అభినందించారు. ప్రకృతికి మనిషికి మధ్య ఉండాల్సిన సంబంధాన్ని ఇలా చెపుతున్నారు..

"మనిషి విజృంభించేది ప్రకృతి మీద/ ప్రకృతి విజృంభించేది మనిషి మీదే అంటూనే మనిషే ప్రకృతికి భరోసాను ఇవ్వాలని చెపుతూ..

"సమస్త ప్రాణి/సహజీవనానికి/పూచి పడాల్సింది మనిషేఅంటున్నారు.

అతి వాగుడు సాహిత్య కాలుష్యం నుండి మనల్ని విముక్తి చేస్తారు సిధారెడ్డి. ఎక్కడ అస్పష్టత లేదు. ఎక్కడా వ్యర్థ పదాలు లేవు. ఎక్కడా వ్యర్థ వాక్యాలు లేవు.ప్రతి గాథలో ముగింపు చాలా అబ్బురపరిచే విధంగా, ఆలోచించే విధంగా ఉండడం నాకు చాలా నచ్చింది. క్రమానుసారంగా గాథలను వివరించుకుంటూ, మెళుకువలను నూరిపోస్తూ పోతారు.

> **"కడ చూపు కాకపోయినా, కడకు నిప్పు పెట్టడానికి వీలు కాకపోయినా, కొడుకొచ్చాడు కడుపంత దుఃఖంతో, అక్కలుంటారు తమ్ములుంటారు, భారంగా బంధువులుంటారు, ఎవరి మీద పడి ఏడవటానికి ఉండదు" అంటూ కనీస బాధను కూడా వ్యక్తం చేయలేని పరిస్థితిని కళ్ళ ముందు చూపి అందరిని ఏడిపిస్తారు.**

ఈ పుస్తకం చదివిన తరువాత సిద్ధారెడ్డి ఆశావాది కాదు, నిరాశావాది కాదు. ఒక సంభావ్యత దృక్పథం, సకారాత్మక అభిప్రాయం కలవారు అని తెలుస్తుంది. మనిషిని "విన్నర్ సర్కిల్లో'' జీవించేలా ఇష్టపడతాడు ఈ కవి.

ఈ పుస్తకం చదివితే మనిషి మనుగడకు కావలసిన మూలాధార జ్ఞానం అలవడుతుంది. తన జీవితాన్ని తానే నిర్దేశించుకొని, ప్రకృతి ఆదేశానుసారం ఎలా జీవించాలో ఈ కావ్యం తెలియపరుస్తుంది. ఈ కావ్యం బాధను చిక్కటి కవిత్వంగా చేసిందని చెప్పొచ్చు. అట్లని పరిష్కారాలు చూపలేదా అంటే అవి మన జీవన విధానంలోనే ఉన్నాయి అని చెప్పకనే చెప్పారు.

ప్రజల బాధ, ప్రపంచం బాధ తనకొచ్చిన బాధగా భావిస్తే తప్ప, హృదయం ద్రవించే ఇలాంటి కవిత్వం తన్నుకు రాదు.

విత్తనం ఎంత సహజంగా మొలకెత్తుతుందో, ఆకులు ఎంత సహజంగా చిగురిస్తాయో, పువ్వులు ఎంత సహజంగా విచ్చుకుంటాయో అంతే సహజంగా సిద్ధారెడ్డి కవిత్వం వికసించింది.

అంతర దృష్టితో కవిత్వం రాసిండు. లోతులను లోచూపుతో తడిమిండు.

అక్కడక్కడ మనుషులకు సన్న సన్నని చురకలు కూడా అంటించారు.

చివరగా "అనిమేష'' కావ్యం మన జీవితాలను మార్చే అద్భుతమైన కావ్యం అని చెప్పే సాహసం చేయలేను. కానీ ఒక మనోధైర్యాన్ని, కొంత గుండె నిబ్బరాన్ని తప్పకుండా ఈ కావ్యం అందిస్తుందని మాత్రం కచ్చితంగా చెప్పగలను.ఇంత మంచి కావ్యం అందించిన నందిని సిధారెడ్డికి అభినందనలు. శుభాకాంక్షలు.

దృశ్య సాహిత్యం






చిత్రం : భాగ్ మిల్కా భాగ్
భాష : హిందీ
దర్శకుడు : రాకేష్ ఓంప్రకాష్ మెహ్రా

# భాగ్ మిల్కా భాగ్

'ఫ్లయింగ్ సిక్కు'గా ప్రపంచానికి సుపరిచితుడైన ఓ స్టార్ అథ్లెట్ మిల్కాసింగ్ జీవిత కథను ఆధారంగా చేసుకుని నటుడు ఫర్హాన్ అక్తర్, డైరెక్టర్ రాకేశ్ ఓంప్రకాశ్ మెహ్రా కలయికలో 'భాగ్ మిల్కా భాగ్' చిత్రం రూపొందింది. దేశ విభజన సమయంలో పాకిస్తాన్‌లో కుటుంబాన్ని కోల్పోయిన మిల్కాసింగ్ అనే బాలుడు ప్రాణాలను రక్షించుకోవడానికి ఢిల్లీకి చేరుకుంటాడు. పేదరికంతో దుర్భర పరిస్థితుల్లో జీవనం సాగించిన మిల్కా సింగ్ సైన్యంలో అవకాశం రావడంతో జవానుగా మారుతాడు. అనంతరం అతని జీవితంలో చోటుచేసుకున్న ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటూ ఓ సూపర్ స్టార్ అథ్లెట్‌గా మారుతాడు. దేశం గర్వించదగ్గ అథ్లెట్‌గా ఎదుగుతాడు మిల్కాసింగ్. అనేక ఒడిదుడుకుల మధ్య మిల్కాసింగ్ తాను అనుకున్న లక్ష్యాన్ని ఎలా చేరుకున్నాడు అనే విషయాలను దర్శకుడు రాకేష్ మెహ్రా ఆసక్తికరంగా తెరకెక్కించాడు.

ఓ అథ్లెట్ జీవితంలో చోటు చేసుకున్న ఒడిదుడుకులకు తోడుగా డ్రామా, ఎమోషన్, హ్యూమర్, విషాదం అనే అంశాలతోపాటు సృజనాత్మకతను జోడించి ఈ చిత్రాన్ని రూపొందించారు. ఈ చిత్రంలో మిల్కాసింగ్ పాత్ర పోషించిన నటుడు ఫర్హాన్ అక్తర్, నటించాడు అనేదానికన్నా జీవించాడు అంటేనే బాగుంటుంది అనే స్థాయిలో ప్రదర్శన చేశాడు. విపత్కర పరిస్థితుల నుండి విజేతగా మారిన అథ్లెట్ మిల్కాసింగ్ జీవితాన్ని దర్శకుడు రాకేష్ ఓం ప్రకాష్ మెహ్రా తెరకెక్కించిన విధానం, పూర్తి సందేశాత్మకంగా ఉంటుంది.

కవిత

# మెతుకు గాథ



కె.హరనాథ్

బలిసిన వాడి పళ్ళెంలో
మెతుకు గురించి కాదు నా బాధ
అలసిన వాడి ఆర్తనాదం గురించీ
వాడి స్వేద బిందువు గురించీ
నా వ్యధంతా...
ఏమైతే ఏముందిలే
సంపదలుండటం
లేకపోవటం గురించి కాదు
వాడూ నేనూ
ఒకేలా జన్మించాం
పుట్టి వాడు వెన్నెల్లో విహరించి
చంద్రుడిని కౌగలించుకొన్నాడు
నేనేమో సూర్యుణ్ణి వెంటేసుకు
తిరుగుతున్నాను
చంద్రుడు వాడికి చల్లదనం ఇచ్చాడు
నన్నేమో సూరీడు
మండించి మండించి
దహిస్తున్నాడు
నాదో చిన్న ప్రశ్న
వాడెందుకలా?
నేనెందుకిలా?

# ప్రపంచీకరణ నేపథ్యంలో ఆకుపచ్చని విధ్వంసం

**మనం అభివృద్ధి అనుకున్న అంశాల్లో చీకటి కోణాలను వెతికి పట్టుకున్న రచయిత అంతర్మథనం చెప్పిన వైనం...**



కె.పి.అశోక్ కుమార్

మన దేశ గ్రామీణ జనాభాలో ఇప్పటికీ నూటికి 70 మంది భూమి మీద ఆధారపడి బతుకుతున్నారు. 1991 తర్వాత ప్రభుత్వాలు అభివృద్ధి పేరుతో సరళీకృత నూతన ఆర్థిక విధానాలు అమలు చేయడం ప్రారంభించాయి. దేశీయ ప్రైవేటు పెట్టుబడిదారులకు, బహుళజాతి సంస్థలకు ప్రభుత్వం ప్రజల భూములను బలవంతంగా తీసుకొని అప్పగించడం మొదలుపెట్టింది. సింగూరు, నందిగ్రామ్, కళింగ నగర్‌లలో ప్రభుత్వం భూములను బలవంతంగా లాక్కుంటుంటే ప్రజలు తమ ప్రాణాలకు తెగించి భూముల్ని కాపాడుకున్నారు.

సోంపేటలో తమ పంటభూముల్ని బొగ్గు ఆధారిత థర్మల్ విద్యుత్ కేంద్రానికి ఇవ్వనందుకు వారిపై కాల్పులు జరిపి అణచివేయాలని చూసింది ప్రభుత్వం. ప్రజల నుండి పెద్ద ఎత్తున తిరుగుబాటు రావడంతో తాత్కాలికంగా ఆ ప్రాజెక్టును నిలిపివేశారు. సోంపేట ప్రజా పోరాటానికి ఆకర్షితులైన సుప్రసిద్ధ కథా రచయిత శీలంశెట్టి కాంతారావు క్షేత్ర పర్యటన చేసి నిజానిజాలను గ్రహించి ఇది అభివృద్ధి కాదు విధ్వంసం అని నిర్ధారించి ఈ నవలను రాయడం జరిగింది.

ఒకటి కాదు రెండు కాదు ఏకంగా ఏడు థర్మల్ విద్యుత్తు, ఒక అణు విద్యుత్తు ప్రాజెక్టును కళింగాంధ్ర ప్రాంతమైన శ్రీకాకుళం విజయనగరం జిల్లాల్లో నెలకొల్పడానికి జోరుగా సన్నాహాలు జరిగాయి. దేశంలోనే అత్యంత వెనుకబడిన కళింగాంధ్రలో అన్ని రాజకీయ పక్షాల నేతలు విధ్వంసకరమైన ప్రాజెక్టులకు స్వాగతం పలుకడం అత్యంత విషాదం. ఈ పవర్ పంజా వెనుక బడా నేతల స్వార్థం రెక్కలు సాచి రెపరెపలాడుతూ ఉంటే లక్షలాది మంది జనం బలిపశువులుగా మారుతున్నారు. తరతరాలుగా నమ్ముకున్న భూమిని అధిక మొత్తాలు ఎరజూపిన పెట్టుబడిదారులకు త్యాగం చేసి నిర్వాసితులుగా మారనున్నారు. సముద్రంలో చేపల వేటే జీవనాధారంగా గల మత్స్యకారులు వలసలకు సిద్ధమవుతున్నారు.

తీరప్రాంతాలు కొండలు లేక మైదానం లాగా ఉండటం, జల వనరులకు కొరత లేకపోవడంవల్ల పరిశ్రమల ఏర్పాటుకు ఈ నేల అనుకూలంగా ఉంటుంది. పారిశ్రామిక నగరమైన విశాఖ పట్నంకు దగ్గరగా ఉండటం, ఉత్తర దక్షిణ భారతదేశాలను కలిపే 5వ నెంబర్ జాతీయ రహదారి చెన్నై- హౌరా రైలు మార్గం అందుబాటులో ఉండటం వల్ల ఇప్పటికే ఎన్నో పరిశ్రమలు వెలిశాయి.

ఈ జాతీయ రహదారి పొడవునా 13 బల్క్ డ్రగ్ రసాయనిక కర్మాగారాలను ఏర్పాటు చేశారు. అలా సోంపేట ఘటన పూర్వాపరాలను పరిశీలిస్తే వాస్తవాలు తెలుస్తాయి. బొగ్గు ఆధారిత థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని నిర్మించదలచుకున్నది సోంపేట మండలంలోని బీలలో. బీల సంవత్సరం పొడుగునా నీరు ఉండే జలవనరు. ఇది సోంపేట చుట్టూ ఉన్న ప్రజలకు, పశువులకు, పక్షులకు నీటిని అందించి జీవనాధారంగా నిలుస్తుంది. బీల నీటితో సంవత్సరానికి రెండు పంటలు పండిస్తారు. ఈ బీల మీద 1989లో రుస్కుడ్డా, బెంకిలి, కుత్తూమ ప్రాంతాల్లో 3 ఎత్తిపోతల పథకాల ద్వారా 750ఎకరాలకు నీరు అందుతుంది. అక్కడి ప్రజలకు సాగునీరు, తాగునీరు కొరత తీరుస్తుంది. మాణిక్య పురంలోని 500 మత్స్యకారుల కుటుంబాలు వీళ్ళలో చేపలు పట్టి బతుకుతున్నాయి. ఇక్కడే పంటభూములు, జీవరాశులు, మామిడి తోటలు, కొబ్బరి తోటలు ఉన్నాయి. ఇక్కడికి దగ్గరిలోని తేలి నీలాపురం ప్రాంతానికి సైబీరియా నుండి వచ్చే 123 రకాల వలస పక్షులు వచ్చి ఇక్కడే దొరికే చేపలను ఆహారంగా తిని ఆరు నెలలు ఉండి మళ్ళీ వెళ్ళిపోతుంటాయి. బహుళ జీవ వైవిధ్యంతో కూడుకున్న ప్రాంతం

వ్యాసం

ఇది.

సస్యశ్యామలంగా, జీవవైవిధ్యంతో ఉన్న బీల సముద్రానికి దగ్గర ఉండటంతో పారిశ్రామికాధిపతులు, బహుళజాతి సంస్థల కన్నుపడుతోంది. కోస్తా కారిడార్ అంతట విచ్చలవిడిగా అనుమతించిన పవర్ ప్లాంట్లతో అది త్వరలోనే చెత్తకుండిగా మారే ప్రమాదం ఉంది. పవర్ ప్లాంట్లను చల్లార్చడానికి నీరు కావాలి. అందుకే వాటిని సముద్రతీరంలో ఏర్పాటు చేయడం, సముద్రానికి దగ్గర్లో ఉన్న భూమి ప్లాంట్ నిర్మాణానికి అనుకూలంగా ఉంటుంది. దాంతో బీలలో పవర్ ప్లాంట్ కట్టడానికి పావులు కదులుతాయి. ముందుగా సారవంతమైన నేల బంజరు భూమిగా రికార్డుల్లో చూపించబడుతుంది. జీవభద్ర, బీల భూమి రెండు వేల ఎకరాల్లో 960 ఎకరాలు గవర్నమెంట్ భూమి కాగా, మిగతాది ప్రజలది. ప్రజల నుండి భూమిని సేకరించడానికి దళారులు రంగంలోకి దిగుతారు. అలా వచ్చిన వాడే తాతారావు. గొంగళిపురుగు పెసర మొక్కలోని జీవ సారమంతా పీల్చి పారేసినట్లు, ఆ సంవత్సరంగా ఊళ్ళో ఒక్కొక్కళ్ళను ఒక్కో రకంగా బుట్టలో వేసుకొని మెల్లమెల్లగా వాళ్ళ నేల భూములను తాతారావు ఆక్రమిస్తాడు.

**బొగ్గు ఆధారిత థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని నిర్మించదలచుకున్నది సోంపేట మండలంలోని బీలలో. బీల సంవత్సరం పొడుగునా నీరు ఉండే జలవనరు. ఇది సోంపేట చుట్టూ ఉన్న ప్రజలకు, పశువులకు, పక్షులకు నీటిని అందించి జీవనాధారంగా నిలుస్తుంది. బీల నీటితో సంవత్సరానికి రెండు పంటలు పండిస్తారు. ఈ బీల మీద 1989లో రుస్కుడ్డా, బెంకిలి, కుత్తూమ ప్రాంతాల్లో 3 ఎత్తిపోతల పథకాల ద్వారా 750ఎకరాలకు నీరు అందుతుంది. అక్కడి ప్రజలకు సాగునీరు, తాగునీరు కొరత తీరుస్తుంది. మాణిక్య పురంలోని 500 మత్స్యకారుల కుటుంబాలు వలలో చేపలు పట్టి బతుకుతున్నాయి.**

రొయ్యల చెరువుల పేర్లు చెప్పి భూమి కొన్న తాతారావు దాన్ని కుచేలా రియల్ ఎస్టేట్ పేరిట రిజిస్టర్ చేస్తాడు. మంచి రేటు వస్తుందని అంతా ఎగబడి భూములు అమ్ముకుంటారు. దళారులు, అమ్మిన వారు అంతా జల్సాలకు మరుగుతారు.

హైదరాబాద్ నుండి ప్రముఖ సామాజిక, పర్యావరణ వేత్త ప్రొఫెసర్ నందగోపాల్ రాకతో రహస్యం బయటపడుతోంది. అక్కడ థర్మల్ పవర్ ప్లాంట్ పెట్టబోతున్నారని రాష్ట్ర ప్రభుత్వంలో మంత్రి, లోక్ సభలోని ప్రతిపక్ష పార్టీ ఎంపీ ఇద్దరికీ అందులో వాటాలు ఉన్నాయని తెలుస్తోంది. పార్టీల పరంగా బద్ధశత్రువు లాంటివారు, ఆ ప్రాంతాన్ని వైరి వర్గాలుగా చీల్చిన వారు ఈ విషయంలో ఒక్కటై ప్రజలను మోసం చేయడానికి పూనుకున్నారని తెలుసుకుంటారు. అయినా వాళ్ళు థర్మల్



వ్యాసం

ప్లాంట్ వల్ల ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ఉద్యోగాలు పొందుతారని ప్రచారం చేయిస్తుంటారు.

కేంద్ర ప్రభుత్వం అంతర్జాతీయ ద్రవ్య సంస్థలను సంతోషపెట్టి మరిన్ని అప్పులు తెచ్చుకోవడానికి వాళ్లు సూచించిన ఓ బహుళజాతి సంస్థకు స్వామి పేట(సోంపేట) థర్మల్ ప్లాంట్ ను కట్టబెట్టాలనుకుంటుంది. వాళ్లకు నేరుగా ఇస్తే దేశంలో అలజడి రేగే ప్రమాదముందని గ్రహించి, బినామీ పేరు మీద కుచేలా రియల్ ఎస్టేట్ కంపెనీకి ఆ ప్రాజెక్టును అప్పజెబుతుంది. అందులో బహుళజాతిసంస్థల పర్యవేక్షణలో కొనసాగే ఆ పవర్ ప్లాంట్ లో ప్రతిపక్ష ఎంపీ, అధికార పార్టీ మంత్రి వాటాదారులు గా ఉంటారు.

ప్రపంచవ్యాప్తంగా పరిరక్షించాల్సిన చిత్తడి భూముల్లో ఒకటైన స్వామి పేట, చిత్తడి భూములను నాశనం చేసి అభివృద్ధి పేరిట థర్మల్ పవర్ ప్లాంట్ కట్టడం ఎంతవరకు సబబు? పవర్ ప్లాంట్ వల్ల కలిగే పర్యావరణ నాశనం ఈ క్రింది విధంగా వుంటుంది.

1. ప్రతిరోజు 40 వేల టన్నుల బూడిద 80 కిలోమీటర్ల దాకా వెదజల్లబడుతుంది. ఈ బూడిద పడినంత మేరకు భూముల్లో పంటలు పండవు. తిండి దొరకదు. జంతు జాల మనుగడ కష్టమే.విదేశీ పక్షులే కాదు, కాకులు, పిచ్చుకలు కనిపించవు. అపురూప జీవాలన్నీ అదృశ్యమవుతాయి.

2. ఉద్యోగాలు పరిమిత సంఖ్యలో ఉంటాయి. ఉన్నత స్థాయి నిపుణులకే అవి స్వంతం.

3. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి పేరిట తమ లాభాల కోసం పారిశ్రామికవేత్తలు విద్యుత్ ప్లాంట్లు పెట్టుకోడానికి వస్తున్నారు.

4. ఇక్కడ పెడితే నీటికి కరువు ఉండదు. విదేశాల నుండి బొగ్గు దిగుమతి చేసుకోవడానికి, కంపెనీ నుండి వెలువడే వ్యర్థాలను పారబోయడానికి సముద్రం ఉపయోగపడుతుంది.

5. దీనివల్ల మత్స్యకారుల జీవితాలు నాశనం అవుతాయి.

లాయర్ రాజశేఖర్, యువ లీడర్ మల్లీశ్వర్‌లు కలిసి కృష్ణారావు మేస్టర్ ఆధ్వర్యంలో బీల గ్రామాల ప్రజలను చైతన్యపరిచి పవర్ ప్లాంట్ నిర్మాణం అడ్డుకోవడానికి సంకల్పిస్తారు.

ఆ వూరి తాసిల్దార్, కలెక్టర్, రాజకీయ నాయకులు ఆ బీలను బంజరు భూమి గా చిత్రీకరిస్తారు. పనికిరాని ఆ భూముల్లో పవర్ ప్లాంట్ పెడితే ఆ ప్రాంతం అభివృద్ధి చెంది, ప్రజల బతుకులు బాగు పడతాయని ప్రచారం చేస్తారు. బీల చుట్టూ ఉన్న గ్రామాలన్నింటిని దత్తత తీసుకుని ఇండ్లు, రోడ్లు, బడులు, ఆసుపత్రులతో అభివృద్ధి కార్యక్రమాలు ఉచితంగా చేస్తామని రెండు వ్యాన్ లలో కంపెనీ వాళ్లు వస్తారు. ప్రజల అభివృద్ధి కోసం, అంతర్జాతీయ గుర్తింపు కోసం అని చెప్పిన మంత్రి నాలుగు బస్సుల్లో ప్రాజెక్టులు ఇతర ప్రాంతాలను తిరిగి రమ్మని పంపుతాడు. ఇంతకు ముందు కట్టిన ఆ ప్రాజెక్టుల వల్ల అక్కడ ప్రజలు పడుతున్న బాధలు తెలుసుకున్న బీల ప్రజలు ఉద్యమించడానికి సంకల్పిస్తారు.

ఆర్.డి.ఓ., తహసీల్దార్, కలెక్టర్లు వచ్చి గ్రామ సభలు పెట్టినా గ్రామస్తులు శాంతించలేదు. వాళ్లను ఎదిరించి మాట్లాడినందుకు నక్సలైట్లని చెప్పి, శాంతి భద్రతల రక్షణ కింద కృష్ణారావు మేష్టారుని, ఇతరులను ఎస్పీ అరెస్టు చేయించగా, ప్రజలు తిరగబడడంతో లాఠీచార్జి జరుగుతుంది. అందరి మీద పోలీసు కేసులు పెట్టి కృష్ణారావు మేష్టార్ని అరెస్టు చేస్తారు. ఇన్ని వ్యతిరేకతల మధ్య శంకుస్థాపన కార్యక్రమం ఏర్పాటవుతుంది. 144వ సెక్షన్ పెట్టి మూడు వేల మంది పోలీసులను దింపుతారు. కంపెనీ గుండాలు సరేసరి. ప్రజాగ్రహం ముందు వాళ్ళెవరూ నిలబడలేకపోతారు. లాఠీ ఛార్జ్ తో క్రూరంగా విరుచుకుపడిన పోలీసులను ఎదిరించకతప్పలేదు ప్రజలకు. పోలీసులు కాల్పులు జరిపి అమాయకుల ప్రాణాలు తీస్తారు. ఇది

**బొగ్గు ఆధారిత థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని నిర్మించదలచుకున్నది సోంపేట మండలంలోని బీలలో. బీల సంవత్సరం పొడుగునా నీరు ఉండే జలవనరు. ఇది సోంపేట చుట్టూ ఉన్న ప్రజలకు, పశు వులకు, పక్షులకు నీటిని అందించి జీవనాధారంగా నిలుస్తుంది. బీల నీటితో సంవత్సరానికి రెండు పంటలు పండిస్తారు. ఈ బీల మీద 1989లో రుస్కుడ్డా, బెంకిలి, కుత్తూమ ప్రాంతాల్లో 3 ఎత్తిపోతల పథకాల ద్వారా 750ఎకరాలకు నీరు అందుతుంది.**

అసెంబ్లీలో గొడవకు దారి తీస్తుంది. మృతుల నష్టపరిహారం నిరాకరించినా, మేష్టారు ఆదేశం మేరకు తీసుకుంటారు. మృతదేహాల ఊరేగింపులో రెచ్చిపోయిన జనాలు ఎంపీ ఇంటిని, ఆయన ఆస్తులను ధ్వంసం చేస్తారు. ఈ ఉద్యమం వెనుక ఉన్న పెద్ద తలకాయలను అడ్డు తొలగిస్తే తప్ప లాభం లేదని నిర్ణయించుకున్న నాయకులు, ముందు వారిని డబ్బులతో కొనుక్కుందామనుకుంటారు. లొంగక పోతే చంపాలనుకుంటారు. థర్మల్ ప్లాంట్ విషయం జటిలంగా మారిందని తెలుసుకున్న ముఖ్యమంత్రి ప్రాజెక్ట్ విరమించే ప్రయత్నం చేస్తానని ప్రకటించాల్సి వస్తుంది. ప్రజల్లో చైతన్యం వెల్లివిరుస్తుంది.

తెలంగాణకు చెందిన ఒక రచయిత సోంపేటను దర్శించి, ఆ క్షేత్ర పర్యటనలో తెలుసుకున్న విషయాలతో నవల రాయడానికి సంకల్పించడం అభినందించ దగ్గ విషయం. నిజ నిర్ధారణ కమిటీ రిపోర్టులా కాకుండా దానికిచ్చిన నవలా రూపం, స్థానిక మాండలికతను సంభాషణలలో జొప్పించిన విధానం బాగుంది. సామ్రాజ్యవాద దోపిడీని ఎదిరించే ఉద్యమాల చరిత్ర మిగతా వారికి ప్రేరణ కలిగించడానికి ఇలాంటి నవలలు దోహదం చేస్తాయి.

సభలు సమావేశాలు




# మహాభారతం విశ్వకావ్యం

మహాభారతం ఒక్క మనదేశానికే కాదు అది విశ్వానికి సంబంధించినదని, ఏకబిగిన చదివే విధంగా వ్యాసాలను సమకూర్చారని, ఈ గ్రంథం ప్రతి గ్రంథాలయంలో ఉండదగిన, విలువలతో కూడినదని ఏనుగు నరసింహారెడ్డి అన్నారు. ఆదివారం రోజున కరీంనగర్‌లోని ఫిలిం భవన్లో ఉదయ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో వైరాగ్యం ప్రభాకర్ అధ్యక్షతన, జి.వి. కృష్ణమూర్తి ప్రార్థనా గీతం ఆలాపనతో ప్రారంభమయిన కార్యక్రమంలో కరీంనగర్ అదనపు పాలనాధికారి తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ ప్రధాన కార్యదర్శి డా. ఏనుగు నరసింహా రెడ్డి" మహాభారతం-సమకాలీనత" గ్రంథాన్ని ఆవిష్కరించారు. అధ్యక్షులు వైరాగ్యం ప్రభాకర్, యూనివర్సిటీ ఆచార్యులు నుండి మొదలుకొని గృహిణి వరకు ఈ మహత్కార్యంలో పాల్గొని మంచి వ్యాసాలు అందించిన రచయితలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యస్.ఆర్.ఆర్. కళాశాల ప్రిన్సిపాల్ కలువకుంట రామకృష్ణ, సాహితీ గౌతమి అధ్యక్షులు గంగ్ర లక్ష్మణరావు, విశిష్ట అతిథిగా విచ్చేసిన ప్రముఖ పద్య కవి వి.ఆర్. గణపతి ప్రసంగించారు. కార్యక్రమంలో టి. నవనీత రావు, మాడిశెట్టి గోపాల్, అనంతాచార్య, కూకట్ల తిరుపతి, బొమ్మకంటి కిషన్, దొమ్మటి శంకర్ ప్రసాద్, వైరాగ్యం రమేష్, కంకణాల రాంరెడ్డి, గుండు రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

**- రిపోర్టర్, తంగేడు**

# స్వామి వివేకానంద జయంతి సభ




జనవరి 11న శ్రీ త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో జరిగిన స్వామి వివేకానంద జయంతి సభలో వివేకానంద స్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు, తెలంగాణ అధికార భాషా సంఘం అధ్యక్షులు దేవులపల్లి ప్రభాకరరావు. వేదికపై గాయకుడు త్రినాథరావు, కళా జనార్ధనమూర్తి, శివపార్వతి. **- రిపోర్టర్, తంగేడు**

# నానీలపై జాతీయ సదస్సు







ఖమ్మం ఎస్ఆర్ & బిజియన్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాల తెలుగు శాఖ మరియు గార్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఐక్యుఎసి సంయుక్తంగా 'తెలుగు నానీలు-ప్రక్రియ-తత్త్వం' అనే అంశంపై 19-1-2021న ఖమ్మంలో నాల్గవ అంతర్జాల జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో నానీల రూపకర్త, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య ఎన్. గోపి ముఖ్య అతిథిగా పాల్గొని వచన కవిత్వంలో విభిన్న జీవన అనుభవాలను కవితాత్మకంగా వ్యక్తపరిచారు. ఎస్. రఘు, జరుపుల రమేష్, రత్న ప్రసాద్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**- కపిల భారతి, రిపోర్టర్**




## తెలంగాణ రూపకములు - త్రివిక్రములు

డా వడ్డేపల్లి కృష్ణ
నవచేతన బుక్ హౌస్
విశాలాంధ్ర - విజయవాడ
సెల్ : 9246541699
వెల. రూ.150/-




## నవభారత నిర్మాత పివి... దేశానికే ఠీవి!

డా కర్నాటి లింగయ్య
నందనవనం, హైదరాబాద్.
సెల్ : 8332947239
వెల. రూ.99/-




## వాసంత సమీరాలు

వకుళ వాసు
వెల: రూ.150
సెల్ : 9989198334




## అచ్చు

డా॥ సిద్దెంకి యాదగిరి
అన్ని పుస్తక షాపులో మరియు
టెలికామ్ నగర్, సిద్ధిపేట్
సెల్ : 8121144773
వెల. రూ.100/-




## ఆర్తి

బైరెడ్డి కృష్ణారెడ్డి
అన్ని పుస్తక షాపులో
సెల్ : 944072211
వెల. రూ.300/-




## ఊయల

గుళ్ళపల్లి తిరుమలకాంతికృష్ణ
గుళ్ళపల్లి కవిత కాంతికృష్ణ
చేర్యాల, సిద్దిపేట్.
సెల్ : 9490003295
వెల. రూ.80/-




## అమ్మ ఒడి

చెన్నూరి సుదర్శన్
హైదర్‌నగర్, హైదరాబాద్.
సెల్ : 9440558748
వెల. రూ.150/-




## జాతీయవాదం చారిత్రక నేపథ్యం

ఎనిశెట్టి శంకర్
తుర్లపాటి లక్ష్మి
సరూర్‌నగర్, హైదరాబాద్.
వెల. రూ.15/-




## మతహింసే ఆయుధంగా...

ఎనిశెట్టి శంకర్
తుర్లపాటి లక్ష్మి, సరూర్‌నగర్,
హైదరాబాద్
సెల్ : 9866630739
వెల. రూ.20/-




## సృష్టికేతనం

శైలజామిత్ర
పాలపిట్ట బుక్స్, హైదరాబాద్.
ఫోన్ : 040-27678430
వెల. రూ.50/-

